మేనమామ
జగన్ చెంత..
పేద పిల్లల
చదువులకు
ఉండదు చింత
ఫ్యాన్ గుర్తుకే
మన ఓటు

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

మేనమామ
జగన్ చెంత..
పేద పిల్లల
చదువులకు
ఉండదు చింత
ఫ్యాన్ గుర్తుకే
మన ఓటు

ఆదివారం 12-05-2024 | విజయవాడ ప్రచురణ | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam | సంపుటి : 72, సంచిక : 320 పేజీలు : 8+టాబ్లాయిడ్, వెల: రూ.6.00

వాలంటీర్లు

దేశంలోనే తొలిసారిగా 2.66 లక్షల వాలంటీర్లను నియమించి పాలన సంస్కరణలను కొత్త పుంతలు తొక్కించిన చరిత్ర జగనన్నది.

గ్రామ, వార్డు సచివాలయాలు

15,004 గ్రామ, వార్డు సచివాలయాలు ఏర్పాటు చేసి ప్రతి ఊరిలో సగటున రెండు వేల జనాభాకు 10 ప్రభుత్వ ఉద్యోగాలు సృష్టించి, పాలనను వికేంద్రీకరించిన ఘన చరిత్ర జగనన్న సొంతం.

విద్య

నాడు–నేడుతో ప్రభుత్వ విద్యావ్యవస్థలో నవశకం లిఖించి, 38వేలకుపైగా పాఠశాలలను ఆధునికీకరించి, పేద పిల్లలకు ఇంగ్లీషు చదువులు అందించి, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఐబీ సిలబస్‌ను వారికి చేరువ చేసి, డిజిటల్ విద్యకు బాటలు పరచి, కార్పొరేట్లకు దీటుగా పేద విద్యార్థులకు యూనిఫాం మొదలు పుస్తకాల వరకు విద్యాకానుక ద్వారా అందించిన దార్శనికుడు జగనన్న.

వైద్యం

ప్రభుత్వ ఆసుపత్రులను, మెడికల్ కాలేజీలను తీర్చిదిద్ది 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమంతో ఇంటింటికీ వైద్యాన్ని చేరువ చేసిన సంస్కరణ శీలి జగనన్న.

నేరుగా నగదు బదిలీ (డీబీటీ)

దేశానికే దిక్సూచిగా అయిదేళ్ల కాలంలో అవినీతికి ఆస్కారం లేకుండా రూ.2.74 లక్షల కోట్ల సంక్షేమ ఫలాలను పేదల ఖాతాల్లో జమ చేసిన చరిత్ర జగనన్నది.

పింఛన్లు

దేశంలో మరే రాష్ట్రంలోనూ లేని విధంగా 66.34 లక్షలకుపైగా అవ్వాతాతలకు ప్రతి నెలా ఒకటో తేదీనే తలుపుతట్టి, వాలంటీర్ల ద్వారా పింఛను అందించిన ఆదర్శ చరిత్ర జగనన్నది.

సామాజిక న్యాయం

కేబినెట్‌లోనూ, పార్టీ పదవుల్లోనూ, అసెంబ్లీ పార్లమెంటు సీట్లలోనూ సగానికిపైగా... ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు కేటాయించి, సామాజిక న్యాయ చరిత్రలో సరికొత్త అధ్యాయం లిఖించిన సామ్యవాది జగన్.

మహిళా సాధికారత

కోటి మందికిపైగా మహిళలకు ఆసరాగా, చేయూతగా-t కాపు నేస్తం, ఈబీసీ నేస్తంగా మారి, అమ్మ ఒడి పట్టి వారి వికాస అధ్యాయానికి శ్రీకారం చుట్టిన పురోగమనవాది జగనన్న.

ఇళ్ల స్థలాలు

ఎప్పుడూ కనీవినీ ఎరుగని విధంగా 31 లక్షల ఇళ్ల పట్టాలు అక్క చెల్లెమ్మల పేరుతో ఇచ్చి, వాటిలో 22 లక్షల ఇళ్లు కట్టుకోవడానికి తోడ్పాటు అందించి వారి సొంతింటి కల నెరవేర్చిన మానవీయ మూర్తి మన జగనన్న.

పోర్టులు/ఫిషింగ్ హార్బర్లు

స్వాతంత్ర్యానంతరం మరెవరూ చేయలేని స్థాయిలో ఏకంగా 4 ఓడరేవులు, 10 ఫిషింగ్ హార్బర్లు నిర్మిస్తూ ఆధునిక ఆంధ్రప్రదేశ్ నిర్మాతగా నిలిచిన చరిత్ర జగనన్నది.

17 మెడికల్ కాలేజీలు

స్వాతంత్ర్యం వచ్చాక ఏడున్నర దశాబ్దాల కాలంలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలలు నిర్మిస్తూ... ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి కట్టుబాటు చాటిన ఆధునిక చరకుడు మన జగనన్న.

జగన్... సంస్కరణల సునామీ!

ADVT ISSUED BY YSR CONGRESS PARTY

సంస్కరణల సారథి... సామాన్యుల పెన్నిధి

మన జగనన్నను గెలిపించుకుందాం...

ఫ్యాన్ గుర్తుకే మన ఓటు

No.1712/Elec. A/A2/2024-76

రామ్‌విలాస్ పాశ్వాన్‌కు ఓటు వేయాలన్న నితీశ్

పాట్నా: బీహార్ సీఎం నితీశ్ కుమార్ మరోసారి పొరపాటు పడ్డారు. దివంగత నేత రామ్‌విలాస్ పాశ్వాన్‌కు ఓటు వేయాలని ప్రజలను కోరారు. 73 ఏళ్ల నితీశ్ కుమార్ శనివారం హాజీపూర్ లోక్‌సభ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నితీశ్ మాట్లాడుతూ 'బీహార్‌కు సంబంధించిన ఏ పనిని వదిలిపెట్టబోం. అది అన్ని విధాలుగా జరుగుతుంది. అందుకే రామ్‌విలాస్ పాశ్వాన్‌కు ఓటు వేయమని చెప్పేందుకు ఇక్కడకు వచ్చా' అని అన్నారు. అయితే నితీశ్ కుమార్ వెంటనే తన తప్పు సరిదిద్దుకున్నారు. రామ్‌విలాస్ పాశ్వాన్ కుమారుడు చిరాగ్ పాశ్వాన్‌కు ఓటు వేయాలని జనాన్ని కోరారు. 'మీరు రామ్‌విలాస్ పాశ్వాన్‌కు అత్యధికంగా ఓట్లు వేశారు. ఇప్పుడు చిరాగ్ పాశ్వాన్‌కు ఓటు వేయండి. అతడు యువకుడు, చురుగ్గా పని చేస్తాడు' అని అన్నారు.

తయారీ రంగానికి అధిక ప్రాధాన్యత: ఖర్గే

న్యూఢిల్లీ: కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే వచ్చే 5 ఏళ్లలో దేశ జీడీపీలో తయారీ రంగ వాటాను 14 నుంచి 20 శాతానికి పెంచుతామని ఆ పార్టీ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రకటించారు. దేశ వ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్న వేళ ఆయన ఎక్స్‌లో సుదీర్ఘ పోస్ట్ చేశారు. 'తయారీరంగ వాటాను పెంచి దేశాన్ని తయారీ రంగ కేంద్రంగా మారుస్తాం. బీజేపీ కంటే కాంగ్రెస్ పాలనలోనే దేశ జీడీపీ ఎక్కువగా ఉండేది. దీనికి విరుద్ధంగా గత పదేళ్లలో తయారీ రంగం వాటా కేవలం 14 శాతం వద్ద నిలిచిపోయింది. వస్తు సేవలను విరివిగా ఉత్పత్తి చేసే ఉత్పాదక శక్తి కేంద్రంగా దేశాన్ని మార్చాలని కాంగ్రెస్ కృతనిశ్చయంతో ఉంది. వ్యాపారాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని పునరుద్ధరించడమే పార్టీ తక్షణ లక్ష్యం. ఉక్కు, లోహాలు, దుస్తులు, టెక్స్‌టైల్స్, సిమెంట్, ఆటోమొబైల్స్, ఎలక్ట్రానిక్ వస్తువులు, ఫార్మాస్యూటికల్స్, ఇంజినీరింగ్ వస్తువులు, పెట్రోలియం ఉత్పత్తులు వంటి బహుళ పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తాం. వచ్చే ఎన్నికల్లో ఇండియా కూటమిని గెలిపించి... బీజేపీకి తగిన బుద్ధి చెప్పాలి' అని ఖర్గే పోస్ట్ చేశారు.

మోదీ బూటకపు మాటలు

ప్రియాంక గాంధీ వాద్రా

నందుర్బార్ (మహారాష్ట్ర) : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఎన్నికల ప్రసంగాలు బూటకపు మాటలని కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ వాద్రా అభివర్ణించారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ నుంచి ధైర్యం, సంకల్పం వంటి లక్షణాలను ఆయన అలవర్చుకోవాలని అన్నారు. మహారాష్ట్రలోని నందుర్బార్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి గోవాల్ పద్వికి మద్దతుగా ఇక్కడ నిర్వహించిన ర్యాలీని ఉద్దేశించి ఆమె ప్రసంగిస్తూ, గిరిజనులు అధికంగా ఉండే ఈ నియోజకవర్గంలో ప్రధాని మోదీ బహిరంగ సభలో ప్రసంగించిన ఒక రోజు తర్వాత, ఆదివాసీల (గిరిజనుల) సంస్కృతి, సంప్రదాయాలను బీజేపీ గౌరవించడం లేదని విమర్శించారు. 'మోదీజీ మాట్లాడేవన్నీ 'ఖోఖ్లీ బాతే' (బూటకపు మాటలు) అంటే ఏమీ ఉండదు. నిన్న, తాను శబరిని గౌరవిస్తానని చెప్పాడు. అయితే ఉన్నావ్, అలాగే హత్రాస్‌లో అనేక మంది శబరిలు దౌర్జన్యానికి గురైనప్పుడు ఆయన ఎందుకు మౌనంగా ఉన్నారు? ఎందుకు లేవనెత్తలేదు? వేధింపులకు వ్యతిరేకంగా మహిళా మల్లయోధులు వీధుల్లో ఎందుకు వేలెత్తి చూపలేదు? కానీ నిందితుడి కుమారుడికి టికెట్ ఇచ్చారు' అని లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న బీజేపీ నాయకుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను ఉద్దేశించి ఆమె అన్నారు. రాముడు సామాన్య ప్రజలను గౌరవిస్తాడని, వారి కోరికలను నెరవేర్చడానికి కట్టుబడి ఉన్నాడని ఆమె అన్నారు. 'మీకు ఎలాంటి నాయకుడు కావాలి? 4 వేల కిలోమీటర్లు నడిచి మీ సమస్యలను అర్థం చేసుకోవడానికి మీ వద్దకు వచ్చే వాడా లేదా మీ దగ్గరకు రావడానికి భయపడే నాయకుడు మీకు కావాలా?, నీ కన్నీళ్లు తుడిచేవాడా లేదా వేదికపై మొసలి కన్నీరు కార్చేవాడా?, ఒత్తిడితో నిమిత్తం లేకుండా నిజాలు మాట్లాడే నాయకుడు కావాలా?' అని ప్రశ్నించారు. ప్రజలకు సిద్ధాంతాలు, సేవ, అంకితభావంతో కూడిన రాజకీయాలు కావాలా లేదా అధికారం, స్వీయ కీర్తి రాజకీయాలు కావాలా అని ఆమె ప్రజలను అడిగారు. నందుర్బార్‌తో తన కుటుంబానికి ఉన్న పాత సంబంధాలను ప్రస్తావిస్తూ, తన నాయనమ్మ, మాజీ ప్రధాని ఇందిరా గాంధీ ఎప్పుడూ ఇక్కడ నుంచే ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించేవారని చెప్పారు. నీరు, అడవులపై మీ హక్కులను కాపాడటానికి సోనియా గాంధీ పని చేశారని అన్నారు. ప్రజల సమస్యలను అర్థం చేసుకోవడానికి ఇందిరా గాంధీ తల వంచుకుని వారి ఇళ్లకు వెళ్లేవారని, ప్రజల ఆకాంక్షలు, భావాలను అర్థం చేసుకునేందుకు రాహుల్ గాంధీ దేశమంతటా వెళ్లారని ప్రియాంక వివరించారు. 'అయితే మోదీజీ గిరిజనులు, పేదల ఇళ్లకు వెళ్లి వారి సమస్యలను అర్థం చేసుకునేందుకు వెళుతున్నట్లుగా ఉన్న ఒక్క ఫోటోను నాకు చూపించండి. ఆయన కేవలం తన రాజకీయ ప్రయోజనాల కోసం మీ వద్దకు వస్తున్నారు. మీ బ్యాంకు ఖాతాల్లో రూ.15 లక్షలు జమ చేస్తామని, రెండు కోట్ల మందికి ఉపాధి లభిస్తుందని ప్రధాని చెబితే, అది 10 ఏళ్లలో జరిగి ఉండాల్సింది' అని ఆమె అన్నారు. ఆదివాసీల సంస్కృతీసంప్రదాయాలను గౌరవించడం రాజకీయ నేతల కర్తవ్యమని, ఈ విషయాలపై బీజేపీకి ఏమాత్రం గౌరవం లేదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి తెలిపారు. 'ఆదివాసీ వర్గానికి చెందిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కొత్త పార్లమెంటు భవనాన్ని ప్రారంభించేందుకు లేదా అయోధ్యలో రామ మందిర ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొనడానికి ఆహ్వానించలేదు. వాస్తవానికి గౌరవం ఇచ్చే విషయానికి వస్తే, మోదీ జీ వెనక్కి తగ్గారు' అని ఆమె ఆరోపించారు. 'అవినీతికి వ్యతిరేకంగా తాను ఒంటరి పోరాటం చేస్తున్నానని... మీకు (ప్రధాన మంత్రి) అన్ని అధికారాలు, అధికార యంత్రాంగం మీ వద్ద ఉన్నాయని చెప్పారు. మీ పార్టీ నాయకులు మీరు ప్రపంచంలోనే అతిపెద్ద నాయకుడని, ప్రపంచవ్యాప్తంగా ఉన్న దేశాధినేతల మద్దతును పొందుతున్నారని చెప్పారు. ఎన్నికల సమయంలో మీరు దుర్భాషలాడారు అంటూ చిన్నపిల్లాడిలా ఏడుస్తారు. దమ్ముంటే మోదీజీ, ఇదే ప్రజా జీవితం' అని ఆమె అన్నారు. ఇందిరాగాంధీ నుంచి నేర్చుకోండి... పాకిస్తాన్‌ను రెండు ముక్కలు చేసిన దుర్గ లాంటి మహిళ. ఆమె ధైర్యం, సంకల్పం నుంచి నేర్చుకోండి. కానీ మీరు ఆమెను జాతీయ వ్యతిరేకి అని పిలిచినప్పుడు, మీరు ఆమె నుంచి ఏమి నేర్చుకోవచ్చు' అని అన్నారు. రాజకీయాలు సేవచేసే మాధ్యమమని, మోదీజీ రాజకీయాలను తనకు తానుగా అధికారం సంపాదించుకునే సాధనంగా చేసుకున్నారని ఆమె అన్నారు. ప్రధాని మోదీని పేదలకు కాదు, కోటీశ్వరుల మెస్సీయగా అభివర్ణించిన కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ... ఆయన అత్యున్నత పదవి గౌరవాన్ని తగ్గించారని ఆరోపించారు. 'వాస్తవాన్ని చూసి తదనుగుణంగా ఓటు వేయాల్సిన సమయం ఇది. మీకు ఎలాంటి నాయకుడు, ప్రభుత్వం కావాలో జాగ్రత్తగా ఎన్నుకోండి. మీరు తప్పుడు నిర్ణయం తీసుకుంటే, దేశం ఏ దిశలో పయనిస్తుందో ఎవరూ ఆపలేరు' అని అన్నారు. సత్య మార్గంలో నడవడమే కాంగ్రెస్ రాజకీయాలకు పునాది అని, ప్రజలే సర్వోన్నతులని గుర్తుంచుకోవాలన్నారు. ఆ పునాది మహాత్మా గాంధీ వేశారని, కాంగ్రెస్‌కు చెందిన అనేక మంది నాయకులు ఆ సూత్రాన్ని అనుసరించారని తెలిపారు. 'చాలా మంది బీజేపీ నాయకులు రాజ్యాంగాన్ని మార్చాలని ఎందుకు మాట్లాడుతున్నారు. వారిని ప్రధాని మోదీ అనుమతించడమే ఇందుకు కారణం' అని ప్రియాంక అన్నారు.

నీ దాదాగిరి పని చేయదు

గవర్నరుపై సీఎం మమత ఘాటు వ్యాఖ్యలు

కోల్‌కతా: పశ్చిమబెంగాల్ గవర్నర్ సీవీ ఆనంద బోస్‌పై ఓ మహిళ చేసిన లైంగిక వేధింపుల ఆరోపణలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతున్నాయి. అయితే, ఈ ఆరోపణలను ఖండించిన గవర్నర్... ఘటన జరిగినట్లుగా చెబుతున్న మే 2వ తేదీకి సంబంధించిన సీసీటీవీ ఫుటేజీని సాధారణ పౌరులకు చూపించారు. దీనిపై ముఖ్యమంత్రి మమతా బెనర్జీ శనివారం స్పందించారు. ఆ వీడియోలు ఎడిటెడ్ అని ఆరోపించారు. గవర్నర్ ఇంకా తన పదవికి ఎందుకు రాజీనామా చేయలేదని ప్రశ్నించారు. 'ఎడిట్ చేసిన వీడియోను గవర్నర్ విడుదల చేశారు. నేను మొత్తం ఫుటేజీ చూశాను. అందులో దిగ్భ్రాంతి కలిగించే దృశ్యాలున్నాయి. దీంతో పాటు మరికొన్ని వీడియోల పెన్‌డ్రైవ్ నా దగ్గర ఉంది. ఆయన ప్రవర్తన చాలా అభ్యంతరకరంగా ఉంది' అని మమత దుయ్యబట్టారు. 'దీదీగిరిని సహించబోనని గవర్నర్ అంటున్నారు. కానీ ఆయన దాదాగిరీ ఇక పని చేయదు. మహిళలపై వేధింపులకు పాల్పడిన ఆయన పదవి నుంచి దిగిపోవాలి. ఇంతవరకు ఎందుకు రాజీనామా చేయలేదో కారణాలు చెప్పాలి. ఆయన గవర్నర్‌గా ఉన్నంతకాలం నేను రాజ్‌భవన్‌కు వెళ్లను' అని మమత శపథం చేశారు. గత నెల 24న, ఈనెల 2న గవర్నర్ తనతో అభ్యంతరకరంగా ప్రవర్తించారని రాజ్‌భవన్‌లో పనిచేసే ఓ కాంట్రాక్టు మహిళా ఉద్యోగి పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఉద్యోగం విషయమై తనను గవర్నర్ రెండుసార్లు పిలిపించారని, ఆ రెండు సందర్భాల్లోనూ వేధింపులకు గురిచేసినట్లు ఆమె ఆరోపించారు. అయితే వీటిని ఆనందబోస్ కొట్టిపారేశారు. ఈ క్రమంలోనే నాటి సీసీటీవీ దృశ్యాలను గవర్నర్ సాధారణ పౌరులకు చూపించారు. అయితే, దీనిపై బాధితురాలు అభ్యంతరం వ్యక్తం చేశారు. తన ముఖాన్ని బ్లర్ చేయకుండా వాటిని బయటపెట్టారని ఆవేదన చెందారు. దీనిపై రాష్ట్రపతికి లేఖ రాయనున్నట్లు తెలిపారు.

గుండెపోటుతో ప్రముఖ కవి కన్నుమూత

చండీగఢ్: పంజాబ్‌కు చెందిన ప్రముఖ కవి, రచయిత సుర్జిత్ పటార్ (79) కన్నుమూశారు. గుండెపోటుతో శనివారం ఉదయం ఆయన తుది శ్వాస విడిచారు. దీంతో పంజాబ్ సాహిత్య సమాజం శోకసంద్రంలో మునిగిపోయింది. ఆయన మృతి పట్ల వివిధ రంగాల ప్రముఖులు, మేధావులు, కవులు, రచయితలు, అభిమానులు సంతాపం తెలిపారు. 1945లో జలంధర్ జిల్లాలోని పతర్ కలాన్ గ్రామంలో జన్మించిన డాక్టర్ పటార్... పటియాలాలోని పంజాబ్ యూనివర్సిటీ నుంచి మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేశారు. అనంతరం అమృత్‌సర్‌లోని గురునానక్ దేవ్ విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారు. పంజాబ్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పనిచేసి పదవీ విరమణ పొందారు. సాహిత్య రంగంలో ప్రత్యేక ముద్ర వేశారు. పటార్ సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 2012లో పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది. ఆయనకు 1979లో పంజాబ్ సాహిత్య అకాడమీ అవార్డు, 1993లో సాహిత్య అకాడమీ అవార్డు, 1999లో పంచానంద్ పురస్కారం, 2007లో ఆనంద్ కావ్య సమ్మాన్, 2009లో సరస్వతి సమ్మాన్, గంగాధర్ జాతీయ పద్య పురస్కారం లభించాయి. 2014లో కుసుమాగ్రజ్ లిటరరీ అవార్డు సైతం లభించింది. అయితే కేంద్రం తీసుకొచ్చిన వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న రైతులకు సుర్జిత్ మద్దతు తెలిపారు. చట్టాలు ఉపసంహరించుకోకపోతే తన పద్మశ్రీని వెనక్కి ఇస్తానని ప్రకటించారు.

సీఎం పదవి కోసం ఆత్రుత వద్దు

డీకే శివకుమార్‌కు సోమణ్ణ సూచన

బెంగళూరు: సీఎం పదవి కోసం ఆత్రుత పడరాదని డీకే శివకుమార్‌కు బీజేపీ నేత, తుమకూరు లోక్‌సభ అభ్యర్థి సోమణ్ణ సూచించారు. బెంగళూరులో ఆయన శనివారం మీడియాతో మాట్లాడారు. డీకే శివకుమార్ జేడీఎస్ నేత, మాజీ ప్రధాని దేవెగౌడ కుటుంబంపై విమర్శలు ఆపాలని విన్నవించారు. కుమారస్వామి, డీకే శివకుమార్ మధ్య సాగుతున్న వాగ్వాదం సమంజసంగా లేదన్నారు. తప్పు చేసినవారికి శిక్ష అనివార్యం కావాలని, అయితే వారిద్దరూ గతంలో ఆప్తులుగా ఉన్నారని, ప్రస్తుతం ఈ విషయంలో నిరంతరం కత్తులు దూసుకునేలా మాట్లాడటం తగదన్నారు. జేడీఎస్, కాంగ్రెస్‌లోని ఒక్కలిగ సామాజికవర్గానికి చెందిన వారి మధ్య విభేదాలు తారస్థాయికి చేరుతున్నాయన్నారు. ఇద్దరి తరపున సమాజానికి చెందినవారు రెండుగా చీలిపోతారన్నారు. ఓ ప్రశ్నకు సమాధానంగా డీకే శివకుమార్ ఇప్పటికే అన్ని పదవులు అలంకరించారని, అత్యున్నతమైన సీఎం పదవికి ఓ అడుగు దూరంలో ఉన్నారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పుడు ఆయన సీఎం కావాలని తానూ భావించానన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆత్రుతగా నిర్ణయం తీసుకుంటే ఇబ్బందులు తప్పవని అభిప్రాయపడ్డారు.

బీజేపీ నేత లైంగికదాడి...అరెస్టు

బెంగళూరు: కర్నాటకలో జేడీఎస్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ లైంగిక దౌర్జన్యం కేసు దేశవ్యాప్తంగా సంచలనం రేపింది. ఈ వ్యవహారంలో రేవణ్ణ దారుణాల గురించి ముందే హెచ్చరించిన న్యాయవాది, బీజేపీ నేత దేవరాజే గౌడను పోలీసులు అరెస్ట్ చేశారు. చిత్రదుర్గ్‌లోని గులిహాల్ టోల్‌గేట్ వద్ద ఆయన్ని అదుపులోకి తీసుకున్నారు. తనను దేవరాజ్ గౌడ లైంగిక వేధింపులకు గురిచేశారంటూ ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఈ చర్యలు తీసుకున్నారు. కర్నాటకలో జేడీఎస్‌తో పొత్తుకు ముందే... ప్రజ్వల్ రేవణ్ణ లైంగిక దౌర్జన్యాల గురించి బీజేపీ అధిష్ఠానాన్ని దేవరాజే గౌడ ముందే అప్రమత్తం చేసినట్లు ఇటీవలే వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. లోక్‌సభ ఎన్నికల్లో ప్రజ్వల్ రేవణ్ణకు మద్దతివ్వొద్దంటూ బీజేపీకి గతేడాది ఆయన సూచించారు. ప్రజ్వల్ రేవణ్ణ లైంగిక దౌర్జన్యాల వీడియోలు అనేకం ఉన్నాయని, అవి బయటకు వస్తే పార్టీకి చేటు కలుగుతుందని హెచ్చరించారు. ఇక దేవరాజే గౌడ 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజ్వల్ తండ్రి, మాజీ ప్రధాని దేవెగౌడ కుమారుడు హెచ్‌డీ రేవణ్ణపై పోటీ చేసి ఓడిపోయారు. అయితే, హసన్ జిల్లాకు చెందిన ఓ మహిళ... తనను దేవరాజే మోసం చేశాడంటూ ఇటీవలే పోలీసులను ఆశ్రయించింది. ఆస్తి విక్రయించడంలో సాయం చేస్తానని నమ్మించి తనపై లైంగిక దాడికి పాల్పడినట్లు ఫిర్యాదు చేసింది. మహిళ ఫిర్యాదు మేరకు దేవరాజే గౌడపై లైంగిక వేధింపుల కేసు నమోదు చేసిన పోలీసులు తాజాగా ఆయన్ని అదుపులోకి తీసుకున్నారు.

మద్యానికి బానిసై... కుటుంబాన్ని చంపిన కిరాతకుడు

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని సీతాపూర్‌కు చెందిన పల్హాపూర్ గ్రామంలో శనివారం ఓ వ్యక్తి తన భార్య, తల్లి, ముగ్గురు పిల్లలను హతమార్చి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పల్హాపూర్‌కు చెందిన అనురాగ్ సింగ్(42) మద్యానికి బానిసై కుటుంబసభ్యులతో తరచూ గొడవ పడేవాడు. అతడిని వారు అనేకసార్లు డి-అడిక్షన్ సెంటర్‌లో చేర్చడానికి ప్రయత్నించినా సహకరించలేదు. శనివారం అతడిని డి- అడిక్షన్ సెంటర్‌లో చేరుస్తామని కుటుంబసభ్యులు చెప్పడంతో అనురాగ్ తల్లి, భార్యతో గొడవపడ్డాడు. వారి మధ్య వివాదం ముదరడంతో తీవ్ర ఆగ్రహానికి గురైన అనురాగ్ తల్లిని కాల్చి చంపాడు. అనంతరం తన భార్య ప్రియాంక (40)ను సుత్తితో కొట్టి హత్య చేశాడు. ఆపై వారి ముగ్గురు పిల్లలను ఇంటిపై నుంచి తోసేశాడు. దీంతో ముగ్గురు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు.

అనంతరం తనను తాను కాల్చుకుని చనిపోయాడు. ఒకే కుటుంబంలో ఆరుగురు చనిపోవడం, ప్రేమను పంచాల్సిన తండ్రి ముగ్గురు పిల్లలను దారుణంగా హత్య చేయడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు, ఫోరెన్సిక్ బృందాలు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టానికి తరలించామని వారు తెలిపారు. ఈ కేసుపై విచారణ కొనసాగుతోందని, దర్యాప్తు పూర్తయిన అనంతరం కేసు నమోదు చేస్తామని పోలీసులు పేర్కొన్నారు.

'మందు ప్రభావం'తో కేజ్రీవాల్ మాటలు: బీజేపీ

న్యూఢిల్లీ: అమిత్‌షాను తదుపరి ప్రధానమంత్రిని చేస్తారంటూ ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ శనివారం చేసిన వ్యాఖ్యలపై బీజేపీ ఘాటుగా స్పందించింది. 'ఆల్కహాల్ ప్రభావం'తో ఆయన ఇలా మాట్లాడుతున్నారని విమర్శలు గుప్పించింది. ఎక్సైజ్ పాలసీ కేసులో మధ్యంతర బెయిలుపై కేజ్రీవాల్ శుక్రవారం సాయంత్రం విడుదలైనప్పటి నుంచి బీజేపీ, ఆప్ మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. నేరస్తులను కూడా పెరోల్‌కు అనుమతిస్తున్నారని, దాని అర్థం సీఎం నిర్దోషిగా నిరూపణ అయినట్టు కాదని బీజేపీ ఎద్దేవా చేసింది. మోదీ త్వరలో రిటైర్ కాబోతున్నారని, తదుపరి ప్రధానిగా అమిత్‌షాను చేస్తారని కేజ్రీవాల్ వ్యాఖ్యానించడంపై బీజేపీ జాతీయ ప్రతినిధి, రాజ్యసభ ఎంపీ సుధాన్షు త్రివేది వెంటనే స్పందించారు. కేజ్రీవాల్ ఆల్కహాల్ ప్రభావంతో ఇలాంటి మాటలు మాట్లాతున్నారని అన్నారు. 'ఆల్కహాల్ ప్రభావమో, ఆయన (కేజ్రీవాల్) వెళ్లిన ప్రదేశం ప్రభావమో కానీ ఒక విషయం మాత్రం ఆయన నోటి నుంచి సరిగానే వచ్చింది. మరోసారి మోదీ ప్రధాని అవుతారని ఆయన అంగీకరించినందుకు నేను ధన్యవాదాలు చెబుతున్నాను. ఒక్కోసారి ఆల్కహాల్ తీసుకున్న వ్యక్తి నియంత్రణ కోల్పోతాడు. అప్పుడు వాస్తవాలు కొన్ని బయటకు వస్తుంటాయి. మోదీ ప్రధాని అవుతారని అంగీకరించడంతో పాటు ఆయన వారసుడెవరవుతారో కూడా చెప్పడం మొదలుపెట్టారు' అని మీడియాతో మాట్లాడుతూ త్రివేది అన్నారు. రాబోయే 20 ఏళ్లు 'ఆప్'ను ఏ పార్టీ అడ్డుకోలేదంటూ కేజ్రీవాల్ చేసిన వ్యాఖ్యలపై త్రివేది స్పందిస్తూ... పదేళ్ల క్రితం ఆయన రాజకీయాల్లోకి రానని, కాంగ్రెస్ మద్దతు తీసుకోనని, కారు, బంగ్లా, భద్రత అవసరం లేదని చాలా చెప్పారని గుర్తుచేశారు. అయితే పదేళ్లలోనే ఆయన చాలా మారిపోయారని, 20 ఏళ్ల తర్వాతైనా ఆయన తప్పుకుంటారా? లేదా? అని ప్రశ్నించారు. కేవలం పదేళ్లలోనే కొత్త రాజకీయం పేరుతో ఆయన అతి ప్రమాదకరమైన రాజకీయాలు నడిపారని, ఇవాళ రాజకీయాలు ఈ దశకు రావడానికి ఈ తరహా పాలిటిక్సే కారణమని, కొత్త తరహా రాజకీయాలతో ప్రయోగం చేసే సమయం ఇది కాదని అన్నారు. సమర్థుడు, కాలపరీక్షకు నెగ్గిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో పటిష్ట జాతీయ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ఇదే మంచి తరుణమని త్రివేది సూచించారు.

నా కుమారుడు సమర్థుడు

మేనకా గాంధీ

న్యూఢిల్లీ: తన కుమారుడు వరుణ్ గాంధీ సమర్థుడైన నాయకుడని ఆయన తల్లి మేనకా గాంధీ స్పష్టం చేశారు. అతడిపై తనకు విశ్వాసం ఉందన్నారు. కొందరు ఎంపీలైన తర్వాత రాజకీయ నాయకులవుతారు. మరికొందరు ఎంపీ అవకుండానే రాజకీయ నాయకులవుతారని ఆమె అన్నారు. అందుకు మాజీ ప్రధాని చంద్రశేఖర్ అంశాన్ని ఆమె ప్రస్తావించారు. ఈ ఎన్నికల్లో ఫిలిబిత్ లోక్‌సభ స్థానాన్ని వరుణ్ గాంధీకి బీజేపీ అగ్రనాయకత్వం కేటాయించ లేదు. దీంతో వరుణ్ గాంధీ భవిష్యత్ ఏమిటంటూ విలేకరులు అడిగిన ప్రశ్నకు మేనకా గాంధీ పైవిధంగా సమాధానమిచ్చారు. అయితే పార్టీ నిర్ణయాన్ని తాను వ్యతిరేకించనని ఆమె తెలిపారు. ఎన్నికల బరిలో ఎవరిని అభ్యర్థులుగా నిలపాలనేది పార్టీ నిర్ణయమన్నారు. సుల్తాన్‌పూర్ నుంచి మరోసారి ఎంపీ అభ్యర్థిగా బరిలో నిలవడం పట్ల మేనకా గాంధీ సంతోషం వ్యక్తం చేశారు. ఈ నియోజకవర్గ ప్రజలకు మరోసారి సేవ చేసుకునే అవకాశం తనకు కలిగిందన్నారు. సుల్తాన్‌పూర్ పొరుగున ఉన్న రాయ్‌బరేలీ నుంచి బరిలో దిగిన రాహుల్ గాంధీపై స్పందించేందుకు ఆమె నిరాకరించారు. రాహుల్ గాంధీకి అత్యంత సన్నిహితుడు శ్యామ్ పిట్రోడా ఇటీవల చేసిన వారసత్వ పన్ను వ్యాఖ్యలపై మేనకాగాంధీ స్పందించారు. ఈ విధానాన్ని తాను వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. గత ఎన్నికల్లో వరుణ్ గాంధీ ఫిలిబిత్ లోక్‌సభ స్థానం నుంచి విజయం సాధించారు. అయితే ఈ ఎన్నికల్లో ఆ లోక్‌సభ స్థానాన్ని మరొకరికి బీజేపీ కేటాయించిన సంగతి తెలిసిందే.

కాంగ్రెస్‌కు విపక్ష హోదా కూడా దక్కదు: మోదీ

భువనేశ్వర్: బీజేపీ తొలిసారిగా ఒడిశా అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు సాధించి డబుల్ ఇంజన్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఈ నెల 13న ఒడిశాలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో కాంధమాల్‌లో శనివారం జరిగిన ఎన్నికల ర్యాలీలో మోదీ మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో 400కు పైగా సీట్లలో ఎన్డీయే గెలువనుందని, విపక్షంలో కూర్చునేందుకు అవసరమైన సీట్లు కూడా కాంగ్రెస్‌కు రావని జోస్యం చెప్పారు. 'జూన్ నాలుగున ఎన్డీయేకు 400కు పైగా సీట్లను కట్టబెట్టేందుకు దేశ ప్రజలు స్థిరనిశ్చయంతో ఉన్నారు. కాంగ్రెస్‌కు విపక్షంలో కూర్చునేందుకు అవసరమైన సీట్లు కూడా రావు. 50 కంటే తక్కువ సీట్లే వారికి వస్తాయి' అని మోదీ అన్నారు. ఒడిశా ప్రజలు తన పట్ల అపారమైన ప్రేమ, మద్దతు కనబరుస్తున్నారని, ప్రజలు తనమీద ఉన్న నమ్మకాన్ని ఏమాత్రం వమ్ము చేయకుండా నిస్వార్థ సేవ చేస్తానని ప్రధాని హామీ ఇచ్చారు. 26 ఏళ్ల క్రితం ఈరోజే అటల్ బిహారీ వాజ్‌పేయి ఇక్కడ పోఖ్రాన్ పరీక్ష నిర్వహించారని, అది ప్రపంచంలోని భారతీయులందరికీ గర్వకారణమైందని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ మాత్రం పాకిస్థాన్ దగ్గర కూడా అణుశక్తి ఉందంటూ భారతీయుల మనసుల్లో భయాలు నాటుతోందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్... తమ హయాంలో ఉగ్రదాడులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని, ఓటు బ్యాంకు భయాలే అందుకు కారణమమని విమర్శించారు. కాంగ్రెస్ బలహీనమైన మైండ్‌సెట్ కారణంగానే జమ్మూకశ్మీర్ ప్రజలు దశాబ్దాలుగా బాధితులయ్యారని అన్నారు. 26/11 దాడుల తర్వాత కూడా కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకు భయాలతో ఎలాంటి దర్యాప్తు జరిపించలేదన్నారు. వికసిత్ భారత్‌లో వికసిత్ ఒడిశా కోసం ప్రజల ఓటు చాలా ముఖ్యమని, మీ ఒక్క ఓటుతో ఇక్కడ డబుల్ ఇంజన్ ప్రభుత్వం ఏర్పడుతుందని, కమలం బటన్ నొక్కి బీజేపీ అభ్యర్థి విజయానికి సహకరించాలని మోదీ పిలుపునిచ్చారు.

అణుబాంబు వ్యాఖ్యలపై ప్రధాని ఆగ్రహం

పాకిస్థాన్ వద్ద అణ్వాయుధాలున్నాయంటూ కాంగ్రెస్ సీనియర్ నేత మణిశంకర్ అయ్యర్ చేసిన వ్యాఖ్యలపై ప్రధాని మోదీ విరుచుకుపడ్డారు. ఇప్పటికే వర్చువల్‌గా చనిపోయిన ఈ వ్యక్తులు... ఇప్పుడు భారతదేశ ఆత్మను కూడా చంపేందుకు ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. సొంత దేశ ప్రజలనే భయపెట్టేందుకు కాంగ్రెస్ కొత్త మార్గాల్ని వెతుకుతోందంటూ ఆరోపించారు. పాక్ వద్ద అణ్వాయుధాలు ఉన్నా... వాటిని ఉంచుకోవాలా... వద్దా... అనే దీనస్థితిలో ఆ దేశం ఉందంటూ సెటైర్లు వేశారు. 'కాంగ్రెస్ తన సొంత దేశాన్ని భయపెట్టేందుకు ప్రయత్నిస్తోంది. పాకిస్థాన్ వద్ద అణ్వాయుధాలు ఉన్నాయి కాబట్టి, ఆ దేశాన్ని గౌరవించాలని వాళ్లు చెబుతున్నారు. చచ్చిన శవంలా మారిన ఈ వ్యక్తులు భారతదేశ ఆత్మను సైతం చంపుతున్నారు. గత 60 ఏళ్లుగా జమ్మూకశ్మీర్ ప్రజలు తీవ్రవాదాన్ని ఎదుర్కొన్నారని, అందుకు కారణం కాంగ్రెస్ అని ఆరోపించారు. ఉగ్రవాద సంస్థలతో వాళ్ల సమావేశాలు నిర్వహించడాన్ని మన దేశం ఎప్పటికీ మర్చిపోదని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

'ఒడిశాలో ఎన్ని జిల్లాలు ఉన్నాయో పేపర్ చూడకుండా చెప్పండి'

ఎన్నికల ప్రచార సభలో ముఖ్యమంత్రి, బీజేడీ నేత నవీన్ పట్నాయక్‌కు మోదీ సవాల్ విసిరారు. ఒడిశాను సుదీర్ఘ కాలంగా పాలించిన పట్నాయక్ పేపరు చూడకుండా అన్ని జిల్లాల పేర్లు చెప్పాలని ఛాలెంజ్ చేశారు. 'నవీన్ బాబుకు ఒక సవాలు విసురుతున్నాను. సుదీర్ఘ కాలంగా పాలన సాగిస్తున్న ఆయన రాష్ట్రంలోని జిల్లాల పేర్లు, వాటి రాజధానుల పేర్లు పేపరు చూడకుండా చెప్పగలరా అని ప్రశ్నిస్తున్నాను. జిల్లాల పేర్లే ఆయన చెప్పలేకపోతే మీ (ప్రజల) బాధ ఆయనకు ఎలా తెలుస్తుంది' అని నిలదీశారు. పజల జీవన ప్రమాణాలు మెరుగపరిచేందుకు తాను కట్టుబడి ఉంటానని చెప్పారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు ఈ నెల 13న ప్రారంభమై జూన్ ఒకటి వరకూ జరుగనున్నాయి.

లైంగిక వేధింపుల ఆరోపణ కేసు

వీసా లేకుండా ప్రజ్వల్ రేవణ్ణ విదేశాలకు ఎలా వెళ్లారు?

న్యూఢిల్లీ : జనతాదళ్ (సెక్యులర్) ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణపై లైంగిక వేధింపుల కేసు దర్యాప్తు కొనసాగుతున్నప్పటికీ ఆయన భారతదేశం విడిచిపెట్టడంతో కేంద్ర ప్రభుత్వం దౌత్య పాస్‌పోర్ట్‌లపై దృష్టి సారించింది. ప్రజ్వల్ రేవణ్ణను భారతదేశానికి తిరిగి తీసుకువచ్చి ప్రశ్నించడానికి ఆయనకు సంబంధించిన దౌత్యపరమైన మినహాయింపును రద్దు చేయాలని కర్నాటక ప్రభుత్వం ఇప్పుడు ప్రధాని నరేంద్ర మోదీని అభ్యర్థించింది. ప్రజ్వల్ రేవణ్ణ మాజీ ప్రధాని దేవెగౌడ మనవడు.

దౌత్యపరమైన పాస్‌పోర్ట్ అంటే ఏమిటి?

దౌత్యపరమైన పాస్‌పోర్ట్‌లు అంతర్జాతీయ చట్టం ప్రకారం ప్రత్యేకాధికారాలు కలిగి ఉంటాయి. ప్రాథమికంగా సాధారణ పాస్‌పోర్ట్‌లకు భిన్నంగా ఉంటాయి. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) జారీ చేసిన దౌత్య పాస్‌పోర్ట్‌లను ఎవరికి ఇస్తారంటే... అధికారిక హోదాల్లో ప్రభుత్వానికి ప్రాతినిధ్యం వహించే దౌత్య హోదా కలిగిన వారికి, విదేశాల్లో అధికారిక కార్యకలాపాల కోసం ప్రభుత్వం నియమించిన వారికి, ఇండియన్ ఫారిన్ సర్వీస్ (ఐఎఫ్ఎస్) కు చెందిన జాయింట్ సెక్రటరీ హోదా, అంతకంటే ఉన్నతాధికారులకు, ఐఎఫ్ఎస్, ఎంఈఏ అధికారుల కుటుంబ సభ్యులు, బంధువులకు, అలాగే, అధికారిక ప్రభుత్వ ప్రయాణాన్ని చేపట్టే కేంద్ర మంత్రులు, ఎంపీలు ఈ దౌత్య పాస్‌పోర్ట్‌లను కలిగి ఉంటారు. ఇవి ఐదు సంవత్సరాలు లేదా అంతకంటే తక్కువ కాలం చెల్లుబాటు అవుతాయి. ఇదిలాఉండగా, ప్రజ్వల్ రేవణ్ణ ఉదంతం 2011లో ఏర్పాటయిన జర్మనీతో భారత్ వీసా మినహాయింపు ఒప్పందాన్ని వెలుగులోకి తెచ్చింది. ఈ ఒప్పందం భారతీయ దౌత్య పాస్‌పోర్ట్ కలిగిన వారు 90 రోజుల వరకు వీసా లేకుండా జర్మనీకి వెళ్లేందుకు వీలు కల్పిస్తుంది. అయితే, వీసా మినహాయింపు ఉన్నప్పటికీ, దౌత్యపరమైన పాస్‌పోర్ట్‌లు కలిగిన వ్యక్తులు విదేశాలలో ప్రైవేట్ సందర్శనల కోసం ముందస్తు రాజకీయ అనుమతిని పొందవలసి ఉంటుంది. పాస్‌పోర్ట్ చట్టం 1967 ప్రకారం, పాస్‌పోర్ట్ అథారిటీ నిర్దిష్ట పరిస్థితులలో దౌత్య పాస్‌పోర్ట్‌ను రద్దు చేయవచ్చు. అదేవిధంగా ఈ పాస్‌పోర్ట్ కలిగిన వారు నేర విచారణ సమయంలో కోర్టు ఆదేశాలపై దౌత్య పాస్‌పోర్ట్‌లను రద్దు చేయవచ్చు. అయితే జర్మనీలో ఉన్నట్లు చెబుతున్న ప్రజ్వల్ రేవణ్ణపై కర్నాటక ప్రభుత్వం బ్లూ కార్నర్ నోటీసు జారీ చేసింది. ఈ కేసులో దర్యాప్తు సంస్థల విచారణకు ఈ నోటీసు దోహదపడుతుంది.

ముద్దులతో ఓ జంట నిరసన

రాయ్‌పూర్: బీజేపీ ఎమ్మెల్యే కార్యాలయం వద్ద ఒక జంట ముద్దుల్లో మునిగిపోయింది. ఓయో రూమ్‌లను ఆయన మూయించడంపై ఆ దంపతులు ఈ మేరకు నిరసన వ్యక్తం చేశారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయింది. చత్తీస్‌గఢ్‌లోని వైశాలి నగర్‌లో ఈ ఘటన జరిగింది. ఓయో రూమ్స్ ముసుగులో వ్యభిచార వ్యాపారం జరుగుతోందని స్థానిక బీజేపీ ఎమ్మెల్యే రికేశ్ సేన్ ఆరోపించారు. పోలీసులతో కలిసి ఓయో హోటల్స్‌పై దాడులు చేయించి వాటిని మూసివేయించారు. కాగా, భార్యాభర్తలు దీనిపై వినూత్నంగా నిరసన తెలిపారు. బీజేపీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం బయట ముద్దుల్లో మునిగిపోయారు. వైశాలి నగర్‌లో ఓయో రూమ్స్‌ను ఆ ఎమ్మెల్యే మూయించడంపై వారు నిరసన వ్యక్తం చేశారు.

ఆదివారం
12-05-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 320
పేజీలు : 8+టాబ్లాయిడ్, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

జెలెన్‌స్కీ హత్యకు కుట్ర.. బాడీగార్డ్ చీఫ్‌పై వేటు

కీవ్: ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ సహా మరికొందరు సైనిక అధికారులు, రాజకీయ నేతలను హతమార్చేందుకు రష్యా పన్నిన కుట్రను తాము భగ్నం చేశామని ఉక్రెయిన్ అధికారులు కొద్దిరోజుల క్రితం ప్రకటించారు. ఈ ఘటనతో తన వ్యక్తిగత రక్షణను పర్యవేక్షించే విభాగాధిపతిపై అధ్యక్షుడు వేటు వేశారు. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో స్టేట్ ప్రొటెక్షన్ డిపార్ట్‌మెంట్ అధిపతి సెర్గియ్ లియోనిడోవిచ్ రుడ్‌ను తొలగించినట్లు వెల్లడించారు. అయితే ఆయన్ను తప్పించడానికి గల కారణాలను మాత్రం బయటపెట్టలేదు. ఇదిలా ఉంటే... కొద్దిరోజుల క్రితం వెలుగులోకి వచ్చిన ఈ కుట్రకు సంబంధించి స్టేట్ గార్డ్ విభాగానికి చెందిన ఇద్దరు కర్నల్స్‌ను అదుపులోకి తీసుకున్నారు.

మూగబోయిన మైకులు

- తెలుగు రాష్ట్రాల్లో ముగిసిన ప్రచార ఘట్టం
- పోటాపోటీగా నేతల ప్రసంగాలు
- నిశ్శబ్ద కాలం ప్రారంభం
- రేపు పోలింగ్‌కు సర్వం సిద్ధం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తెలుగు రాష్ట్రాల్లో శనివారం సాయంత్రం 6 గంటలతో ఎన్నికల ప్రచార ఘట్టం ముగిసింది. ఎన్నికల కమిషన్ నిబంధనలు అమలులోకి రావడంతో ఎక్కడి మైకులు అక్కడే మూగబోయాయి. రాజకీయ నేతల ప్రసంగాలు నిలిచిపోయాయి. చివరి రోజు నేతలు తమ సభల్లో ప్రసంగాలతో హోరెత్తించారు. ప్రజలకు అనేక హామీల జల్లులు కురిపించారు. అంతకుముందు భారీగా పార్లమెంట్, అసెంబ్లీల పరిధిలో అభ్యర్థులు ర్యాలీలు, సభలు నిర్వహించారు. తమ అనుచరగణంతో బల ప్రదర్శనలు చేశారు. ఏప్రిల్ 18వ తేదీన రాష్ట్రంలోని 175 అసెంబ్లీ, 25 లోక్‌సభ అసెంబ్లీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైంది. అటు తెలంగాణ రాష్ట్రంలోను 17 లోక్‌సభ, ఒక అసెంబ్లీ ఉప ఎన్నిక (కంటోన్మెంట్) కు హోరెత్తిన రాజకీయ పార్టీల మైకులు ఒక్కసారిగా మౌనం దాల్చాయి. ఆంధ్ర ప్రదేశ్‌లో మునుపెన్నడూ లేనంతగా రాజకీయం వేడెక్కింది. అటు ఈనెల 13న పోలింగ్‌కు ఎన్నికల కమిషన్ సర్వం సిద్ధమైంది. 13వ తేదీన జరిగే పోలింగ్‌కు 48 గంటల ముందు ఎలాంటి ప్రచారం లేకుండా నిశ్శబ్ద కాలం అమలులోకి వచ్చింది. జూన్ 1వ తేదీ సాయంత్రం 6.30 గంటల వరకు ఎలాంటి సర్వేలు, ఎగ్జిట్‌పోల్స్ వెల్లడించడం, ప్రసారం

- మిగతా 5 లో

పదేళ్లు ప్రత్యేక హోదా ఇస్తాం

- సిబిఐ ఛార్జిషీటులో వైఎస్ పేరు కాంగ్రెస్ చేర్చలేదు
- బీజేపీ కనుసన్నల్లో ఏపీ పాలన
- కడప సభలో రాహుల్‌గాంధీ

విశాలాంధ్ర బ్యూరో-కడప: ఇండియా కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇస్తామని, పోలవరం ప్రాజెక్టు నిర్మిస్తామని, కడప స్టీల్ ప్లాంట్ నిర్మిస్తామని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ హామీ ఇచ్చారు. వైఎస్ రాజశేఖరరెడ్డి పేరును సీబీఐ చార్జిషీటులో కాంగ్రెస్ పెట్టలేదని చెప్పారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏపీసీసీ అధ్యక్షురాలు, కడప ఎంపీ అభ్యర్థి వైఎస్ షర్మిలారెడ్డి, అసెంబ్లీ అభ్యర్థులకు మద్దతుగా శనివారం పుత్తా ఎస్టేట్‌లో నిర్వహించిన భారీ బహిరంగసభలో రాహుల్‌గాంధీ ప్రసంగించారు. అంతకుముందు ఆయన ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్‌కు చేరుకుని నివాళులర్పించారు.

రాహుల్‌గాంధీ మాట్లాడుతూ కాంగ్రెస్, వైఎస్సార్ ఒక్కటే అన్నారు. కాంగ్రెస్ పార్టీ వైఎస్సార్ ఆలోచనలకు వ్యతిరేకం కాదన్నారు. వైఎస్సార్ బిడ్డ, తన చెల్లెలు షర్మిలారెడ్డి మీ ముందు నిలబడిందని, తన చెల్లిని పార్లమెంటుకు పంపాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్ సైద్ధాంతిక విలువలు షర్మిలలో ఉన్నాయన్నారు. రాష్ట్ర హక్కులు దిల్లీలో వినపడాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాలన్నారు. విభజన హామీలను బీజేపీ ఒక్కటీ అమలు చేయలేదని రాహుల్ విమర్శించారు. రాష్ట్రంలో అవినీతి సర్కారు నడుస్తోందని ఆరోపించారు. 2014లో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వచ్చి వుంటే అన్ని హామీలు అమలయ్యేవన్నారు. 2024లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఇచ్చిన ప్రతి వాగ్దానం అమలు చేస్తామన్నారు. వైఎస్సార్ దేశానికి మార్గదర్శకుడన్నారు. ఆయన పాదయాత్ర తనకు ఆదర్శమన్నారు. ఆయన ఆదర్శంతోనే జోడో యాత్ర చేశానన్నారు. పాదయాత్ర ద్వారా ప్రజల కష్టాలు తెలుస్తాయన్నారు. భారత్ జోడో ద్వారా దేశపు వీధుల్లో తిరిగానన్నారు. సామాజిక న్యాయం కోసం వైఎస్సార్ రాజకీయం చేశాడన్నారు. రాష్ట్రాన్ని బీజేపీ బీటీమ్ నడిపిస్తోందని ఆరోపించారు. బీజేపీ అంటే బాబు, జగన్, పవన్ అని, వీళ్ల రిమోట్ ప్రధాని మోదీ చేతుల్లో ఉందన్నారు. మోదీ చేతిలో సీబీఐ, ఈడీ ఉండటంతో ఆ ముగ్గురు మౌనం దాల్చారన్నారు. వైఎస్సార్ సిద్ధాంతం కాంగ్రెస్ సిద్ధాంతమని, అదే బీజేపీ వ్యతిరేక సిద్ధాంతమన్నారు. కానీ జగన్ అందుకు భిన్నంగా బీజేపీతో చెలిమిచేస్తున్నారని ఆరోపించారు. తమ అవినీతి బయటపడుతుందనే భయంతోనే జగన్, చంద్రబాబు నోరు విప్పడం లేదన్నారు. రాజ్యాంగ పరిరక్షణ ఇండియా కూటమి లక్ష్యమన్నారు. రాజ్యాంగాన్ని సర్వనాశనం చేయడానికి ప్రధాని మోదీ కుట్ర చేస్తున్నారన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేసి

తీరతామన్నారు. రూ.2 లక్షల వరకు రైతు రుణమాఫీ చేస్తామని, కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందిస్తామని, నిరుపేదలకు రూ.5 లక్షలతో పక్కా ఇళ్లు కట్టిస్తామన్నారు. 2.25 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్నారు. ప్రతి కుటుంబం నుంచి ఒక పేదమహిళను ఎంపిక చేసి, ఆ మహిళ బ్యాంక్ ఖాతాలో లక్ష రూపాయలు ఏడాదికి ఇస్తామన్నారు.

షర్మిలారెడ్డి మాట్లాడుతూ మోదీ పదేళ్ల కాలంలో విభజన హామీలు అమలు చేయలేదని ఆరోపించారు. బీజేపీ రాష్ట్రానికి వెన్నుపోటు పొడిచిందన్నారు. అలాంటి బీజేపీతో బాబు పొత్తు పెట్టుకోగా... జగన్ తొత్తుగా మారారన్నారు. విభజన హామీలు నెరవేర్చని బీజేపీతో ఎలా పొత్తు పెట్టుకుంటారని ఆమె ప్రశ్నించారు. అందరికి రాజధానులు ఉన్నాయని, మనకు చేతిలో చిప్ప, నెత్తి మీద కుచ్చు టోపీ ఉందన్నారు. చంద్రబాబు సింగపూర్ అన్నాడు, జగన్ మూడు రాజధానులు అన్నారని, ఇద్దరూ రాజధానిని పట్టించుకోలేదని ఆరోపించారు.

సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, కమ్యూనిస్టులు ఏనుగు కుంభస్థలాన్ని కొట్టడానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. దేశాభివృద్ధికి కమ్యూనిస్టులు, కాంగ్రెస్ విశేష కృషి చేశాయన్నారు. ప్రస్తుత

- మిగతా 5 లో

వచ్చేది 'ఇండియా' సర్కారే

- దేశ పరిరక్షణకు అవిశ్రాంత కృషి
- బీజేపీ మళ్లీ గెలిస్తే... ప్రతిపక్ష నేతలంతా జైలుకే
- ఆప్ జాతీయ కన్వీనర్, దిల్లీ సీఎం కేజ్రీవాల్

న్యూదిల్లీ : ఇండియా కూటమి జూన్ 4 తర్వాత కేంద్రంలో తదుపరి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని, మోదీ కాదని ఆప్ జాతీయ కన్వీనర్, దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ తెలిపారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధిస్తే... మమతా బెనర్జీ, ఉద్ధవ్ థాకరే, తేజస్వి యాదవ్‌తో సహా అనేక మంది విపక్ష నేతలు జైలు పాలవుతారని ఆయన తీవ్ర హెచ్చరిక చేశారు. తీహార్ జైలు నుంచి విడుదలయిన తర్వాత శనివారం విలేకరుల సమావేశంలో కేజ్రీవాల్ మాట్లాడుతూ 'మోదీ జీ ఆమ్ ఆద్మీ పార్టీని (ఆప్) అణిచివేయాలనుకుంటున్నారు. అతనికి ఒక దేశం, ఒకే నాయకుడు అనే ప్రమాదకరమైన మిషన్ ఉంది' అని బీజేపీపై విమర్శలు గుప్పించారు. ప్రతిపక్షాల అవకాశాలపై విశ్వాసం వ్యక్తం చేస్తూ, జూన్ 4 తర్వాత అధికారాన్ని చేపట్టేందుకు ఇండియా కూటమి సిద్ధంగా ఉన్నందున బీజేపీ పాలన ముగుస్తుందని నొక్కి చెప్పారు. 'నేను కస్టడీ నుంచి విడుదలైన తర్వాత

- మిగతా 5 లో

శాడిస్ట్ పాలనకు అంతం పలకాల్సిందే

- మతోన్మాద మోదీని గద్దె దించాలి
- ధన బలం ముందు ప్రజాబలం వెలవెల
- సంక్షేమం... అభివృద్ధి రెండు కళ్లు
- విశాలాంధ్ర ఇంటర్వ్యూలో రామకృష్ణ, శ్రీనివాసరావు

వామపక్షాల పట్ల ప్రజలు సానుకూలంగా, సానుభూతితో ఉన్నారనీ, ధన బలం ముందు ప్రజాబలం ప్రస్తుతం బలహీనంగా ఉందని సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు కె. రామకృష్ణ, వి. శ్రీనివాసరావు అభిప్రాయపడ్డారు. సోమవారం సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో వారిద్దరూ విశాలాంధ్ర స్టేట్‌బ్యూరో చావా రవికి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ ఎన్నికలలో కేంద్రంలో ఎన్డీయే కూటమిని, రాష్ట్రంలో వైసీపీ, ఎన్డీయే కూటమిని ఓడించాల్సిన అవశ్యకత ఎంతో ఉందన్నారు. రాష్ట్రంలో నియంత పాలన కొనసాగుతోంది. ఒక శాడిస్ట్ ఈ రాష్ట్రాన్ని పరిపాలిస్తున్నాడు. ఈ శాడిస్టును కచ్చితంగా గద్దె దింపాలని పిలుపునిచ్చారు. అలాగే కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్ర మోదీ ప్రభుత్వం దేశానికే ప్రమాదకరమైనది. ఇది జగన్ వైరస్ కన్నా అత్యంత ప్రమాదరకమైనది. బీజేపీ రాజ్యాంగానికే ఎసరు పెడుతోందన్నారు. రాష్ట్రంలో ఇండియా కూటమి బలం, ప్రజలు ఏ మేరకు ఆదరించారనేది పోలింగ్ తరువాత ఒక అంచనాకు రాగలుగుతామన్నారు. సంక్షేమ పథకాలను ఉచిత పథకాలనడం భావ్యం కాదనీ, అది ప్రజల హక్కు అని చెప్పారు. సంక్షేమ కార్యక్రమాలు కొనసాగిస్తూనే అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలి. అభివృద్ధి ఉంటే తప్ప ఆదాయం మెరుగుపడదు. ఆర్థిక వ్యవస్థ ఎప్పుడు మెరుగు పడుతుందో అప్పుడు బడ్జెట్ పెరుగుదల ఉంటుంది. ఎప్పుడైతే బడ్జెట్ పెరుగుదల ఉంటుందో సంక్షేమ కార్యక్రమాల అమలుకు వీలవుతుంది. సంక్షేమ కార్యక్రమాలు చేస్తే అభివృద్ధి ఆగిపోతుందని, అభివృద్ధి చేస్తే సంక్షేమాలు ఆగిపోతాయి అన్నది సరైనది కాదన్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి జరగాలంటే పరిశ్రమలు వ్యవసాయం అభివృద్ధి కావాలన్నారు.

8లో

ప్రలోభాల జాతర

రూ.2 వేల నుంచి రూ.4 వేల వరకు పంపిణీ

మద్యం పరవళ్లు... సున్నం కట్టల్లో డబ్బు పెట్టెలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ఆంధ్ర ప్రదేశ్ సార్వత్రిక ఎన్నికలకు కొన్ని గంటలే సమయం ఉండటంతో ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేందుకు ప్రధాన పార్టీలు తలమునకలయ్యాయి. గెలుపే లక్ష్యంగా అడ్డదారులకు దిగాయి. ఓటుకు నోట్లు భారీగా పంపిణీ చేస్తున్నాయి. ఈనెల 10వ తేదీ నుంచి ఇంటింటా డబ్బు పంపిణీ కొనసాగుతుండగా, శనివారం దానిని వేగవంతం చేశారు.

చాలా నియోజకవర్గాల్లో దాదాపు 80 శాతం పంపిణీ జరిగింది. ఎన్నికలకు 12 గంటల ముందునాటికి ఓటర్లు అందరికీ డబ్బు చేరవేసేలా రాజకీయ పార్టీల అభ్యర్థులు నిమగ్నమయ్యారు. డబ్బు పంపిణీ చేస్తున్నారన్న సమాచారం తెలిసిన వెంటనే పోలీసులు రంగ ప్రవేశం చేసినప్పటికీ ఎక్కడా ఆగలేదు. గుట్టుచప్పుడు కాకుండా

- మిగతా 5 లో



షర్మిలను గెలిపించండి

5లో

అమెరికా నుంచి విజయమ్మ వీడియో సందేశం

ఇదీ లోకం!

ఒకరినొకరు తిట్టుకున్న వెరయిటీ తిట్లు తప్ప నాకేం గుర్తు లేవు!

ఎన్డీఏ కూటమిదే అధికారం

- తొలి సంతకం మెగా డీఎస్సీపైనే
- ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేస్తా
- వైసీపీపై తిరుగుబాటు మొదలైంది
- ఎన్నికల ప్రచార సభల్లో చంద్రబాబు

విశాలాంధ్ర-నంద్యాల/చిత్తూరు: రాష్ట్రంలో జరగనున్న అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి ఘన విజయం తథ్యమని టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. ఎన్నికల ప్రచారానికి చివరి రోజైన శనివారం నంద్యాల, చిత్తూరులో నిర్వహించిన సభల్లో మాట్లాడారు. అధికారంలోకి రాగానే తొలి సంతకం మెగా డీఎస్సీపైనే పెడతామని స్పష్టం చేశారు. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని.., మీ భవిష్యత్తుకు భరోసా నాదని యువతకు చంద్రబాబు హామీ

- మిగతా 5 లో

వైసీపీతోనే ఇంటింటి అభివృద్ధి

- వంగా గీతను గెలిపిస్తే డిప్యూటీ సీఎం చేస్తా
- దత్తపుత్రుడు గెలిస్తే... పిఠాపురంలో ఉంటాడా?
- చంద్రబాబువి మోసపూరిత హామీలు
- ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై దుష్ప్రచారం నమ్మొద్దు
- ఎన్నికల ప్రచార సభల్లో సీఎం వైఎస్ జగన్

5లో

సాధారణ ఎన్నికలు - 2024
లోక్‌సభ మరియు ఆంధ్రప్రదేశ్ శాసనసభ
ఎన్నికల పర్వం దేశానికి గర్వం
ఆంధ్రప్రదేశ్ ఎన్నికలు -2024
సాధారణ ఎన్నికలు
పోలింగ్ తేది: 13.05.2024
మీ పోలింగ్ స్టేషన్ లొకేషన్ మరియు బిఎల్ఓ వివరాలు తెలుసుకోండి
voter Helpline App
or
electoralsearch.eci.gov.in
కాల్ 1950 టోల్ ఫ్రీ
QR కోడ్‌ను స్కాన్ చేయండి
రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి, ఆంధ్రప్రదేశ్
జారీచేసినవారు: కమిషనర్, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

సంపాదకీయం

విజ్ఞతే మహోజ్జ్వల భవితకు పునాది

ఓటు వేయడమంటే జాతి భవితవ్య నిర్మాణంలో పాలుపంచుకోడమే. ఓటరు చూపుడువేలిపై మెరిసే సిరాచుక్కే ఆధునిక వజ్రాయుధం. ప్రజాస్వా మ్యానికి పట్టంకట్టే జనాదేశ చిహ్నమే వయోజన ఓటు హక్కు. పద్దెనిమిదో లోక్‌సభతోపాటు ఆంధ్రప్రదేశ్, ఒడిశా, సిక్కిం, అరుణాచల్‌ప్రదేశ్ శాసన సభలకు జరగనున్న మొత్తం ఏడు అంచెల సార్వత్రిక ఎన్నికల క్రతువులో నాలుగోదశ పోలింగ్ సోమవారం జరగనున్నది. తెలుగు రాష్ట్రాలు రెండింటిలోని 42 లోక్‌సభ స్థానాలు, ఆంధ్రలోని 175 అసెంబ్లీ నియోజకవర్గాలు, తెలంగాణలోని ఒక శాసనసభ నియోజకవర్గ ఉప ఎన్నిక బరిలో నిలిచిన అభ్యర్థుల భవితవ్యాన్ని ఆంధ్రప్రదేశ్‌లో 4.08 కోట్ల మంది, తెలంగాణలో 3.34 కోట్ల మందికి పైగా ఓటర్లు రేపు నిర్దేశిస్తారు. నిన్నటివరకూ పాలక, ప్రతిపక్ష పార్టీలు అలవిగాని హామీలు, అంతులేని ప్రలోభాలు, విద్వేషపూరిత ప్రసంగాలు, ఒకర్నిమించి మరొకరు వాగ్దానాల వరదలతో హోరెత్తించాయి. 'కోడ్' కళ్లుగప్పి చాపకిందనీరులా మద్యం, డబ్బు ప్రవాహాన్ని పరుగులెత్తించాయి. నిగ్రహం చూపి నిదానించి వివేచనతో మాట్లాడాల్సిన నేతలు అలవోకగా ఆరోపణలు, ప్రత్యారోపణలు, నిందలతో గురివింద చందంగా తమ వాచాలత్వాన్ని ప్రదర్శించారు. ప్రజాసేవ ముసుగులో బరిలో దిగిన వారిలో నేరచరితులు తక్కువేమీ కాదు. దేశ ప్రజాస్వామ్య నిజపరిరక్షకులైన ఓటర్లే తమ వివేచనతో తీర్పు ఇవ్వాల్సిన తరుణం అసన్నమైంది. వయోజనుల చేతిలోని ఓటాయుధానికి ఘన చరిత్ర ఉంది. ప్రభుత్వాలను కూల్చడం, ఏర్పాటు చేయడంతోపాటు ప్రజల జీవితాలను ప్రభావితం, పతనం చేయడం ఈ ఓటు మీదే ఆధారపడి ఉంది. దేశంలో ఎన్నికల ప్రారంభంలో మొత్తం ఓటర్లు 13కోట్ల మందే. నేడు ఆ సంఖ్య దాదాపు 97కోట్లు. ఈ సంఖ్య దేశ మొత్తం జనాభాలో దాదాపు 70 శాతం. 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికలతో పోల్చుకుంటే ఓటర్ల సంఖ్య దాదాపు 15 కోట్లు పెరిగింది. మండుటెండలపై వ్యక్తమౌతున్న ఆందోళనల కారణంగా మొదటిసారిగా వికలాంగులు, 85 ఏళ్ల పైబడిన ఓటర్లు తమ ఇళ్ల నుంచే ఓటు వేయడానికి కేంద్ర ఎన్నికల సంఘం మొట్టమొదటిసారిగా అనుమతించింది. ఓటర్లు మరింత అనుకూలమైన సమయంలో వచ్చేందుకు వీలుగా తెలంగాణలోని కొన్ని ప్రాంతాల్లో పోలింగ్‌ని గంటపాటు పొడిగించారు. మన దేశంలో మొదట 21 సంవత్సరాలకు ఓటు హక్కు కల్పించి అనంతరం 1988లో 61వ రాజ్యాంగ సవరణ ద్వారా 18 ఏళ్లకే ఓటుహక్కు కల్పించారు. ఇది దేశంలోని యువత పట్ల మనకు గల పరిపూర్ణ విశ్వాసానికి తార్కాణమని నాటి ప్రధాని రాజీవ్ గాంధీ వ్యాఖ్యానించారు. నిజమే, 140కోట్ల మందికిపైగా ఉన్న జనాభాలో 25ఏళ్ల లోపు యువత సగానికి సగం ఉండడం ఈ దేశ ప్రత్యేకత. ఈసారి దేశంలో 18-19 ఏళ్ల వయస్సు కలిగి తొలిసారి ఓటు వేయనున్న ఓటర్లు దాదాపు మూడుకోట్ల మంది ఉన్నారని అంచనా. అయితే ఈ ప్రజాస్వామ్య ప్రక్రియలో ఎంతమంది భాగస్వాములవుతున్నారనే ప్రశ్న వెంటాడుతూనే ఉంది. ఇప్పటివరకూ 2014లోనే అత్యధిక పోలింగ్ శాతం నమోదైంది. అదీ కేవలం 66.4శాతమే. ఆ ఎన్నికల్లో 27కోట్ల మందికిపైగా ఓటుహక్కు వినియోగించు కోలేదు. సంపన్నులు, విద్యావంతులు, ఎగువ మధ్యతరగతివారిలో అత్యధికులు ఓటింగ్‌కు దూరంగా ఉంటున్నట్లు విశ్లేషకులు చెపుతున్నారు. అందరూ ఓటు హక్కు వినియోగించుకునేలా చేయడంలో ఎన్నికల సంఘం వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. కొందరు ఓటు వేయకపోతే ఏంలే అనే నిరాసక్తత వ్యక్తం చేయడం ప్రజాస్వామ్యానికి తీరని ద్రోహం చేయడమే. ఈసారి తెలుగు రాష్ట్రాల్లో అనేక మంది ఓట్లు గల్లంతైనట్లు, కొన్ని చోట్ల దొంగ ఓట్లు పెద్ద సంఖ్యలో చేర్పించినట్లు, ఒకే ఇంట్లో వందల సంఖ్యలో ఓట్లు ఉన్న సంఘటనలు వెలుగులోకి వచ్చాయి. ఈ అప్రజాస్వామిక అధికార దుర్వినియోగ దుష్కార్యంలో పాలక పార్టీల పాత్ర ముఖ్యంగా ఎన్నికల కమిషన్ అనుసరిస్తున్న తీరు ఎన్నికల కమిషన్ విశ్వసనీయతనే ప్రశ్నార్థకంగా మార్చేస్తున్నది. ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్‌పార్టీకి వ్యతిరేకంగా ప్రధానమంత్రి నిచాతినీచమైన వ్యాఖ్యలు చేసినప్పటికీ ఉదాసీన ధోరణి ప్రదర్శించడం, ఇప్పటికే ముగిసిన మొదటి రెండు దశల్లో పోలైన ఓట్ల శాతాన్ని ప్రకటించడంలో చేసిన జాప్యంతో ఎన్నికల కమిషన్ తీవ్ర విమర్శలను ఎదుర్కొన్నది. ఎన్నికల కమిషన్ ఈ విధమైన చర్యలు, ప్రజాస్వామ్యమంటే ఎలాగైనా తామే అధికారంలోకి రావడం అని భావించే నాయకుల వల్లే ఎన్నికల ప్రక్రియపై సామాన్యులకు విశ్వాసం సన్నగిల్లుతోంది. మన ప్రజాస్వామ్య వ్యవస్థలో కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థలున్నప్పటికీ దేశ ప్రజలకు ప్రాతినిధ్యం వహించే శాసన వ్యవస్థకు చోదకశక్తి అయిన రాజకీయ రంగం నిజమైన ప్రజాస్వామ్య స్ఫూర్తి, చైతన్యాన్ని ప్రకటించకపోతే మిగతా వ్యవస్థలు కూడా భ్రష్టుపడుతాయి. ఆ దృశ్యాన్ని కూడా మనం కేంద్రంలో గత పదేళ్లగా, రాష్ట్రంలో అయిదేళ్లలో చాలా స్పష్టంగా చూస్తూనే ఉన్నాం. మోదీ, జగన్... రాజ్యాంగ వ్యవస్థలన్నింటినీ నిర్వీర్యం చేసి దాదాపు నిరంకుశ పాలనను కొనసాగించారు. ఎంతో గురుతర బాధ్యతతో వ్యవహరించి, రాజ్యాంగ వ్యవస్థల పనితీరుపై సునిశిత ఆలోచన చేసి, దేశాన్ని ప్రపంచానికి మార్గదర్శకంగానూ, మనకు మనం సచ్ఛీలతతో జీవించేలానూ చూడాల్సిన పాలకులు, నేతలు నేడు ఆ కర్తవ్యాన్ని విస్మరించి అప్రజాస్వామ్యానికి, సమస్త అక్రమాలకు పాల్పడుతున్నారు.

ప్రజాస్వామ్య కీచకులైన వారి తోలుతీయడానికి, అప్రజాస్వామిక సార్వభౌముల ఆట కట్టించడానికి ఇప్పుడు ఓటర్లు సిద్ధంగా ఉన్నారు. తెలుగు రాష్ట్రాల ప్రజలు రాజకీయంగా ఎంతో చైతన్యం, వివేకం, విజ్ఞత గలవారు... ధన, కనక, మద్యం ప్రవాహాలతో ఏమార్చాలని చూసిన పార్టీలకూ, నేతలకూ తమ ఓటు ద్వారా గట్టిగా బుద్ధి చెప్పగలరని గత చరిత్ర చెబుతోంది. ఈ ఎన్నికల్లోనూ మరో సారి అదే ప్రస్ఫుటంగా ప్రతిఫలింపచేస్తారని ఆశిద్దాం. ఓటరు ఎంతో చైతన్యంతో ప్రజాస్వామ్య పరిరక్షణకు కంకణబద్ధ మవుతున్నాడు. అప్రజాస్వామ్య, అరాచక, అవినీతి శక్తులకు తగిన గుణపాఠం నేర్పుతూ ప్రజాస్వామ్యానికి పట్టుకొమ్మయిన భావప్రకటనా స్వేచ్ఛ పరిఢవిల్లడానికి ప్రజలు సందర్భం వచ్చినప్పుడల్లా యుక్తాయుక్తవిచక్షణతో వ్యవహరిస్తున్నారు. చేతిలోని ఓటు అనే మహాస్త్రాన్ని సద్వినియోగం చేసుకోవడం ఓటర్లపైనే ఆధారపడి ఉంటుంది. డబ్బు, మద్యం ప్రభావాలకు లోనుకాకుండా ఎక్కడికక్కడ అవినీతిని కుళ్లగించి, ప్రజలకు సేవచేసే నిజమైన ప్రజాప్రతినిధులను, సమర్థులను ఎంచుకోవడం ఓటర్ల ప్రాథమిక కర్తవ్యం. ప్రతి ఓటు ఎంతో విలువైనది. ఒక్క ఓటు తేడాతో గెలుపోటములు నిర్ధారిత మవుతాయి. కొందరు ఓటర్ల నిస్పృహ, అలసత్వం కారణంగా అభ్యర్థుల గెలుపోటములు తారుమారైన ఉదంతాలు ఎన్నో! కాబట్టి ఒత్తిడులకు, ప్రలోభాలకు, క్షణికమైన ఎరలకు ఆకర్షితులై ఓటును అమ్ముకోడమో, తప్పుడు నిర్ణయానుసారం వినియోగించడమో జరిగితే తమ భవిష్యత్తు, దేశ భవిష్యత్తు అనర్హులు, అసమర్థులు, అవినీతిపరుల చేతిలోకి జారిపోతుంది. ఈ తప్పుకు అయిదేళ్లపాటు పశ్చాత్తాప పడాల్సి వస్తుంది. రాష్ట్ర, దేశ భవిష్యత్తు అయోగ్యుల పాల్పడకుండా వివేచనతో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలి. బలహీనులకు బలవంతులతో సమానమైన అవకాశాలు కల్పించేదే ప్రజాస్వామ్యమని గాంధీజీ అన్నారు. అటువంటి మహత్తర స్థితికి సూచి ఓటు. ఈ కీలక సమయంలో ఓటును సద్వినియోగం చేసుకోడమే ఏకైక కర్తవ్యం. ఓటరు స్థాయిలో విజ్ఞతే మహోజ్జ్వల భవితకు సరైన పునాది.

కేజ్రీవాల్ బెయిల్‌తో బీజేపీ వ్యూహాలు ఔట్

సుశీల్ కుట్టి

ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ తీహార్ జైలునుంచి తాత్కాలిక బెయిల్‌పై బైటకురావడంతో ఢిల్లీలో బీజేపీవేసుకున్న వ్యూహాలు, ఎత్తుగడలు, చెల్లాచెదు రయ్యాయి. ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ కేజ్రీవాల్ అందరికీ దగ్గరైన వ్యక్తి. ఢిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి మనీష్ శిశోడియా లేదా మాజీ జైళ్ల మంత్రి సత్యేంద్ర జైన్ కూడా తీహార్ జైల్లో చాలాకాలం నుంచి మగ్గు తున్నారు. కేంద్రంలో బీజేపీని ఓడించేందుకు ఇండియాకూటమిలో భాగమైన కేజ్రీవాల్ ప్రముఖస్థానం కలిగిఉన్నారు. కొత్తకొత్త వ్యూహాలు రూపొందించ డంలో కేజ్రీవాల్ నిపుణుడు. కేజ్రీవాల్ అత్యంత ఎక్కువ కాలం గడవ కుండానే తాత్కాలిక బెయిల్‌ను పొందగలిగారు. సుప్రీంకోర్టు సైతం కేజ్రీవాల్ అరెస్టు సరైందికాదన్న బావనతో తాత్కాలిక బెయిల్ మంజూరు చేశారని భావిస్తున్నారు. కొంతమంది రాజకీయ దృక్కోణంతో సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసిందని అంటున్నారు. కేజ్రీవాల్ 21రోజులు జైలులో ఉన్నారు. అక్కడినుంచే రాష్ట్రపతి పాలన సాగించారు. అయితే బెయిల్ మంజూరు చేసేటప్పుడు రాష్ట్ర సచివాలయానికి వెళ్లకూడదన్న షరతు కోర్టు విధించింది. ఎన్నికల ప్రచారంలో పాల్గొనే అవకాశం కేజ్రీవాల్‌కు లభించింది. ఆయన బైటకు రావడమే ప్రజలకుసైతం పెద్ద ఊరట కలిగిం చింది. ఢిల్లీలో నీటి కొరత తదితర సమస్యలను పరిష్కరించేందుకు కేజ్రీవాల్ వేగంగా చర్యలు తీసుకోగలడన్న నమ్మకం ప్రజలలో ఉంది. కేజ్రీవాల్‌ను అక్రమంగా జైలుకు పంపారన్న అభిప్రాయం కూడా ప్రజలలో గణనీయంగా ఉంది.ఆయన జైల ునుంచి విడుదలకాగానే అత్యంత వేగంగా బైటకువచ్చి పరుగెత్తినట్లుగా చకచకా నడుచుకుంటూ వచ్చారు. కన్నాట్ ప్లేస్ హనుమాన్ ఆలయం వద్ద శనివారం ఆప్ కార్యకర్తలు, అభిమానులు కలుసుకున్నారు. కేజ్రీవాల్ తరచుగా హనుమంతుడిని తలచుకోవటం రాజకీయ లబ్ధికోసమే ననేది ప్రజలలో ఉన్న అభిప్రాయం. కేజ్రీవాల్ చాలా వేగంగా నిర్ణయాలు తీసుకునే రాజకీయ నాయులలో ఒకరని కొందరు భావిస్తే, రాజకీయ ప్రత్యర్థులు అయనను మోసకారిగా ఆరోపిస్తున్నారు. ఆయన జైలు నుంచి బైటకురాగానే నియంతృత్వం నుండి దేశాన్ని కాపాడాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. కేజ్రీవాల్ జైలుకు తిరిగి జూన్ 2వ తేదీన వెళ్లవలసిఉంటుంది. ఢిల్లీలో అత్యంత చాకచక్యం కలిగిన ప్రజాదరణ కలిగిన నాయకుడు కేజ్రీవాల్ లోకసభ ఎన్నికల ఫలితాలు వెలువడకముందే తిరిగి జైలుకు వెళ్లవలసిఉంది. బెయిల్ మరో రెండు రోజులు పొడిగించాలని కోరినప్పటికీ, కోర్టు ధర్మాసం అంగీకరించలేదు. ఆయన జైలు గదిలో ఏర్పాటుచేసిన టీవీని వీక్షించి ఫలితాలు తెలుసు కోవలసిందే. ఆయన సతీమణి సునీత కేజ్రీవాల్ ఇండియా కూటమి గెలుపుకోసం కృషిచేస్తున్నారు. ఇండియా కూటమిలో కేజ్రీవాల్ కీలకమైన నాయకుడు. ఢిల్లీ కాకుండా పంజాబ్‌లో కూడా ఆప్ ప్రభుత్వాలున్నాయి. మరి కొన్ని రాష్ట్రాలకు కూడా ఆప్ విస్తరిస్తోంది. ఈ నేపథ్యంలోనే బీజేపీ కేజ్రీవాల్‌ను మరింత విస్తరించకుండా చూడాలనే కుట్రతోనే ఆయనను అరెస్టు చేయించిందని విశ్లేషిస్తున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎవరికైనా భయపడుతున్నారనుకుంటే కేజ్రీవాల్ దూకుడునుచూసే ఆయన భయపడుతున్నారు. సోషల్‌మీడియాలో మోదీతో గట్టిగా తలపడేవ్యక్తి కేజ్రీవాల్ అనే సుప్రీంకోర్టు కూడా గమనించినట్లుంది.

కేజ్రీవాల్‌కు తాత్కాలిక బెయిల్ ఇచ్చినప్పటికీ ఆంక్షలుపెట్టడం ఆయనను శిక్షించినట్లేనని ఢిల్లీ ప్రజలు భావిస్తున్నారు. 21రోజులు జైలులో ఉన్నప్పటికీ ఆయన పరోక్షంగా రాష్ట్రాన్ని పరిపాలించారు. ఆయన ప్రత్యేకత ఇక్కడే తెలుస్తుంది. అక్రమంగా తనపైన ఈడీ ఛార్జిషీటు దాఖలు చేసిందని ఆయన విమర్శించారు. కేజ్రీవాల్‌ను జైలునుంచి విడుదలచేయడం పెద్ద ఊరటఅని మరోవైపు అభిమానులు భావిస్తున్నారు. ఆయన విడుదలకోసం మూడు వారాలుగా ఎదురు చూస్తున్నారు. జాతీయమీడియా అలాగే దేశవ్యాప్తంగా ఉన్న మద్దతుదారులు ఆయన విడుదలను స్వాగతించారు. నియంతృత్వాన్ని ఓడించండి అని తాజాగా నిలదీస్తున్నారు. నాలుగోదశ ఎన్నికలు మే 13వ తేదీన జరుగనున్నాయి. సమయానికి కేజ్రీవాల్ తాత్కాలిక బెయిల్ ఆయనకు ఎంతో ఉపయోగపడుతుంది. కేజ్రీవాల్ ఆయా ప్రాంతాల్లో తిరుగుతున్నారు. అయితే మోదీ మాదిరికాకుండా తనను పరీక్షించడానికి వేసే ప్రశ్నలకు జవాబు ఇవ్వడంలో ఏమీ వెనుకాడడు. ఆయన బైటకు వెళ్లినతర్వాత ఏం మాట్లాడకూడదు, ఏం మాట్లాడాలి అనేది నిర్ణయించ లేదు కున్నారు. ఢిల్లీ ముఖ్యమంత్రిగా కాకుండా, ఆప్ కన్వీనర్‌గా నియమ నిబంధనలు సైతం లెక్కచేయకుండా రాజకీయాలలో శక్తి ఉన్నవారు. మే 25వ తేదీన ఢిల్లీ ఏడు పార్లమెంటు సీట్లకు ఎన్నికలు జరుగుతున్నాయి. 2014, 2019 లోకసభ ఎన్నికల్లో బీజేపీ ఢిల్లీలోని 7 లోకసభ సీట్లను గెలుచుకుంది. ఈ సారి పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంది. ఆప్ 4సీట్లకు, కాంగ్రెస్ 3సీట్లకు కలిసి పోటీ చేస్తున్నాయి. తాము 400సీట్లు గెలుచుకోగలమని మోదీ గతంలో ప్రచారం చేసినప్పటికీ ఇప్పుడు అంతగా ఆ ప్రచారం లేదు. ప్రస్తుత వాతావరణాన్ని చూసి ప్రతిపక్షాలపైన ఇష్టం వచ్చినట్లుగా విమర్శలు చేస్తున్నారు. "వాస్తవానికి ఇబ్బందులు కలగవచ్చు, అయితే ఓటమి ఉండదు. ఈ నిర్ణయాన్ని గౌరవనీయమైన సుప్రీంకోర్టు కూడా స్వాగతించింది. నియంతృత్వాన్ని అంతమొందించ గలుగుతామని ఆ ఆప్ రాజ్యసభ ఎంపీ సంజయ్‌సింగ్ అన్నారు. ఆయనకూడా ఇటీవల జైలు నుంచి బెయిలుపై విడుదలయ్యారు. ఇదికూడా రెగ్యులర్‌గా ఇచ్చే బెయిల్‌కాదు. తాత్కాలిక బెయిలే.

ఆసక్తి కలిగిస్తున్న ఏపీ ఎన్నికలు

గత పదేళ్లుగా రాజధాని పేరు చెప్పుకోలేని ఆంధ్రప్రదేశ్‌లో మరో 24 గంటల్లో ఎవరు ముఖ్యమంత్రి అన్నది చూచాయగా తేలనుంది. దక్షిణ భారతదేశం మొత్తం ఆంధ్రప్రదేశ్ ఎన్నికపై ఆసక్తికరంగా చూస్తోంది. డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి తనయుడు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మరోసారి విజనరీ నాయకుడుగా చెప్పుకుంటున్న చంద్రబాబుతో తలపడనున్నారు. జగన్మోహన్ రెడ్డి పార్టీ ఆవిర్భావం నుంచి ఒంటరిగానే గత ఎన్నికల్లో రణరంగంలో ఉంటున్నారు. తెలుగు ప్రజల కోసం పుట్టిన తెలుగుదేశం పార్టీ ఏదొఒక పార్టీతో పొత్తు పెట్టుకోక తప్పడంలేదు. 2014లో బీజేపీ జనసేనతో పొత్తుపెట్టుకుని అధికారంలోకి వచ్చిన చంద్రబాబు 2019లో ఒంటిరిగా పోటీ చేసి ఘోరంగా ఓటమి చవిచూశారు. ఈదఫా పవన్ కల్యాణ్ నేతృత్వంలో బీజేపీని ఒప్పించి మరీ పొత్తుపెట్టుకుని ఎన్నికలో నిలబడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లో ఐదారు శాతం ఉన్న ఉన్నత సామాజిక వర్గాలవారు ముఖ్యమంత్రులయ్యారు. 26శాతం ఉన్న కాపు, బలిజలు ఎందుకు ముఖ్యమంత్రి కాకూడదన్న పవన్ కల్యాణ్ సామాజిక లక్ష్యంతోనే రాజకీయాల్లోకి వచ్చారు. అయితే వైసీపీ గేమ్ ప్లాన్ తో ఆంధ్రప్రదేశ్ లో కాపు సామాజిక వర్గానికి పెద్దదిక్కయిన ముద్రగడను కూటమి వైపు రాకుండా జాగ్రత్తపడింది. ఇదిలా ఉంటే 50 శాతంపైబడి ఉన్న బీసీలు, ఎస్సీలు, ఎస్టీలలో ఒక్కరు కూడా ముఖ్యమంత్రి అభ్యర్థిత్వంపై ఆంధ్రప్రదేశ్‌లో కనిపించడంలేదంటే ఇందిరాగాంధీ ఆనాడు ఆంధ్రా ప్రజలు గొర్రెలు అన్న విమర్శ ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తుంది. ఈ రాష్ట్రంలో సీఎం పదవికి అర్హులయ్యే బడుగువర్గాల నేతలు ఎంతో మంది ఉన్నారు. ఎంతసేపు ఆ రెండు అగ్రవర్ణాల కుటుంబాల కాళ్లదగ్గరే ఉండటమే బీసీలకు ఇష్టమేమోమరి. ప్రస్తుతం జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ సాధారణ ఎన్నికలు ఈ రాష్ట్ర ప్రజల భవిష్యత్తును నిర్ణయించే ఎన్నికలుగా చెప్పొచ్చు. ఉమ్మడి రాష్ట్రంగా విడిపోయాక ఎలాంటి ఉపాధిలేక కూలీలు, ఉద్యోగాలు లేక నిరుద్యోగులు, పనులు లేక కాంట్రాక్టర్లు, సరైన జీతాలు పీఆర్సీలు లేక ప్రభుత్వ ఉద్యోగులు కొట్టుమిట్టాడు తున్నారు. చంద్రబాబు ఎన్నోఏళ్లుగా ముఖ్యమంత్రిగా ఉన్నా ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్న అపోహ ప్రజల్లో గట్టిగా ఉంది. ఇదే తెలుగుదేశం శ్రేణుల్లో భయాందోళన కలిగిస్తుంది. బాబు ఎన్ని హామీలిచ్చినా ప్రజలు నమ్మే స్థితిలో లేరని చాలా మంది విశ్లేషకుల వాదన. అయితే కూటమిలో పవన్ కల్యాణ్, బీజేపీ ఉండటం వల్ల ఒకవేళ అధికారం వస్తే చంద్రబాబు ఒంటెద్దు పోకడలు సాగవని బీజేపీ, జనసేన నేతలు అంతర్గతంగా చెప్తున్నారు. ఇక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విషయానికొస్తే ఈ ఐదేళ్ల ఓటు బ్యాంకు కోసం 1 కోటి 10 లక్షల కుటుంబాలకు నేరుగా రూ.2,70 లక్షల కోట్లు వివిధ పథకాల రూపేణా బ్యాంకు ఖాతాల్లో వేశారు. ఇది వాస్తవానికి మంచి పనే, కానీ ఇక్కడే ప్రతీ ఒక్కరు అర్థం చేసుకోవాల్సిన ప్రశ్న, ఈ రాష్ట్రం అప్పుల్లో లేకుండా అభివృద్ధిలో ఉండి ఉపాధి ఉద్యోగాలు ఉండి ప్రభుత్వ ఖజానాలో అదనపు నిధి ఉంటే పేదలకు పంచడంలో ఎలాంటి తప్పులేదు. ఇక్కడ ఈ రాష్ట్రంలో

12 లక్షల కోట్లు ప్రభుత్వ అప్పు ఉంది. ఉపాధి, ఉద్యోగాలు ఏ మాత్రం లేవు. కేవలం ఐదేళ్లకొకసారి ప్రభుత్వ మార్పిడి కోసం ప్రజలనుంచి తీసుకున్న డబ్బును తిరిగి వాళ్లకే పంచితే రాష్ట్రం దివాళ తీయక తప్పదు. ఈ రాష్ట్రంలో, దేశంలో ఎక్కడాలేని వనరులున్నాయి. ఇదే 2 లక్షల 70 వేల కోట్ల రూపాయలు రాష్ట్రంలో ఇరిగేషన్ ప్రాజెక్టులు, పరిశ్రమలు, వ్యవసాయం, విద్యా, వైద్య రంగాలకు కేటాయించివుంటే మరో పదేళ్లల్లో ఈ దేశంలో నంబర్ వన్ రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఉండేది. ఈ పథకాల వల్ల ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి సుమారు 100 గ్రామీణ నియోజకవర్గాల్లో ఓటు బ్యాంకు పూర్తిగా తనవైపు ఉంది. అదే జగన్మోహన్ రెడ్డి లక్ష్యం. వాస్తవానికి ఈ ప్రభుత్వంపై క్షేత్రస్థాయిలో వ్యతిరేకత ఉండటం వల్ల సుమారు 75 మంది సిటింగ్ ఎమ్మెల్యేలను మార్చడంలో ఆంతర్యమే ఇక్కడ ప్రశ్నించవచ్చు. ఇంత చేసినా పథకాలు పొందిన ప్రజలను జగన్మోహన్‌రెడ్డి నమ్మడంలేదు. పూర్తిగా వారిని నమ్మివుంటే 75 మంది సిటింగ్ ఎమ్మెల్యేలను మార్చే అవసరం ఉండేది కాదు. ఈ ఎన్నికల్లో ఎలాగైనా గేమ్ చేంజ్ చేయడమే జగన్మోహన్ రెడ్డి లక్ష్యం. ఇందిరా గాంధీ అన్నట్లు ప్రజలు గొర్రెలే. ఎందుకంటే ఏది చెప్పినా నమ్ముతారు. జగన్మోహన్ రెడ్డి అంటున్నట్లు వై నాట్ 175 అసెంబ్లీ, 25 పార్లమెంట్ ఎందుకు రావంటున్న విషయం ప్రజలు నమ్మవచ్చేమో కానీ, కొంచెం చదువుకున్న విద్యా వంతులు ఎవరూ నమ్మరు. ఇక్కడ ఒక్కటే... ప్రజలను అయోమయానికి గురిచేసి తమ వైపు తిప్పుకోవడమే లక్ష్యం. ఇక్కడ వైసీపీకి అనుకూలించే అంశాలు.. నవరత్నాలు, 75 నియోజకవర్గాల సిటింగ్ ల మార్పు, బీసీలకు ఎక్కువ సీట్లు కేటాయింపు. ఈ మూడింటిమీదే జగన్మోహన్ రెడ్డి ఆశలు పెట్టుకున్నారు. ఇక్కడ దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రస్తావన పూర్తిగా తెరమరుగైంది. చాలామంది వైఎస్ రాజశేఖర్ రెడ్డి తనయుడన్న దృష్టితోనే ప్రజలు ఓట్లేస్తున్నారన్నది అసంభవం. ఎందుకంటే 2014 రాజశేఖర్ రెడ్డి చనిపోవడం, ఆ తరువాత వచ్చిన ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి వైఎస్ఆర్సీపీతో తండ్రి బొమ్మతో ప్రజల్లోకి వచ్చినా కేవలం 68 సీట్లతో సర్దుకోవాల్సి వచ్చింది. రాజశేఖర్ రెడ్డి ప్రభావం ఉన్నప్పటికీ 2014 ఎన్నికల్లో ముఖ్యమంత్రి కాకపోవడానికి రాష్ట్రం విడిపోవడం వంటి కారణాలతో, అనుభవజ్ఞుడైన వ్యక్తి కావాలన్న సంకల్పంతో చంద్రబాబును ముఖ్యమంత్రిని చేశారు ఆంధ్రా ప్రజలు. ఈ ఐదేళ్ల కాలంలో కరోనా పరిస్థితులను దాటుకొని ఓడరేవులు, ఫిషింగ్ హార్బర్లు, ఫిషింగ్ ల్యాండ్స్, 15వేల రైతు కేంద్రాలు, వీలేజ్ క్లీనిక్ లు, నాడు-నేడు కింద పాఠశాలల ఆధునీకరణ, ఆంగ్లంలో బోధన, ఆసుపత్రుల ఆధునీకరణ, 17 మెడికల్ కాలేజీలు, రాష్ట్రంలో మూడు ప్రాంతాల్లో భారీ పరిశ్రమల కారిడార్లు, రాష్ట్రంలోని ప్రధాన నగరాలైన విజయవాడ, రాజమహేంద్రవరం, విశాఖపట్నం, తిరుపతి తదితర నగరాల్లో భారీ ఫ్లైఓవర్లు, విదేశీ విద్య, ఆరోగ్యశ్రీ వంటి ప్రాజెక్టులతోపాటు నవరత్నాలు వంటి పథకాలతో ప్రజలకు దగ్గరయ్యారు. ఇక చంద్రబాబు విషయానికొస్తే వైఎస్ వివేకానందరెడ్డి హత్యను ఈ ఎన్నికల్లో ప్రధాన అస్త్రంగా ఉపయోగించు కుని లబ్ధిపొందాలని చూస్తున్నారు. అలాగే కల్తీమద్యం, ఇసుక దోపిడీ, భూకబ్జాలు వంటి వాటితో ప్రతీ వేదికపైనా ప్రసంగిస్తున్నారు. ల్యాండ్ టైటిలింగ్ చట్టంపై గత ఐదు రోజులుగా, వైసీపీ ప్రభుత్వంపై గట్టిగా వ్యతిరేకతను కనపరుస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, నిరుద్యోగులు, కాంట్రాక్టర్లు, వ్యాపారస్తులు ఈసారి తనవైపే ఉన్నారన్న ఆశతో ఉన్నారు. అలాగే ఎలాంటి ప్రలోభాలకు గురికాని జనసైనికులపై మరింత ఆశపెట్టుకున్నారు. బ్రాహ్మణ, వైశ్య, ఆర్ఎస్ఎస్, కరుడుగట్టిన హిందూ ఓటుబ్యాంకు తమవైపే ఉంటుందని చంద్రబాబు ఆశపెట్టుకన్నారు. అయితే టీడీపీ అభ్యర్థులు పోటీలో ఉన్న 144 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సుమారు 40 నుంచి 50 నియోజకవర్గాల్లో అభ్యర్థులను నిర్ణయించకపోవడం ఆయా నియోజకవర్గాల్లో ద్వితీయశ్రేణి నాయకులు అంతర్గతంగా వైసీపీకి మద్దతిస్తున్నారన్న సమాచారం ఉంది. ఈ ఎన్నికల్లో చంద్రబాబు కొన్ని సామాజిక వర్గాల్లోని ప్రముఖ నేతలకు సముచిత స్థానం కల్పించలేదన్న అపోహవుంది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం జరిగే ఎన్నికల్లో పత్రికలు, టీవీలు, సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలు అత్యంత క్రీయా శీలక పాత్రను పోషిస్తున్నాయి. వైసీపీకి న్యూట్రల్ మీడియాగా ఉన్న టీవీ 9, ఎన్టీవీ, 10టీవీ, సాక్షి టీవీ, సాక్షి పత్రిక పూర్తిస్థాయి మద్దతుగా నిలిచాయి. ఏబీఎన్, టీవీ5, ఈటీవీ, మహాన్యూస్, ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికలు తెలుగుదేశం వైపు నిలిచాయి. ఈ హోరా హోరీలో ఎన్నో సర్వే సంస్థలు, పత్రికలు, టీవీలు టీడీపీ, వైసీపీకి ఇన్ని సీట్లు వస్తాయి.. అన్ని సీట్లు వస్తాయని చెప్పుకుంటూ వచ్చాయి. జాతీయ మీడియాలు కూడా ఐవీఆర్ఎస్ సర్వేలతో కొన్ని టీడీపీకి, మరి కొన్ని వైసీపీకి మొగ్గుచూపాయి. 12వ తేదీ రాత్రి జరిగే ఓటుకు నోటు విషయంలో ఎవరు ఎక్కువ పంచితే వారికే అవకాశం ఉంటుందనడంలో ఎలాంటి సందేహంలేదు. ఏది జరిగినా కేవలం మూడుశాతం ఓట్లతో జగన్మోహన్ రెడ్డి లేదా చంద్రబాబు సీఎం అవుతారు.

రామారావు, సీనియర్ జర్నలిస్టు,
సెల్: 9030715343

మూఢ నమ్మకాలపై కందుకూరి పోరాటం

డాక్టర్ దేవరాజు మహారాజు

"కార్యశూరుడు వీరేశలింగం
కదం తొక్కి పోరాడిన సింగం
దురాచారాల దురాగతాలను
తుద ముట్టించిన అగ్ని తరంగం"

తెలుగు రచయిత, సంఘసంస్కర్త అయిన కందుకూరి వీరేశలింగవ పంతులు గూర్చి తెలుగు కవి శ్రీశ్రీ వాక్కులివి!

ఇది కందుకూరి వారి 176 వ జయంతి, 105 వ వర్ధంతి (16 ఏప్రిల్ 1848- 27 మే 1919).'ఉద్యోగంలో చేరడానికి అమావాస్య నాడే ఎందుకు వచ్చావని' అధికారి అడిగాడు- "అయ్యా! అన్ని రోజులూ ఆ ఈశ్వరుడు సృష్టించినవనే చెపుతారు కదా? మరి అలాంటపుడు అన్ని రోజులూ మంచివే- అలాంటప్పుడు ఇక నేను ఏ రోజు ఉద్యోగంలో చేరినా, అది మంచిరోజే అవుతుంది!"- అని తాపీగా సమాధానమిచ్చారు వీరేశలింగం. - ఈ విషయం "మూఢ నమ్మకాలపై నా పోరాటం"- అనే గ్రంథంలో ఆయనే స్వయంగా రాసుకున్నారు (పే-24). అభిరుచి ఉన్నవారు ఆ పుస్తకం సంపాదించి, క్షుణ్ణంగా చదవడం మంచిది. అందులో ఆయన అనేక ప్రహసనాలు రాశారు. అందులో ఒకటి "శకునాలు" అనే శీర్షికతో ఉంది. ఉదాహరణకు ఇక్కడ అందులోని విషయాలు కొన్ని క్లుప్తంగా పొందుపరుస్తున్నాను. సున్నిత హాస్యం, వ్యంగ్యం మేళవించి ఎంతో మనోరంజకంగా రాశారు- గమనించండి! కుటుంబాన్ని తీసుకుని ప్రయాణం చేయాలంటే వెనకటి రోజుల్లో ఎన్నో కష్టాలు పడాల్సి వచ్చేది. అసలే రవాణా సౌకర్యాలు సరిగా లేని రోజులు. పైగా ఘడియ ఘడియకూ ముహూర్తాలు చూసుకునే పిచ్చి. మనువాదులు ఆ పిచ్చిని ఎప్పటికప్పుడు మరింతగా పెంచి పోషిస్తూ ఉండేవారు. ఆ విశేషాలన్నీ వీరేశలింగం సోదాహరణంగా రాసుకొచ్చారు. ఇన్నిన్ని చాదస్తాల మధ్య ఆ కాలం మనుషులు ఎలా బతికారబ్బా?- అని ఆశ్చర్యపోవాల్సి వస్తుంది కూడా! ఆడవాళ్లను తీసుకుని మంచి చెడ్డా విచారించకుండా దూరాభారం ఎలా బయలేదేరేసండీ?- పోనీ, అమావాస్యకు ముందే బయలుదేరుదామంటే, దోవలో అమావాస్య వస్తే మంచిది కాదని పెద్దలు చెప్పారు. అమావాస్య వెళ్లిన పాడ్యమి ప్రయాణానికి బొత్తిగా మంచిది కాదు. విదియనాడు బయలుదేరుదామంటే ఆ రోజు శుక్రవారం అయ్యింది. అక్కడికీ మొండిగా చొరవచేసి బయలుదేరుదామని అనుకునేంతలో ఎవరో 'హచ్చ్' మని తుమ్మినారు. అటువంటి అపశకునం అయిన తర్వాత, ప్రయాణం ఎలా చేస్తామని ఆనాటికి మానేశాం. శనివారం ఉదయమా దుర్ముహూర్తం! పిల్లలను తీసుకుని ఎలా బయలుదేరడం? ఆ మధ్యాహ్నమేమో వర్షం వచ్చింది! వర్షం వెళ్లిన తరువాతి రాత్రి, బండి కోసం కబురు చేయబోతుంటే- గుడ్లగూబ కూసింది. అలాంటప్పుడు ప్రయాణం మానేయక తప్పదు కదా? ఇక ఏం చేయడం? ఆ మరునాడు చవితి. ప్రయాణానికి చవితి ఏ మాత్రం మంచిది కాదని అందరికీ తెలిసిన విషయమే కదా? తరువాతి రోజు పంచమి- బయలుదేరాలి. కానీ, ఉదయాన నక్షత్రం మంచిది కాదు. అదీ కాకుండా వర్షం కూడా వచ్చింది. మధ్యాహ్నం బయలుదురుదామని భోజనం చేసి పచార్లు చేస్తూ ఉంటే, మాలబల్లి మీద పడింది. జ్యోతిష్యుణ్ణి పిలిపించి స్నానం చేసి, దీపం పెట్టుకుని శాంతీగింతీ చేసుకునేప్పటికి దీపాల వేళయ్యింది. రాత్రి భోజనాలు చేసి యలుదేరుదామంటే పెద్దలందరు చుక్క ఎదురు వెళ్లగూడదన్నారు. సరే- ఆ మరుసటి రోజు షష్టి. ఒక్క షష్టి మాత్రమే అయితే ఎలాగయినా బయలుదేరుదును. కానీ, ఆరోజు పిడుగువలె మంగళవారం కూడా వచ్చింది. ఈ రెంటికీ తోడు ఆరోజు ఒట్టి పాడు నక్షత్రం- ఇక సప్తమీ బుధవారం ప్రయాణానికి బహు అనుకూలమైంది. కానీ, ఆరోజు మా చిన్న కుర్రవాడి పుట్టిన దినం. ఆ పండుగ ముగించుకుని భోజనాలు చేస్తేగాని బయలుదేరేదే లేదని ఇంట్లో ఆడవాళ్లు పట్టుబట్టారు. అసలు ఆ ఉదయాన్నే బయలుదేరితే మధ్యాహ్నానికి దొంగల మర్రి దాటిపోయే వాళ్లం. దొంగల మర్రి అంటే దారి దోపిడీ దొంగలు పొంచి ఉండే చోటు. కానీ, భోజనాలు కాగానే బయలుదేరుదామని బండి కట్టించి, తీరా ఎక్కబోయే సరికి వెధవముండ ఎదురుగా వచ్చింది. మళ్లీ లోపలికి వెళ్లి అర్ధగంట సేపు ఆగాము. అప్పుడు బయలుదేరినా దీపాలు పెట్టక ముందే దొంగల మర్రి దాటేసేవాళ్లం. కానీ, వీధి గుమ్మంలోకి వచ్చేసరికి ఒంటి బ్రాహ్మణుడు ఎదురుగా వచ్చాడు. అందుకని లోపలికి వెళ్లి కొంతసేపు ఆగాము. ఇలా అయితే లాభం లేదని వీధిలో ఎవరూ నడవకుండా జాగ్రత్తపడి పొరుగింట్లో నుంచి ఒక ముత్తయిదువను ఎదురురమ్మని చటుక్కున బండి ఎక్కి బయలుదేరాము. ఎంత మంచి శకునం చూసి బయలుదేరినా, ఆ వెధవ ముండ ఎదురుగా వచ్చిన వేళ ఎటువంటిదో కానీ ఫలితం మాకు వెంటనే కనిపించింది. రాత్రి పది గంటలకు మేము జడుస్తూనే దొంగల మర్రి దగ్గరకు చేరాము. దొంగలు వచ్చి నగలన్నీ



ఎత్తుకుపోయారు. మేం మంచి శకునం చూసుకుని బయలుదేరడం వల్ల ప్రాణాలు కాపాడుకోగలిగాం. మొన్న ఓసారి జాతకం చూపించుకుంటే- నాకు ధన నష్టం ఉందని జ్యోతిష్యుడు చెప్పాడు. అంటే అంతా నిజమైనట్టే కదా? జ్యోతిష్యం తప్పలేదు-జ్యోతిష్యాన్ని నమ్మేవారు తాము నమ్మిన జోస్యాలు నిజం కానప్పుడు వాటిని పట్టించుకోకుండా పక్కన పెడతారు. ఎప్పుడైనా ఒకటీ, అరా నిజమైతే వాటినే మళ్లీ పట్టుకుని వేళ్లాడుతారు. ఒక విధంగా జ్యోతిష్యం చెడిపోయిన గడియారం లాంటిది. ఆగిపోయిన గడియారం కూడా రోజుకు రెండుసార్లు సరైన సమయాన్ని చూపిస్తుంది. అలాగని, ఆగిపోయిన గడియారాన్ని నమ్మడం ఎంత మూర్ఖత్వమో, జ్యోతిష్యాన్ని నమ్మడం కూడా అంతే మూర్ఖత్వం! వాస్తవానికి మనం ఏదైనా విషయం ఊహించి చెపితే, అందులో కొంత వరకు నిజమయ్యే అవకాశాలు ఉంటే ఉంటాయి. ఉండకపోతే ఉండవు. ఇకపోతే, దేవుడి విషయం చూద్దాం! ఒక కారుకు బ్రేకులు ఫెయిలయ్యి లోయలో పడిందని అనుకుందాం. ఆ ప్రమాదంలో బతికిన వాళ్లు 'ఆ దేవుడి దయ వల్ల బతికామని' చెప్పుకుంటారు కదా? మరి చనిపోయిన వారిని ఎవరు చంపినట్టూ? ఆ దేవుడే చంపాడని చెప్పాలి కదా? కానీ, చెప్పరు. ఒకవేళ ప్రమాదానికి గురైన ఆ కారులోని వారంతా చనిపోతే మీడియాలో వార్త ఇలా ఉంటుంది. "కారు బ్రేకులు ఫెయిల్: ఐదుగురు ప్రయాణికు మృతి"- అనే కదా ఉంటుందీ? బ్రేకు ప్రసక్తి ఉండదు.

ప్రయాణికులు బతికితే 'దేవుడి దయ' వల్ల బతికారనడం, మరణిస్తే తప్పు బ్రేకులు ఫెయిల్ కావడంపై పెట్టడం ఏమైనా బాగుందా? తప్పు దేవుడి మీద పెట్టి ఆయనే చంపేశాడని అనుకునే ధైర్యం ఉండదు. ప్రజలు ఇలాంటి ధోరణికి అలవాటు పడిపోవడం వల్ల కదా దేవుడు, జ్యోతిష్యం, వాస్తు, ఆత్మ, పునర్జన్మ వంటి అంధ విశ్వాసాలు సమాజంలో సజావుగా బతుకుతున్నాయి. ఇలాంటి విశ్వాసాల వల్లనే సమాజం రోగగ్రస్తమవుతూ ఉందీ? మన చుట్టూ జరుగుతున్న విషయాల్ని నిశితంగా పరిశీలిస్తూ, హేతుబద్ధంగా విశ్లేషించుకుంటే నిజానిజాలు బయటపడతాయి! దైవాన్నీ, జ్యోతిష్యాన్ని ప్రబోధించేవారు తమ సౌకర్యాను సారంగా ఆలోచనల్ని విధి విధానాలని మార్చుకుంటూ ఉంటారని - వీరేశలింగం పంతులు ఏనాడో చెప్పారు. మరి మనవాళ్లు ఏమైనా చెవికి ఎక్కించుకున్నారా? లేదే- గుడ్డెద్దు చేలో పడ్డట్టు గుడ్డిగా అంధ విశ్వాసాల్లో పడిపోతున్నారు.ఒక పెరియార్, ఒక కందుకూరి, ఒక తాపీ ధర్మారావు, ఒక గోరా, వివేచన అనే దుడ్డుకర్రతో జనాన్ని అదిలిస్తూనే వచ్చారు. వారి అడుగుజాడల్లో నడుస్తూ మనం కూడా ఆ పనిని కొనసాగిస్తూనే ఉండాలి? జన చైతన్యానికి దోహదం చేస్తూనే ఉండాలి!! ఇక ప్రస్తుత దేశ రాజకీయ పరిస్థితుల్లోకి వద్దాం. "మహా భారత కాలంలోనే సాటిలైట్ ఇంటర్నెట్ ఉంది."- అని అన్నాడు త్రిపుర ముఖ్యమంత్రి. నిజమే ఆయన ఊహ ప్రకారం ఆరోజుల్లో (అంటే ఆ కావ్యం రాసిన కాలంలో) చాలాచాలా జరిగేవేమో- బహుశా ఆ ఊహలు ఇలా ఎందుకు ఉండకూడదూ? యుద్ధం జరుగుతున్నప్పుడు కృష్ణుడు భయానక యుద్ధ చిత్రాల్ని ట్విట్టర్‌లో పోస్ట్ చేస్తూ అప్‌డేట్స్ ఇస్తూ ఉండొచ్చు. అర్జునుడు వాటిని ఇన్‌స్టాగ్రాంలో తన సైనిక బలగాలకు సూచనలిస్తూ ఉండొచ్చు. ధృతరాష్ట్రుడు యుద్ధ విశేషాల్ని ఎఫ్.ఎం.రేడియోలో వింటూ ఉండొచ్చు. పాండవులు తమ 'ఐఫోన్' తో సెల్ఫీలు దిగుతూ ఉండొచ్చ. మొత్తం యుద్ధాన్ని ఫేస్‌బుక్ లైవ్‌లో ప్రసారం చేస్తూ ఉండొచ్చు- ఇలా అని కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ దేశ భక్తుల్ని మనం ఎద్దేవా చేయడం కాదుగానీ- వాళ్లేమిటో వారే నిరూపించుకుంటున్నారు. మత ద్వేషం, ఆవుపేడ, ఆవు మూత్రం వంటి వాటితో ఈ దేశ ప్రజల్ని విడగొట్టి, విభజించి- దేశాన్ని హిందూరాష్ట్రగా మార్చాలన్న ఉద్దేశంతోనే విద్యారంగాన్ని కూడా కాషాయంలో ముంచుతున్నారు. దేశాన్ని మొత్తానికి మొత్తంగా మూఢ నమ్మకాల్లోకి దించుతున్నారు. "దేశం కాషాయీకరణ చెందితే తప్పేంటి?" అని ఈ దేశ మాజీ ద్వితీయ పౌరుడు, తెలుగువాడు వెంకయ్యనాయుడు ప్రశ్నిస్తుంటే- మనం 21 వ శతాబ్దంలో ఉన్నామా? లేదా సాధారణ శకానికి ముందున్న కాలంలో ఉన్నామా? అని అనుమానపడాల్సి వస్తోంది. ఇప్పుడు బాధ్యత ప్రతిపక్షాల మీద మాత్రమే కాదు, ప్రశ్నించగల సామర్థ్యం, స్థైర్యం గల సామాన్య పౌరుల మీద కూడా ఉంది. సామాన్య పౌరులు కూడా ప్రతిపక్షంలో ఉన్నట్టే- మనం హేతువాదుల వైజ్ఞానికుల, మానవవాదుల రచనలు చదువుతూ స్ఫూర్తిని పొందుతూ, ముసు ముందుకు దూసుకుపోవాల్సి ఉంది!

కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు విజేత,
విశ్రాంత బయాలజీ ప్రొఫెసర్

వైసీపీతోనే ఇంటింటి అభివృద్ధి

విశాలాంధ్ర- కైకలూరు/పిఠాపురం/చిలకలూరి పేట: పిఠాపురంలో వంగా గీతను గెలిపిస్తే...డిప్యూటీ సీఎం చేస్తానని సీఎం జగన్ హామీ ఇచ్చారు. మరోవైపు కుప్పంలో పోటీ చేస్తున్న భరత్‌ను కూడా మంత్రి చేస్తానని హామీ ఇచ్చారు. దత్త పుత్రుడు గెలిస్తే పిఠాపురంలో ఉంటాడా? అని జగన్ ప్రశ్నిం చారు. చిన్న జలుబు చేస్తే దత్తపుత్రుడు పిఠాపురం నుంచి హైదరాబాద్ పారిపోయాడని జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను ఉద్దేశించి తీవ్ర విమర్శలు చేశారు. ఎన్నికల ప్రచారానికి చివరిరోజైన శనివారం ఆయన గుంటూరు జిల్లా చిలకలూరిపేట, ఏలూరు జిల్లా కైకలూరు, కాకినాడ జిల్లా పిఠాపురంలో నిర్వహించిన సభల్లో సీఎం జగన్ ప్రసంగించారు. పిఠాపురంలో మహిళలు దత్త పుత్రుడ్ని నమ్మే పరిస్థితి ఉందా? అని ప్రశ్నించారు. ఐదేళ్లకు ఒకసారి కార్లు మార్చినట్లు భార్యలు మారుస్తాడు...ఈయన ఎమ్మెల్యే అయితే మహిళలు కలిసే పరిస్థితి ఉంటుందా? అని పవన్‌పై ధ్వజమెత్తారు. గాజువాక, భీమవరం అయిపోయింది... ఇప్పుడు పిఠాపురం అని ఎద్దేవా చేశారు. మరోవైపు.. సాధ్యం కాని హామీలతో చంద్రబాబు మేనిఫెస్టో ఇచ్చారని విమర్శించారు. 60 ఏళ్ల అధికారం మీరు నాకు అప్పగిస్తే... ఢిల్లీ నుంచి వచ్చిన రికమేండేషన్ తో 57 నెలలకే మీ బిడ్డ గొంతు నొక్కేశారని... మీ కోసం బటన్ నొక్కిన పథకాలు కూడా ఆపేశారని ఆరోపించారు. నా గొంతు కాదు... మీ గొం తు నొక్కుతున్నారని ప్రజలనుద్దేశించి అన్నారు. 14 ఏళ్లుగా సీఎంగా చేసిన చంద్రబాబు పేరు చెబితే ఒక పథకం గుర్తొస్తుందా? అని ప్రశ్నించారు. 2014 లో ఇచ్చిన ఒక్క హామీ అయినా చంద్రబాబు నేరవేర్చడా? ఇలాంటి హామీలు నమ్ముతారా? ఆలోచన చేయండని ప్రజలను కోరారు. తుప్పు పట్టిన సైకిల్‌కి రిపేర్ చేయాలని చంద్రబాబు చాలా కష్టపడుతున్నారని సీఎం జగన్ ఎద్దేవా చేశారు.

చంద్రబాబు మోసపూరిత హామీలు, ప్రలోభాలకు గురి కావద్దని...మరోసారి మోసపోవద్దని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత పథకాలు కొనసాగాలన్నా... ఇంటింటా అభివృద్ధి జరగాలన్నా మీ బిడ్డ జగన్‌ను మళ్లీ ఆశీర్వాదించాలని కోరారు. వైసీపీ 59 నెలల పాలనలో రూ.2లక్షల 70 వేల కోట్లు అక్కచెల్లెమ్మల ఖాతాలో వేశామన్నారు. ఇంటి వద్దకే రేషన్, వృద్ధాప్య పెన్షన్ అందించామన్నారు. మేనిఫెస్టోలో 99 శాతం హామీలు అమలు చేశామన్నారు సీఎం జగన్. ఇలాంటి మార్పు గతంలో ఎప్పుడైనా చూశారా అని ప్రశ్నించారు. స్వయం ఉపాధిని ప్రోత్సహించేలా ప్రభుత్వం అండగా నిలబడిందని చెప్పారు. రైతుల కోసం రైతు భరోసా, రైతు బీమా, ఆర్బీకే కేంద్రాలు, పగటి పూట 9 గంటల నాణ్యమైన విద్యుత్ అందజేశామన్నారు. విత్తనం నుంచి పంట కొనుగోలు వరకు రైతన్నకు అండగా నిలిచామన్నారు. ఈ ఎన్నికలు రాబోయే మీ భవిష్యత్తును నిర్ణయిస్తాయని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా మహిళల పేరుమీద ఏకంగా 31 లక్షల ఇళ్ల పట్టాలు ఇచ్చామన్నారు. లంచాలు, వివక్ష లేకుండా అర్హత ప్రామాణికంగా పథకాలు అందజేశామన్నారు. విద్యారంగంలో నాడు - నేడు పేరుతో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చామన్నారు. పేదలకు 3 సెంట్ల ఇళ్ల స్థలం అన్నారు.. ఒక్క సెంటు అయినా ఇచ్చారా అని విమర్శించారు. చంద్రబాబు గత ఎన్నికల్లో చెప్పిన మేనిఫెస్టోలో ఇచ్చిన ఒక్క హామీనైనా అమలు చేశారా అని నిలదీశారు. అవ్వాతాతలకు ప్రతి నెలా ఇంటివద్దకే వచ్చే పెన్షన్ ఆపి చంద్రబాబు వారి ఉసురుపోసుకున్నారన్నారు. పేదలకు అందే లబ్ధిని వారి ఖాతాల్లో జమ కాకుండా చంద్రబాబు ఢిల్లీ వాళ్లతో చేతులు కలిపి అడ్డుకున్నారన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పై చంద్రబాబు దుష్ప్రచారం చేస్తున్నారని.. వాటిని నమ్మొద్దని తెలిపారు.

విశాఖపట్నం రుషికొండలో బాలకృష్ణ, మంగళగిరిలో పవన్ కళ్యాణ్ భూములు కొన్నారన్నారు. వారికి జిరాక్స్ కాపీలు ఇచ్చారా లేక ఒరిజినల్ డాక్యుమెంట్స్ ఇచ్చారా అని ప్రశ్నించారు. చివరి రోజు జగన్ పాల్గొన్న ఎన్నికల ప్రచారసభలకు పెద్ద ఎత్తున జనం తరలి వచ్చారు.

విమల గెలుపు బాధ్యత మనదే

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీఎస్ఎన్

విశాలాంధ్ర- మల్కాపురం (విశాఖ): ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించుకోవడం మన బాధ్యతని, చట్టసభల్లో ప్రజల పక్షాన మాట్లాడే నాయకులను ఎన్నుకోవడం ద్వారా మన సమస్యలు పరిష్కారం అవుతాయని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు. పారిశ్రామిక ప్రాంతం పరిధిలోని 59వ వార్డు జింక్ గేట్ నుంచి హిమాచల్ నగర్, గణపతి నగర్, గాజువాక డిపో, జనతా కాలనీ మీదుగా కొండవాలు ప్రాంతాలను కలుపుకుంటూ పశ్చిమ నియోజకవర్గ ఇండియా కూటమి బలపరిచిన సీపీఐ అభ్యర్థి అత్తిలి విమలకు సంఘీభావంగా శనివారం ర్యాలీ నిర్వహించారు. విమల గుర్తు కంకి కొడవలి, సత్యారెడ్డి గుర్తు హస్తంకు ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి జీఎస్‌జే అచ్యుతరావు, కాండ్రేగుల సత్యాంజనేయ, గుడాల రాంబాబు, ఏఐటీయూసీ నేత కసిరెడ్డి సత్యనారాయణ, పెద్దఎత్తున మహిళా నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మికులకు న్యాయం ఇండియా కూటమితోనే సాధ్యం

కార్మికులకు పనికి తగిన వేతనం రావాలన్నా, సామాన్య మానవుడికి న్యాయం జరగాలన్న ఇండియా కూటమితోనే సాధ్యమని కోరమండల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు జేవీ సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు. కోరమండల్ పరిశ్రమ ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ఎన్డీఏ ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేస్తూ లాభాల్లో ఉన్న పరిశ్రమలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించి వారికి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

అవకాశమివ్వండి... అభివృద్ధి చేసి చూపుతా

ఎన్నికల ప్రచారంలో రామచంద్రయ్య

విశాలాంధ్ర-పత్తికొండ: తనకు ఎమ్మెల్యేగా ఒక్క అవకాశమిస్తే నియోజకవర్గ అభివృద్ధి చేసి చూపుతానని కర్నూలు జిల్లా పత్తికొండ అసెంబ్లీ సీపీఐ అసెంబ్లీ అభ్యర్థి పి.రామచంద్రయ్య అన్నారు. మండలంలోని చక్రాళ్ళ, కురువలదొడ్డి, రాతన కొత్తూరు, రామచంద్రాపురం, పట్టణంలోని మడ్డిగేరి, బ్రాహ్మణ వీధుల్లో శనివారం పార్టీ శ్రేణులతో కలిసి విస్తృత ప్రచారం నిర్వహించారు. గడప గడపకు వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా రామచంద్రయ్య మాట్లాడుతూ... గత పాలకులు నియోజకవర్గ అభివృద్ధిని విస్మరించారన్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే ప్రజలను మభ్యపెడుతూ ఓట్లు అడిగేందుకు వస్తున్నారని ధ్వజమెత్తారు. వైసీపీ, టీడీపీని ఓడించి ఇంటికి సాగనంపాలన్నారు. ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించినట్లయితే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. జిల్లాలో 106 చెరువులకు నీళ్లు నింపుతామని, హంద్రీనీవా కింద ఉన్న కుడి, ఎడమ కాలువల ను పూర్తిచేసి పంట పొలాలకు సాగునీరు అందిస్తామన్నారు. పత్తికొండలో టమోటా జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటు, ప్రభుత్వ ఆసుపత్రిని 30 పడకల నుంచి 100 పడకలకు పెంచుతామన్నారు. తన గుర్తు కంకి-కొడవలి, కర్నూలు పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి రాం పుల్లయ్య యాదవ్ హస్తం గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆవుల శేఖర్, మండల కార్యదర్శి డి. రాజా సాహెబ్, పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, జిల్లా సమితి సభ్యుడు కృష్ణయ్య, ప్రజానాట్యమండలి నేత వెంకటరాముడు, శివయ్య, తిమ్మ గురుడు, ప్రజా సంఘాల నాయకులు గుండు బాష, నెట్టి కంటయ్య, ఎంకే సుంకన్న, రాజప్ప, ఓబులేసు, పెద్దముని పాల్గొన్నారు.

ఓటర్ల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎన్నికలను పురస్కరించుకుని ఏపీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. హైదరాబాద్‌తోపాటు వివిధ ప్రాంతాలకు రెగ్యులర్‌గా నడిచే సర్వీసులతో పాటు అదనపు సర్వీసులను ఆదివారం ఏర్పాటు చేసింది. ఈ మేరకు ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు ఈ విషయాన్ని వెల్లడించారు. హైదరాబాద్ నుంచి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు రోజూ నడిచే 339 సర్వీసులతోపాటు శనివారం 302, ఆదివారం 206 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. హైదరాబాద్ నుంచి ఒంగోలుకు 38 బస్సులు, ఏలూరు 20, మచిలీపట్నానికి 23, విజయవాడకు 45, గుంటూరు 18, నరసరావుపేట 26, నెల్లూరు 17, నంద్యాల 19, విశాఖపట్నం నాలుగు ప్రత్యేక బస్సులు శనివారం నడిపారు. హైదరాబాద్ బీహెచ్ఈఎల్, ఎంజీబీఎస్, ఈసీఐఎల్, జీడీమెట్ల, రాజీవ్‌గాంధీ ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి ఓటర్లు తరలిరావడంతో విజయవాడ బస్‌స్టేషన్ ప్రాంగణం రద్దీగా మారింది. విజయవాడ నుంచి విశాఖపట్నం, రాజమండ్రి, తిరుపతి, నెల్లూరు, కాకినాడ, ఏలూరు, ఒంగోలు, గుంటూరు తదితర ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు నడిపారు. బెంగుళూరు నుంచి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు మొత్తం 323 బస్సులు, ఆదివారం మరో 269 బస్సులు నడుస్తాయి.

మూగబోయిన మైకులు

(మూడోపేజీ తరువాయి)

చేయకూడదు. ఏపీలో 4.14 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. ఇందుకోసం 46,389 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆదివారం సాయంత్రం నాటికి ఈవీఎంలు పోలింగ్ కేంద్రాలకు చేరతాయి. 175 అసెంబ్లీ, 25 లోక్‌సభ స్థానాల్లో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకుగాను ఏపీ ఎన్నికల ప్రధాన అధికారి ముఖేశ్ కుమార్ మీనా అధ్వర్యంలో పటిష్టమైన చర్యలు చేపట్టారు. ఎక్కడా రీ పోలింగ్‌కు తావులేకుండా ఎన్నికలు సజావుగా జరిగేందుకుగాను కలెక్టర్లు, ఎస్పీలకు తగిన ఆదేశాలు జారీజేశారు. పోలింగ్ ప్రక్రియ దగ్గర పడటంతో రాబోయే 72 గంటల్లో అధికార యంత్రాంగం చేపట్టబోయే చర్యలపై ముఖేశ్ కుమార్ మీనా దిశా నిర్దేశం చేశారు.

పోటాపోటీగా ప్రచారం

ఇండియా కూటమి, వైసీపీ, ఎన్‌డీఏ కూటమి పార్టీలు పోటాపోటీగా మేనిఫెస్టోలతో ప్రజల ముందుకు వెళ్లాయి. ఎన్నికల బరిలో ఇండియా కూటమి (కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం) ప్రచారం ముగిసింది. కేంద్ర, రాష్ట్ర నేతలు రాష్ట్రానికి తరలివచ్చి ఇండియా కూటమి అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారం చేపట్టారు. విజయవాడ జింఖానా గ్రౌండ్ వేదికగా జరిగిన ఉమ్మడి సభకు సీపీఐ, సీపీఎం జాతీయ నేతలు డి.రాజా, సీతారాం ఏచూరి, ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు కె.రామకృష్ణ, వి.శ్రీనివాసరావు ప్రచారం నిర్వహించారు. కేంద్రం, రాష్ట్రంలో ఇండియా కూటమి అధికారంలోకి వస్తే ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీలు సాధ్యమని, రాజ్యాంగ పరిరక్షణ ఉంటుందన్న నినాదాలు తీసుకెళ్లాయి. కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల ఒక వైపు బస్సు యాత్రలు, మరో వైపు బహిరంగ సభలు నిర్వహించారు. కడప ఎన్నికల సభకు కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ హాజరయ్యారు. ఇండియా కూటమి నేతల ప్రచారంలో... కేంద్రంలోని బీజేపీకి రాష్ట్రంలోని టీడీపీ, వైసీపీ తొత్తులుగా మారాయంటూ ధ్వజమెత్తారు.

వైసీపీ అధినేత, సీఎం జగన్ జనవరి 26న ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. పులివెందులలో ఆయన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించి, పిఠాపురం నియోజకవర్గంలో ముగించారు. ఉత్తరాంధ్ర, కోస్తా, సీమ ప్రాంతాలను కవర్ చేస్తూ నాలుగు 'సిద్ధం' సభలను నిర్వహించారు. వాటికి కొనసాగింపులో 'మేమంతా సిద్ధం' సభలతో బస్సు యాత్రలు నిర్వహించారు. తుది దశలో హెలికాప్టర్ ద్వారా కొన్ని కీలక నియోజకవర్గాల్లో రోజుకు మూడు చొప్పున ప్రచారం నిర్వహించారు. 'మేమంతా సిద్ధం' పేరుతో 106 నియోజకవర్గాల్లో బస్సు యాత్ర కొనసాగింది. 34 నియోజకవర్గాల్లో బహిరంగ సభలు, 14 నియోజకవర్గాల్లో రోడ్ షోలను సీఎం జగన్ నిర్వహించారు. తిరిగి వైసీపీ అధికారంలోకి వస్తేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని, చంద్రబాబు వస్తే అవి రద్దవుతాయంటూ జగన్ సభల్లో ప్రత్యేకంగా ప్రకటించారు. మరోవైపు, ఎన్‌డీఏ కూటమి నుంచి మోదీ, అమిత్ షా, జనగళం పేరుతో చంద్రబాబు, పవన్ విస్తృతంగా ప్రచారం చేపట్టి, బీజేపీ, టీడీపీ, జనసేన అభ్యర్థులను గెలిపించాలని అభ్యర్థించారు. ప్రధాని మోదీ ఎన్నికల పర్యటన నిమిత్తం రాష్ట్రానికి మూడు విడతలుగా విచ్చేశారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఒకసారి వచ్చారు. విజయవాడ పీవీపీ నుంచి బెంజిసర్కిల్ వరకు ప్రధాని మోదీ, చంద్రబాబు, పవన్ రోడ్ షో చేపట్టి ప్రజలను ఓట్లు అభ్యర్థించారు. ప్రజాగళం పేరుతో చంద్రబాబు 90 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రచారం చేపట్టారు. ఈ సభల ద్వారా సీఎం జగన్ ప్రభుత్వ అవినీతితో పాటు ఆయనపై వ్యక్తిగతంగా మాటల దాడిని పెంచేశారు. ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి వస్తే ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేస్తామన్న ప్రచారాన్ని విస్తృతంగా తీసుకెళ్లారు. జగన్ అధికారంలోకి వస్తే మీ భూమి మాయమవుతుందంటూ యాడ్‌ల రూపంలో ఓటర్లకు సమాచారమిచ్చారు. ఈ ఎన్నికల్లో పోటీలో ఉన్న అనేక మంది అభ్యర్థులకు సినీ నటులు, రాజకీయ ప్రముఖులు, కుటుంబీకులు మద్దతు ప్రకటిస్తున్నారు. కడప కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి షర్మిలకు ఆమె తల్లి వైఎస్ విజయమ్మ మద్దతిస్తూ వీడియో సందేశాన్ని విడుదల చేశారు. నంద్యాల వైసీపీ అభ్యర్థి శిల్పా రవిచంద్ర కిశోర్ రెడ్డికి మద్దతుగా సినీ నటుడు అల్లు అర్జున్, ఆయన భార్య స్నేహ నేరుగా ప్రచారం నిర్వహించారు. వేల సంఖ్యలో అక్కడి అభిమానులు, వైసీపీ శ్రేణులు తరలివచ్చారు. అల్లు అర్జున్ రాకతో అక్కడ జోష్ నెలకొంది. గత ఎన్నికల్లోనూ శిల్పా రవిచంద్రకు మద్దతుగా అల్లు అర్జున్ ట్వీట్ చేసిన విషయం విదితమే. పిఠాపురంలో పవన్ కల్యాణ్‌కు మద్దతుగా రామ్‌చరణ్, అల్లు అర్జున్, వారి కుటుంబీకులు ప్రచారం నిర్వహించారు.

మద్యం దుకాణాల బంద్

సార్వత్రిక ఎన్నికలతో మద్యం విక్రయాలు బంద్ అయ్యాయి. 48 గంటల పాటు మద్యం డ్రై డేను ప్రకటించింది. శనివారం సాయంత్రం 6 గంటల నుంచి ఈనెల 13వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు మద్యం దుకాణాలు బంద్ కానున్నాయి. దీంతో రాజకీయ పార్టీలు పెద్ద ఎత్తున మద్యం కొనుగోలు చేసి, ఓటర్లకు పంపిణీ చేసేందుకు సిద్ధం చేశాయి.

వచ్చేది 'ఇండియా' సర్కారే

(మూడోపేజీ తరువాయి)

గత 20 గంటల్లో రాజకీయ విశ్లేషకులు, ప్రజలతో సంప్రదింపులు జరిపాను. బీజేపీ తిరిగి అధికారంలోకి రాదని స్పష్టంగా తెలుస్తుంది' అని కేజ్రీవాల్ ప్రకటించారు. తదుపరి ఇండియా కూటమి ప్రభుత్వంలో ఆప్ భాగస్వామ్యాన్ని ధ్రువీకరిస్తూ, ఢిల్లీకి పూర్తి రాష్ట్ర హోదా కల్పిస్తామని ప్రతిజ్ఞ చేశారు. శనివారం ఉదయం కన్నాట్ ప్లేస్‌లోని హనుమాన్ ఆలయాన్ని ఆయన సందర్శించారు. అనంతరం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన కేజ్రీవాల్ ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ, 'మా పార్టీకి ఆ హనుమంతుడి ఆశీస్సులు ఉన్నాయి. అద్భుతం జరిగి నేను మళ్లీ మీ మధ్యకు రాగలిగాను. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) చాలా చిన్న పార్టీ. కేవలం రెండు రాష్ట్రాల్లోనే అధికారంలో ఉంది. అలాంటి మమ్మల్ని అణచివేసేందుకు ప్రధాని మోదీ ఏ ప్రయత్నాన్నీ వదల్లేదు. నలుగురు నాయకులను జైలుకు పంపించారు. ఒక పార్టీ నుంచి నలుగురు అగ్ర నేతలు జైలుకు వెళితే... దాని మనుగడ కొనసాగగలదా? ఆప్‌ను మట్టికరిపించాలని ప్రధాని భావిస్తున్నారు. ఆప్ ఒక్కటే దేశానికి అద్భుతమైన భవిష్యత్తును అందించగలదని ఆయన కూడా నమ్ముతున్నారు. ఆమ్ ఆద్మీ ఒక పార్టీ కాదు. సిద్ధాంతం. మీరెంత అణగదొక్కితే మేం అంత పైకి లేస్తాం' అని కేజ్రీవాల్ అన్నారు. 'నేను త్వరలో తిరిగి వస్తానని నేను మీకు చెప్పలేదా? నేను తిరిగి వచ్చాను. నియంతృత్వానికి వ్యతిరేకంగా పోరాడుతున్నాను. ఇప్పుడు మనలో 140 కోట్ల మంది ఆ పని చేయవలసి ఉంది' అని ఆయన అన్నారు.

మోదీ తర్వాత మీ ప్రధాని అభ్యర్థి ఎవరు?

'విపక్ష ఇండియా కూటమికి నాయకుడు ఎవరు? అని బీజేపీ తరచూ అడుగుతోంది. మరి వారి ప్రధాని అభ్యర్థి ఎవరు? వచ్చే సెప్టెంబరు 17 నాటికి మోదీకి 75 ఏళ్లు వస్తాయి. బీజేపీలో ఆ వయసు వారు రిటైర్మెంట్ తీసుకోవాలని ప్రధానే నిబంధన పెట్టారు. అద్వానీ, మురళీ మనోహర్ జోషి, సుమిత్రా మహజన్ లాంటి వారిని అలాగే పక్కనబెట్టారు. మరి మోదీ కూడా రిటైర్ అవుతారా? అలాగైతే ప్రధానిగా వారిలో ఎవరిని ఎన్నుకొంటారు?' అని సీఎం కేజ్రీవాల్ ప్రశ్నించారు. ఎన్నికల తర్వాత రెండు నెలల్లో ఉత్తర ప్రదేశ్ సీఎం కూడా మారతారని చెప్పారు. యోగి ఆదిత్యనాథ్‌ను పక్కనబెడతారని అన్నారు. అమిత్ షా కోసమే ప్రధాని ఇప్పుడు ఓట్లు అడుగుతున్నారని, మరి మోదీ గ్యారంటీని షా నెరవేరుస్తారా? అని దుయ్యబట్టారు. 'ప్రజాస్వామ్యాన్ని జైలులో పెడితే... అక్కడి నుంచే ప్రజాస్వామ్య పాలన సాగుతుందని చెప్పేందుకు నేను రాజీనామా చేయలేదు. జైలు నుంచే నియంతపై పోరాటం చేశా. బీజేపీ నియంతృత్వ విధానాలకు వ్యతిరేకంగా దేశమంతా ప్రచారం చేస్తా' అని వెల్లడించారు. అవినీతిపై పోరాటం చేస్తున్నామని ప్రధాని చెబుతున్నారని, కానీ వారి పార్టీలోనే అవినీతి నేతలంతా ఉన్నారని దుయ్యబట్టారు. 'అవినీతిపై పోరాటం ఎలా చేయాలో కేజ్రీవాల్‌ను చూసి నేర్చుకోండి. తప్పు చేస్తే సొంత పార్టీ నేతనే మేం జైలుకు పంపించాం' అని గుర్తు చేశారు.

నేడు ఆప్ నేతలతో కేజ్రీవాల్ కీలక సమావేశం

ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఆదివారం ఆప్ ఎమ్మెల్యేలందరితో సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. సివిల్ లైన్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో ఈ సమావేశం జరుగుతుందని వారు తెలిపారు. 'ఇది కీలక సమావేశం. మే 25న ఢిల్లీలో లోక్‌సభ ఎన్నికలపై చర్చ కూడా జరుగుతుంది' అని పార్టీ వర్గాలు తెలిపాయి.

'ఇండియా' ప్రభుత్వంలో ఆప్ భాగం : పంజాబ్ సీఎం మాన్

జూన్ 4న కేంద్రంలో ఏర్పాటయ్యే ఇండియా కూటమి ప్రభుత్వంలో ఆప్ భాగస్వామ్యమని, లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 400 సీట్లు దాటదని పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ శనివారం అన్నారు. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ మధ్యంతర బెయిల్‌పై విడుదలైన ఒక రోజు తర్వాత ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కార్యకర్తలను ఉద్దేశించి మాన్ ప్రసంగిస్తూ, ఆయన 'నియంతృత్వ శత్రువని' అభివర్ణించారు. 'నేను ప్రతిచోటా చెప్పాను. కేజ్రీవాల్ ఒక వ్యక్తి కాదు ఒక ఆలోచన. మీరు ఒక వ్యక్తిని అరెస్టు చేయవచ్చు కానీ ఆలోచనను కాదు. నియంతృత్వ శత్రువే కేజ్రీవాల్' అని ఆయన అన్నారు. కష్ట సమయాల్లో పార్టీకి అండగా నిలిచిన ఢిల్లీ విప్లవకారులకు మాన్ కృతజ్ఞతలు తెలిపారు. దేశ రాజకీయాల పరిస్థితి, దిశా నిర్దేశం గురించి కేజ్రీవాల్ ఏం చెబుతారో ప్రజలు వినాలనుకుంటున్నారని తెలిపారు. సంక్షోభ సమయంలో తమ పార్టీకి అండగా నిలిచినందుకు ఢిల్లీ ప్రజలను మాన్ ప్రశంసించారు. ఎన్నికలకు కేవలం 20 రోజుల సమయం మాత్రమే ఉన్నందున 'కష్టపడి పని' చేయవలసిన అవసరం ఉందని ఆయన అన్నారు.

ఎన్డీఏ కూటమిదే అధికారం

(మూడోపేజీ తరువాయి)

ఇచ్చారు. పింఛన్ తీసుకొచ్చిందే తెలుగుదేశం పార్టీ అని... రూ.200 పింఛన్‌ను రూ.2 వేలు చేశామని తెలిపారు. ఇప్పుడు అదే పింఛన్‌ను రూ.4 వేలకు పెంచి ఏప్రిల్ నుంచే ఇస్తామని హామీ ఇచ్చారు. పాత బకాయిలతో కలిపి జులైలో రూ.7 వేలు పింఛన్ ఇస్తామని, దివ్యాంగులకు రూ.6 వేలు పింఛన్ ఇస్తామన్నారు. ఇంటి వద్ద పింఛన్ ఇవ్వకుండా వైసీపీ నేతలు శవరాజకీయాలు చేశారని చంద్రబాబు ఆరోపించారు. భూమి పాస్ పుస్తకంపై జగన్ ఫొటో ఎందుకు చంద్రబాబు ప్రశ్నించారు. ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని రద్దుచేస్తూ రెండో సంతకం చేస్తానని తెలిపారు. భూమి పాస్ పుస్తకంపై రాజముద్ర ఉండాలని... సైకో ఫొటో కాదని ఎద్దేవా చేశారు. ఈ చట్టం అమల్లోకి వస్తే... మనకు ఏ సమస్య ఉన్నా ల్యాండ్ టైటిలింగ్ ఆఫీసర్ వద్దకే వెళ్లాలని అన్నారు. తనది అభివృద్ధి బ్రాండ్ అయితే జగన్‌ది విధ్వంసం అన్నారు. జగన్ తనను అక్రమంగా అరెస్టు చేయించారని గుర్తు చేసుకున్నారు. జగన్‌ను ఇంటికి పంపేందుకు ప్రతి ఒక్కరూ ఓటు కోసం పోటెత్తాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. జగన్ ముఖ్యమంత్రిగా వైజాగ్ లో ప్రమాణస్వీకారం చేస్తా అంటున్నాడని, ఇడుపులపాయలోని నీ తండ్రి సమాధి వద్ద ప్రమాణ స్వీకారం చేస్తే ఇంకా బాగుంటుందని ఎద్దేవా చేశారు. చెల్లి చీర మీద సెటైర్లు వేయడం జగన్ కే చెల్లిందన్నారు. పెద్ద సైకో తాడేపల్లిగూడెంలో ఉంటే చిన్న సైకో నంద్యాలలో ఉన్నాడని, పవన్ కుటుంబ సభ్యుడైన అల్లు అర్జున్‌ను తన ఇంటికి పిలిపించుకొని... జనసేన జెండాలతో స్వాగతం పలికించుకుని నీచ రాజకీయానికి పాల్పడ్డాడన్నారు. జగన్ కు కూల్చడం తప్ప నిర్మించడం తెలియదని, అందుకే ప్రజావేదికను కూల్చాడన్నారు. జగన్ జైలుకు వెళ్లడం ఖాయమని, ఇల్లు లేదని చెప్పే జగన్ కు ఇక జైలే ఇల్లు కాబోతుందన్నారు. అమరావతిని నాశనం చేశాడని, మూడు రాజధానుల పేరుతో మూడు ముక్కలాట ఆడుతున్నారని విమర్శించారు. జగన్ ను గెలిపిస్తే మీ జీవితాలు నాశనమవుతాయని హెచ్చరించారు. చిత్తూరులో జరిగిన సభలో మాట్లాడుతూ... వైసీపీ ప్రభుత్వంపై ప్రజల్లో తిరుగుబాటు మొదలైందని.. ఎన్డీయే కూటమిదే అధికారమనిచెప్పారు. 'నేను పుట్టిన జిల్లా. రాజకీయ జన్మనిచ్చి.. ఓనమాలు నేర్పిన జిల్లా ఇది. అందుకే ఎన్నికల ప్రచారంలో చివరి సభ ఇక్కడ పెట్టుకున్నా' అన్నారు. 'తిరుపతిలో ఐఐటీ, ఐసర్ లాంటి విద్యా సంస్థలు ఏర్పాటు చేశాం. హైవేల విస్తరణకు కృషి చేసిన పార్టీ మాది. 49 సీట్లు ఇచ్చిన రాయలసీమ ప్రజలను జగన్ మోసం చేశారు. చిత్తూరు జిల్లాలో పదవులన్నీ పెద్దిరెడ్డికే కావాలి. మేం వచ్చాక తిన్నదంతా వసూలు చేస్తాం. జగన్.. ఎర్రచందనం స్మగ్లర్లకు సీట్లు ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వంపై ప్రజల్లో తిరుగుబాటు కనిపిస్తోంది. మహిళలు, యువత, చిరు వ్యాపారులు అందరూ తిరగబడ్డారు. నిత్యావసరాల ధరలు పెరిగి పేదల జీవితాలు దుర్భరంగా మారాయి. పది రూపాయలు ఇచ్చి.. రూ.100 దోచుకుంటున్నారు. జగన్ పాలనలో కరెంటు ఛార్జీలు ఎన్నిసార్లు పెంచారు? మద్యనిషేధం పేరుతో ప్రజలను జగన్ మోసం చేశారు. ఇక్కడ మద్యం కొనలేక పక్క రాష్ట్రాలకు వెళ్లి తెచ్చుకుంటున్నారు. వైకాపా నేతలు మాత్రం ఇసుక, మట్టి, ఖనిజం దోచుకుంటున్నారు' అని చంద్రబాబు విమర్శించారు. చంద్రబాబు సభలకు టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

షర్మిలను గెలిపించండి

అమెరికా నుంచి విజయమ్మ వీడియో సందేశం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కడప పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న షర్మిలను గెలిపించాలని ఆమె తల్లి వైఎస్ విజయమ్మ ఓటర్లను అభ్యర్థించారు. ఈ మేరకు శనివారం ఆమె ఒక వీడియో సందేశాన్ని విడుదల చేయడం చర్చనీయాంశంగా మారింది. పీసీసీ అధ్యక్షురాలిగా షర్మిల బాధ్యతల స్వీకరణ నుంచి విజయమ్మ ఏపీ రాజకీయాలకు దూరంగా ఉన్నారు. ఆ తర్వాత వైసీపీ అభ్యర్థుల జాబితా విడుదల సమయంలో ఇడుపులపాయకు విజయమ్మ విచ్చేసి జగన్‌ను ఆశీర్వదించారు. వైసీపీ తరపున విజయమ్మ ఎన్నికల ప్రచారం చేస్తారని ఆ పార్టీ శ్రేణులు ఆశించినా ఆమె ముందుకు రాలేదు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన కొద్ది రోజులకే అమెరికాకు వెళ్లినట్లు తెలిసింది. దీంతో ఏపీలో వైసీపీకి, కాంగ్రెస్‌కు ఆమె ప్రచారం చేయకుండా దూరంగా ఉన్నారని అందరూ భావించారు. ఈ తరుణంలో షర్మిలను గెలిపించాలంటూ కడప ప్రజలకు ఆమె విజ్ఞప్తి చేశారు. 'కడప ప్రజలకు నా విన్నపం. వైఎస్ఆర్‌ను అభిమానించే, ప్రేమించే వారికి నా హృదయ పూర్వక నమస్కారాలు. వైఎస్ఆర్ బిడ్డ షర్మిలమ్మ ఎంపీగా పోటీ చేస్తున్నది. కడప జిల్లా ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించండి. ఆమెను పార్లమెంట్‌కు పంపాలని మిమ్మల్ని ప్రార్థిస్తున్నా అని ఆమె విజ్ఞప్తి చేశారు.

ఎన్నికల ఘట్టం ముగిసే చివరి రోజు విజయమ్మ చేసిన ప్రకటనలో వైసీపీ శ్రేణులు ఒకింత ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే కడప కేంద్రంగా షర్మిల తిష్టవేసి ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నారు. ఆమెకు సోదరి సునీత అండదండలు మెండుగా ఉన్నాయి. ఇండియా కూటమిలోని సీపీఐ, సీపీఎం పార్టీలు సంపూర్ణ మద్దతిస్తున్నాయి. విజయమ్మ ప్రకటనతో కడప కాంగ్రెస్‌లో జోష్ నెలకొంది.

ప్రలోభాల జాతర

(మూడోపేజీ తరువాయి)

కొనసాగుతోంది. అభ్యర్థులకు గెలుపుపై నమ్మకం ఉన్నప్పటికీ, ముందస్తు జాగ్రత్తతో పోటీపడి పంచేశారు. 2019తో పోలిస్తే, 2024 ఎన్నికలు అత్యంత ఖరీదైనవిగా మారాయి. ఈ దుస్థితికి ధనబలం గల నేతలను ఎన్‌డీఏ, వైసీపీ పోటీకి దించడమేనన్న విమర్శలున్నాయి. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల బరిలో వ్యాపార వేత్తలు, పెట్టుబడిదారులు, ఆర్థిక కుంభకోణాలకు పాల్పడిన వారు నిలిచారు. మరికొందరిపై కేసులూ ఉన్నాయి. వారి నామినేషన్ల సమయంలో వెల్లడించిన ఆస్తులు కోట్లకు పడగలెత్తాయి. ప్రజాసేవ ముసుగులో తమ వ్యాపారాల విస్తరణ కోసమే కొందరు రాజకీయ ప్రవేశం చేసినట్లుగా తెలుస్తున్నది. ఈ ఎన్నికల్లో చాలా అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్లమెంట్ అభ్యర్థికి ఉన్న స్థాయిలో పోటీ నెలకొంది. దీంతో ఎన్నికల కమిషన్ విధించిన ఖర్చుకు మించి ప్రచారం చేశారు. రాజకీయ పార్టీల నేతలు డబ్బు, మద్యం విచ్చలవిడిగా పంపిణీ చేస్తున్నారు. 175 అసెంబ్లీ, 25 లోక్‌సభ ఎన్నికల్లో వైసీపీ, ఎన్‌డీఏ కూటమి (బీజేపీ, టీడీపీ, జనసేన) అభ్యర్థులు డబ్బును విచ్చలవిడిగా పంచుతున్నారు. ఉత్తరాంధ్ర, కోస్తా, రాయలసీమ జిల్లాల్లో కోట్లాది రూపాయలు ఓట్ల చెంతకు చేరింది. వారం రోజుల ముందుగానే నియోజకవర్గాలకు డబ్బు చేరినట్లుగా తెలిసింది. ప్రతి అసెంబ్లీలో ఓటుకు రూ.1500, రూ.2 వేలు, రూ.3 వేలు చొప్పున ఓటర్లకు తమ ఏజెంట్లు, కార్యకర్తల ద్వారా అందజేస్తున్నారు. ప్రధాన అభ్యర్థులు పోటీలో ఉన్న నియోజకవర్గాల్లో ఓటుకు రూ.4 వేలకు పైగా కొన్ని ప్రాంతాల్లో పంపిణీ చేస్తూ డబ్బును విరజిమ్మేస్తున్నారు. అంతటితో ఆగకుండా ఉపకరణాలు అందజేస్తున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి డబ్బు కట్టలు, మద్యం సంచులు రాష్ట్రానికి దిగుమతి అవుతున్నాయి. అట్ట పెట్టెలు, సున్నం బాక్సులు, పీవీసీ పైపుల మధ్యలో డబ్బులు పెట్టెలు దాచి... లారీల ద్వారా తరలిస్తున్నారు. ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ సరిహద్దుల్లో పోలీసుల తనిఖీల్లో డబ్బు భారీగా పట్టుబడింది. వీరవల్లి టోల్ ప్లాజ్ వద్ద జరిగిన లారీ రోడ్డు ప్రమాదంలో రూ.7 కోట్ల డబ్బు కట్టలు వెలుగు చూశాయి. దీనిపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఎన్నికలు అన్ని పార్టీలకూ ప్రతిష్ఠాత్మకంగా మారాయి. జనసేన రాష్ట్ర అధ్యక్షుడు పవన్ కల్యాణ్ పోటీ చేస్తున్న పిఠాపురం, చంద్రబాబు తనయుడు నారా లోకేశ్ పోటీ చేస్తున్న మంగళగిరి నియోజకవర్గాల్లో జనసేన, వైసీపీ భారీగా డబ్బు, మద్యం పంపిణీకి తెరదీశాయి. ఆయా నియోజకవర్గాల్లో ఓటుకు రూ.4 వేల చొప్పున ఇస్తున్నట్లు సమాచారం. వాటితో పాటు మహిళలకు అదనంగా గృహోపకరణ వస్తువులను బహుమతులుగా అందజేస్తున్నారు. ఎన్‌డీఏ పార్టీలు తొలుత పార్టీ సానుభూతి పరులున్న ప్రాంతాల్లో డబ్బులు పంపిణీ చేశాయి. వైసీపీ కూడా అదే విధానాన్ని పాటించింది. తుదకు ఓటర్ల నుంచి తిరుగుబాటు రావడంతో నియోజకవర్గం అంతా డబ్బు పంపిణీపై అభ్యర్థులు దృష్టి పెట్టాయి. డబ్బు పంపిణీ చేసే పార్టీ శ్రేణులపైనా నిఘా ఉంచి, అందరికీ చేరిందా?, లేదా? అనేదీ ఆరా తీస్తున్నారు.

పదేళ్లు ప్రత్యేక హోదా ఇస్తాం

(మూడోపేజీ తరువాయి)

పరిస్థితుల్లో రాహుల్‌గాంధీని ప్రధానిగా, షర్మిలను కడప ఎంపీగా చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పదేళ్ల మోదీ రాక్షసపాలనలో

దేశం వెనుకబడిపోయిందని, దీనిని తిరిగి గాడిలో పెట్టడానికి కంకి కొడవలి, కాంగ్రెస్ కలిసి దూసుకెళ్లాలన్నారు. ల్యాండ్ టైటిలింగ్ వివాదంపై స్పందిస్తూ పత్రాలపై హక్కుదారుల ఫొటోలకు బదులు పాలకుల ఫొటోలు ఉండటం ఏమిటని నారాయణ ప్రశ్నించారు. రాజశేఖర్‌రెడ్డి, చంద్రబాబు ఇచ్చిన పాసుపుస్తకాలపై భూ యజమాని చిరునామాతో పాటు ఫొటోలు ఉండేవని, ఇప్పుడు వైఎస్ జగన్ తన ఫొటోలు వేసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. మోదీ ముందు టీడీపీ, జనసేన, వైసీపీ మెడలు వంచి నమస్కరిస్తున్నాయని, ఇలాంటి వారిని ప్రజలు తిప్పికొట్టే విధంగా ఓటరు నాడి ఉండాలన్నారు. మోదీ రాజ్యాంగ వ్యతిరేక శక్తిగా తయారయ్యారని, దానికి వత్తాసు పలుకుతూ జగన్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాడని, ఇలాంటి వారిని ఇంటికి పంపించాలన్నారు. కుటుంబ సభ్యులను అష్టకష్టాలపాలు చేస్తున్న జగన్ నిజస్వరూపాన్ని ప్రజలు గుర్తించి తగిన ఫలితాన్ని ఓటు ద్వారా ప్రజలు ఇవ్వాలని ఆయన కోరారు. బహిరంగసభలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు కేసీ వేణుగోపాల్, మాణిక్యం ఠాకూర్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఓబులేసు, కర్నాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, మేయప్పన్, కమలాపురం కూటమి అభ్యర్థి గాలి చంద్ర, జిల్లాలో పోటీ చేసే నియోజకవర్గాలకు చెందిన కాంగ్రెస్ సభ్యులు పాల్గొన్నారు.

ఐదేళ్ల విధ్వంసం... మళ్లీ కొత్త నాటకం

జగన్‌పై విరుచుకుపడ్డ జనసేనాని

విశాలాంధ్ర-కాకినాడ బ్యూరో: దేశం దాటి వెళ్లాలంటే కోర్టు అనుమతి తీసుకునే వ్యక్తి సీఎంగా ఉండటం మన దౌర్భాగ్యమని జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఎద్దేవా చేశారు. ఎన్నికల ప్రచారం చివరి రోజు కాకినాడలో నిర్వహించిన సభలో పవన్ ప్రసంగించారు. ప్రజలు ఐదేళ్ల సమయం ఇస్తే... రాష్ట్రాన్ని అన్ని విధాలుగా సర్వ నాశనం చేసిన వ్యక్తి... ఇప్పుడు మళ్లీ కొత్తగా ఏదో చేస్తానని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. 'ఎన్నికల వేళ ఓట్ల కోసం రకరకాల మాటలు తియ్యగా చెబుతున్నాడు. రాష్ట్రాన్ని సర్వనాశనం చేసి, అభివృద్ధిలో అట్టడుగు స్థానానికి తీసుకెళ్లిన ఈ వైసీపీ నాయకుడికి ఇప్పటికే ఓడుతున్నట్లు అర్థమైంది' అని పవన్ అన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాలరాసి, ప్రజలకు కనీస భద్రత లేకుండా శాంతిభద్రతలను విచ్ఛిన్నం చేసి, ఆఖరికి ప్రజల ఆస్తులను లాక్కోవడానికి కొత్త కొత్త చట్టాలు తీసుకొస్తున్న ఈ ముఖ్యమంత్రి పాలనపై సగటు ప్రజలు ఎదురు తిరిగి తీర్పు చెప్పే సమయం వచ్చిందన్నారు. రాబోయే 24 గంటల్లో వైసీపీ చేసిన దుర్మార్గ పాలనను ఓటర్లు గుర్తు చేసుకోవాలని సూచించారు. ఎన్ని దాష్టీకాలకు తెగబడ్డాడో, అన్ని రంగాలను, వర్గాలను ఎంతలా ఇబ్బందిపెట్టాడో అన్ని ఆలోచించి 13వ తేదీ ఉదయం ఓటు వేయండని కోరారు.

గిరిరాజ్ గజగజ!



బెగూసరాయ్ బరిలో సీపీఐ

అవధేశ్‌కు జననీరాజనం

నీ వల్లే మా బాధలు: కేంద్రమంత్రిని నిలదీస్తున్న స్థానికులు

అది బీహార్ లెనిన్ గ్రాడ్. కార్మిక, కర్షక, విద్యార్థుల బలం ప్రోది చేసుకున్న కమ్యూనిస్టుల కంచుకోట. భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) నేతలు ఎందరో లోక్‌సభకు పోటీ చేసి ఎర్రజెండాను ఎగురవేసిన విజయ గడ్డ... బీహార్‌లోని బెగూసరాయ్ పార్లమెంటరీ నియోజకవర్గం. ప్రజా పోరాటాల ప్రభంజనానికి... మతతత్వ రాజకీయాలు, అసత్య ప్రచారం, పార్టీ ఫిరాయింపులు, విద్వేషం, కోతల రాయుళ్ల బండారం బయట పడిపోతోంది. ఐదేళ్ల కాలంలో బెగూసరాయ్ ఎంపీగా ఉన్న గిరిరాజ్ సింగ్ ఇప్పుడూ అధికారపక్ష అభ్యర్థిగా ఉన్నారు. ఎంపీగా ఆయన చేసిందల్లా 'హిందూస్థాన్-పాకిస్థాన్', 'హిందూ-ముసల్మాన్', 'ఝుట్కా మాంసం' గురించే మాట్లాడడమే!

బీహార్ బీజేపీ శ్రేణుల్లో అలజడి ఆరంభమైంది. సునాయాసంగా గెలుస్తామనే కమలనాథుల లెక్కలు తారుమారవుతున్నాయి. బెగూసరాయ్ నియోజకవర్గంలో వెనుకబడిన వర్గాలకు చెందిన, ఒక పూట తింటే మరో పూట లేని వ్యక్తిని, నిఖార్సైన నిజాయితీ పరుణ్ని 'ఇండియా' కూటమి రంగంలోకి దించింది. ఆయన దగ్గర గుమ్మరించడానికి డబ్బులు లేకపోవచ్చు కానీ సమాజం మార్పు కోసం నిజాయితీగా పోరాడే సామర్థ్యం ఉంది. ఆయన మూడు సార్లు బచ్వాడా నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. పురోగమన భావాలు ఉన్నందున ప్రజా సమస్యలను పరిష్కరించడానికీ, సంక్షేమ కార్యకలాపాలను అమలు చేయించడానికి ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చారు. అనేక విజయాలూ సాధించారు. ఆయన మరెవరో కాదు సీపీఐ నేత అవధేశ్ రాయ్.

అవధేశ్ రాయ్‌కు బెగూసరాయిలో అమితాదరణ ఉన్నది. 'బెగూసరాయ్ జనం మద్దతు అవధేశ్ రాయ్‌కే అన్న నినాదాలు మిన్నంటుతున్నాయి. అవధేశ్ సీపీఐ నాయకుడు. ప్రతిపక్ష ఐక్య సంఘటన 'ఇండియా' ఆయనను నిలబెట్టింది. అవధేశ్ రాయ్ రంగంలోకి దిగిన తరవాత బీజేపీ అభర్థి గిరిరాజ్ సింగ్ వెన్నులో వణుకు మొదలైంది.

మందిర్, మసీదు లాంటి మాయమాటలను జనం విశ్వసించేట్టు లేరు. రైతులు, వ్యవసాయ కార్మికులు, విద్యార్థులు, యువత, వివిధ మతాలను అనుసరించే వారు అవధేశ్ రాయ్‌కు అండగా నిలుస్తున్నారు. ఆయనకు సమకూరుతున్న మద్దతు చూస్తే మోదీ మాయ నుంచి బయటపడాలన్న ఆకాంక్ష జనంలో బలంగా ఉన్నట్టు రుజువవుతోంది.

భూమిహార్‌లే కీలకం

భూమిహార్లకు బెగూసరాయ్‌లో గట్టి పట్టున్నది. ఒక్క 2009లో మినహా ప్రతిసారీ ఆ వర్గానికి చెందినవారే ఎన్నికవుతారు. గత 10 ఎన్నికల్లో తొమ్మిది సార్లు వారే గెలుపొందారు. ఒకప్పుడు బీహార్‌కు పారిశ్రామిక రాజధానిగా వెలుగొందిన బెగూసరాయ్‌లో కార్మికులే ఎన్నికల్లో కీలక పాత్ర పోషించేవారు. ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా పరిశ్రమలు మూతపడ్డాయి. ఈ ప్రాంతం పారిశ్రామిక కళను కోల్పోయింది. 1967, 1996లో సీపీఐ అభ్యర్థులు ఘన విజయం సాధించారు. 2009 వరకూ బెగూసరాయ్‌లో సీపీఐ రెండో స్థానంలో నిలిచేది. 2014లో మోదీ హవాలోనూ సీపీఐ అభ్యర్థి రెండు లక్షల ఓట్లు సాధించారు. 2019లో గిరిరాజ్ సింగ్ ఎన్నికయ్యారు. 2014లోనూ ఆయన పార్టీయే గెలిచింది. అంతకుముందు ఎన్డీయే భాగస్వామి జేడీయూ విజయం సాధించింది. తాజా ఎన్నికల్లో బీజేపీ తరపున గిరిరాజ్ సింగ్ మరోసారి పోటీచేస్తున్నారు. 19 లక్షల ఓటర్లున్న ఈ నియోజకవర్గంలో 19శాతం మంది భూమిహార్లే కాగా మిగిలిన అగ్రవర్ణాల వారు 11 శాతం మంది ఉన్నారు. ముస్లింలు 15శాతం, 12శాతం మంది యాదవులు, ఏడు శాతం మంది కుర్మీలు ఉన్నారు. భూమిహార్లు, అగ్రవర్ణాలు, కుర్మీల ఓట్లు కలిస్తే 37 శాతం వస్తాయనే అపనమ్మకంతో బీజేపీ ఉంది.

బెగూసరాయ్‌లో 2014 ఎన్నికల్లో బీజేపీకి చెందిన భోలా సింగ్... ఆర్జేడీ అభ్యర్థి తన్వీర్ హసన్‌ను 58 వేల ఓట్ల తేడాతో ఓడించారు. భోలా సింగ్‌కి 4.28 లక్షల ఓట్లు వస్తే, తన్వీర్ హసన్‌కు 3.70 లక్షల ఓట్లు పడ్డాయి. సీపీఐ అభ్యర్థి రాజేంద్ర ప్రసాద్ సింగ్ 1,92,639 ఓట్లు సాధించి మూడో స్థానంలో నిలిచారు. 2019లో గిరిరాజ్ సింగ్ 4,22,217 ఓట్ల మెజారిటీతో గెలిచారు. ఆయనకు మొత్తం 6,92,193 ఓట్లు రాగా, సమీప ప్రత్యర్థి, సీపీఐ అభ్యర్థి కన్హయ కుమార్‌కు 2,69,976 ఓట్లు వచ్చాయి. ఆర్జేడీ అభ్యర్థి తన్వీర్ హసన్ 1,98,233 ఓట్లతో తృతీయ స్థానంలో నిలిచారు.

ఐదేళ్లుగా ఎంపీగా ఉండి బెగూసరాయ్‌కి గిరిరాజ్‌సింగ్ చేసిందేమీ లేదు. ఏయే దళారులకు ఆయన మేలు చేశారో జనానికి తెలిసిపోయింది. గిరిరాజ్ సింగ్ ఎన్నికల ప్రచారానికి వెళ్తున్న చోటల్లా జనం ఛీ కొడ్తున్నారు. 'మా బాధలకు కారకుడివి నువ్వే' అని నిలదీస్తున్నారు.

మండుతున్న ధరలకు తాళలేక జనం బతుకులు మాడిపోతున్నాయి. రైతులు అప్పుల బాధ భరించలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. వ్యవసాయ కార్మికులు, కూలినాలి చేసుకునే ఇతరులు వలస పోతున్నారు. యువత నిరుద్యోగంతో అల్లడిపోతున్నారు.

విద్యార్థులు నాసిరకం పాఠ్యప్రణాళికలు చూసి చీదరించుకుంటున్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలన్నీ ధ్వంసం కావడం, ఇతర మతాలవారిని చూస్తే అసహనం విపరీతంగా పెరిగిపోవడం వంటివి ప్రజలను విచలితుల్ని చేస్తోంది. అసలు సమస్యలను మరుగుపరిచి హిందూ-ముస్లింల సోదర భావాన్ని అంతం చేసి దేశాన్ని అల్లకల్లోలం చేయడాన్ని జనం ప్రశ్నించడం మొదలు పెట్టారు.

లాల్‌గఢ్‌లో 'కమలం' బెంబేలు

బెగూసరాయ్ ఎప్పుడూ వామపక్షాలకు బలమైన ప్రాంతంగా ఉంది. వామపక్ష ఆందోళనలు ముందుండి నడిపిన నేతలలో ఎక్కువ మంది భూమిహార్లే. 1967 సాధారణ ఎన్నికల్లో సీపీఐకి చెందిన యోగేంద్ర శర్మ ఇక్కడ గెలిచారు. ఆ తర్వాత అనేక ఎన్నికల్లో కూడా బెగూసరాయ్ నుంచి వామపక్ష అభ్యర్థులు విజయం సాధించారు. ఇక 1988, 1991లో, 2009 ఎన్నికలకు ముందు పునర్విభజనలో ముగిసిన బాలియా లోక్‌సభ స్థానం నుంచి సీపీఐ ఎంపీగా సూరజ్ నారాయణ్ సింగ్ ప్రాతినిథ్యం వహించారు. ఇక 1996లో సీపీఐకి చెందిన శత్రుఘ్న ప్రసాద్ సింగ్ విజయం సాధించారు. బెగూసరాయ్ లోక్‌సభ స్థానం నుంచి 1996లో పార్టీ ఎన్నికల చిహ్నం పొందిన రామేందర్ కుమార్ సాంకేతిక కారణాల వల్ల స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయాల్సి వచ్చింది. 2004 నుంచి గత ఎన్నికల వరకు ఇక్కడ ఎన్డీయే అభ్యర్థులు నెగ్గుతూ వస్తున్నారు. 2014లో గిరిరాజ్ సింగ్ బెగూసరాయ్ నుంచి పోటీ చేయాలనుకున్నారు కానీ ఆయనకు నవడా టికెట్ ఇచ్చారు. 2019లో పొత్తులో భాగంగా నవడా ఎల్జేడీకి కేటాయించక తప్పలేదు. దీంతో గిరిరాజ్‌సింగ్‌కు బెగూసరాయ్ టికెట్ దక్కింది. వర్గ సమీకరణలను దృష్టిలో పెట్టుకుంటే భూమిహార్‌లు బ్రాహ్మణులు, కాయస్థులు, కుర్మీ ఓట్లు ఇక్కడ కీలకం కానున్నాయి. గతంలో జరిగిన అనేక ఎన్నికల్లో వీరంతా వామపక్ష అభ్యర్థులకు జేజేలు పలికినవారే.

ప్రచారంలో దూసుకుపోతున్న అవధేశ్

ప్రచారానికి వెళ్లిన చోటల్లా ప్రజలు అవధేశ్‌కు బ్రహ్మరథం పట్టారు. కమ్యూనిస్టులు చేసిన అభివృద్ధిని, సేవను గుర్తుచేసుకుంటున్నారు. ఎమ్మెల్యేగా అవధేశ్ అందించిన సేవలు, సమస్యలపై అసెంబ్లీలో నిలదీసిన తీరును గుర్తుచేసుకుంటూ పార్లమెంట్‌కు ఆయనను గెలిపించి తీరుతామని హామీ ఇచ్చారు. సీపీఐ, ఆర్జేడీ, కాంగ్రెస్, వామపక్షాల శ్రేణులు మండుటెండను సైతం లెక్కచేయకుండా అవధేశ్ విజయం కోసం అహర్నిశలు శ్రమించారు. ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. అవధేశ్‌కు మద్దతుగా ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీల అగ్రనాయకులు విస్తృతంగా ప్రచారం చేశారు. రోడ్‌షోలు, ప్రదర్శనలు, బహిరంగ సభలు నిర్వహించారు.

భూ ఉద్యమంతో సీపీఐ ప్రస్థానం

భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) బీహార్ రాష్ట్ర శాఖ 1939లో ముంగేర్‌లోని సుధీర్ బోస్ నివాసంలో పురుడు పోసుకుంది. ఆ రోజుల్లో ముంగేర్ సబ్ డివిజన్‌గా ఉన్న బెగూసరాయ్ 1972లో జిల్లాగా మారింది. 1959, జనవరిలో బెగూసరాయ్‌లో కార్మికుల సమ్మెతో సీపీఐ విశేష ప్రజాదరణ పొందింది. గంగా నదిపై వంతెన నిర్మాణంలో ఏళ్ల తరబడి పని చేసిన 5,500 మంది స్థానికుల ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలనే డిమాండుతో 17 రోజులపాటు సమ్మె జరిపారు. ఎట్టకేలకు ప్రభుత్వం తలొగ్గింది. ఈ డిమాండు అమలుకు అంగీకరించింది. ఇలా సమ్మె విజయవంతంగా ముగిసింది. ఆ 5,500 మందికి ఉద్యోగాల క్రమబద్ధీకరణతో ఈ ప్రాంతానికి ఒక సంపన్నత చేకూరింది. ఈ విషయంలో సీపీఐ నేత చంద్రశేఖర్ సింగ్ కార్మికుల తరఫున అప్పటి రైల్వే మంత్రి బాబూ జగ్జీవన్ రామ్‌ను కలిసి సమస్యను పరిష్కరించడంలో విశేష కృషి సల్పారు. అప్పటి నుంచి ఈ ప్రాంతంలో సీపీఐ బలోపేతమైంది. మేధావులు, వృత్తి నిపుణులు, భూస్వాములు సైతం పార్టీలోకి వచ్చారు. బెగూసరాయ్ లెనిన్ గ్రాడ్ లేదా జూనియర్ మాస్కోగా అవతరించింది. భూసంస్కరణల ఉద్యమంతో సీపీఐ ప్రజాదరణ పొందింది. 1952లో భూస్వాములకు వ్యతిరేకంగా భూమి సుదార్ ఆందోళన ప్రారంభమైంది. కమ్యూనిస్టులు ఈ ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లారు. శక్తివంతమైన భూస్వాములకు వ్యతిరేకంగా భూమి లేని పేదలకు న్యాయం చేసేందుకు అనేక పోరాటాలు సాగించారు. భూమి పంపిణీలో కీలకపాత్ర పోషించడంతో చంద్రశేఖర్ సింగ్ పేదలకు హీరోగా మారారు. భూస్వాముల అణచివేతకు వ్యతిరేకంగా పేదల సంరక్షకుడిగా ఆయనను ప్రజలు చూశారు. దీంతో సహజంగానే స్థానికులంతా కమ్యూనిస్టు పార్టీని తమ పార్టీగా ఎంచుకున్నారు. 1960 ఆరంభంలో బరౌనీ రిఫైనరీలో కార్మికుల పని పరిస్థితులు, వేతనాలను మెరుగుపర్చాలని కమ్యూనిస్టులు ఉద్యమాన్ని ప్రారంభించారు. ఈ ఉద్యమం సందర్భంగా చంద్రశేఖర్ సింగ్ ఉద్వేగపూరిత ప్రసంగం చేశారు. ఇదే సమయంలో పోలీసులకు, కార్మికులకు మధ్య ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. దీంతో పోలీసులు కార్మికులపై లాఠీఛార్జి చేశారు. అనంతరం జరిగిన పోలీసు కాల్పుల్లో 12 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోగా, అనేక మంది గాయపడ్డారు. చంద్రశేఖర్ సింగ్ తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. ఇక 1969 భూసేకరణ ఉద్యమంలో దళితులకు పునరావాసం కల్పించేందుకు సీపీఐ, సీపీఎం కలిసి పోరాడాయి. ఈ ప్రాంతంలో వామపక్ష పార్టీలు బలోపేతం కావడానికి ఆ ఉద్యమాలు దోహదపడ్డాయి. ఇలా దశాబ్దాలుగా ఉద్యమాల్లో బెగూసరాయ్‌తో సీపీఐ పెనవేసుకుపోయింది.

బీహార్‌లో హోరాహోరీ

సీనియర్లకు ప్రతిష్ఠాత్మకం

5 లోక్‌సభ స్థానాలకు 13న పోలింగ్

యూపీ, పశ్చిమబెంగాల్ మాదిరే బీహార్‌లోనూ లోక్‌సభ ఎన్నికలు మొత్తం ఏడు దశల్లోనూ జరుగుతున్నాయి. బీజేపీ, జేడీ(యూ), లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్)తో కూడిన ఎన్‌డీఏ కూటమి, కాంగ్రెస్, ఆర్జేడీ, వామపక్షాలతో కూడిన ఇండియా కూటమి ఈ ఎన్నికలలో హోరాహోరీ తలపడుతున్నాయి. 40 స్థానాలకు తొలి మూడు విడతల్లో 14 చోట్ల పోలింగ్ ముగిసింది. సీనియర్ నేతలకు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా మారిన నాలుగో విడత పోలింగ్ ఈ నెల 13వ తేదీన జరగనుంది. అయిదు లోక్‌సభ నియోజకవర్గాలకు జరగనున్న ఈ ఎన్నికల్లో ఏడుగురు సీనియర్ నేతలు ప్రత్యక్షంగా, పరోక్షంగా భవితవ్యాన్ని పరీక్షించుకుంటున్నారు. అయిదు చోట్ల మొత్తం 55 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు.

ఎన్నికలు ప్రతిష్ఠాత్మకంగా మారిన వారిలో ఇద్దరు కేంద్ర మంత్రులు, ఇద్దరు రాష్ట్ర మంత్రులు ఉన్నారు. అయితే ఇందులో ఒక రాష్ట్ర మంత్రి తన కుమారుడికి వ్యతిరేకంగా ప్రచారం చేయాల్సి రావడం గమనార్హం. గత మూడు విడతల పోలింగ్‌లో అత్యల్ప ఓటింగ్ నమోదు కావడంతో ఓటింగ్ శాతం పెంచేందుకు నేతలు మరింత కష్టపడుతున్నారు. ప్రజలను పోలింగ్ బూత్‌లకు తీసుకొచ్చి ఓటేయించుకోవాలని ప్రయత్నిస్తున్నారు. నాలుగో దశలో దర్భంగా, ఉజియార్‌పూర్, సమస్తిపూర్, బెగూసరాయ్, ముంగేర్ లోక్‌సభ స్థానాల్లో పోలింగ్ జరగనుంది. వీటిలో 2019 ఎన్నికల్లో బీజేపీ మూడు, ఎల్‌జేపీ, జేడీ(యూ) ఒక్కో చోట గెలిచాయి. ఈసారి ఆర్జేడీ అధినేత లాలు ప్రసాద్ అనారోగ్య సమస్యలను పక్కన పెట్టి మరీ ప్రచారం చేస్తున్నారు. ఈ విడతలో ఇద్దరు కేంద్ర మంత్రుల భవిష్యత్‌ను ఓటర్లు తేల్చనున్నారు.

ఫిరాయింపు నేతలే ఎక్కువ

నాల్గో దశలో 50 మంది పోటీ

ఎన్డీయేలోనే 52శాతం : తెలుగు రాష్ట్రాల్లోనే అధికం

భారత్‌లో సార్వత్రిక ఎన్నికలు దశలవారీగా కొనసాగుతున్నాయి. ఇదే క్రమంలో ఫిరాయింపులు కూడా జోరుగా ఉన్నాయి. ఈనెల 13న 96 లోక్‌సభ నియోజకవర్గాలకు ఎన్నికలు జరగబోతున్నాయి. నాల్గో దశలో పోటీ చేస్తున్న అభ్యర్థుల్లో 50 మంది ఫిరాయింపు నేతలే ఉండటం ఓ రికార్డు. వీరిలో 26 మంది (52శాతం) ఎన్డీయే తరపున బరిలో ఉన్నారు. ఆయా రామ్, గయా రామ్ రాజకీయాలు తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో జోరుగా ఉన్నాయి. ఎన్డీయే తరపున తెలంగాణలోని 17 స్థానాల్లో 11 మంది ఫిరాయింపు నేతలు పోటీ చేస్తుండగా, ఆంధ్రప్రదేశ్‌లోని 25 మంది అభ్యర్థుల్లో ఎనిమిది మంది కండువాలు మార్చిన వారే ఉన్నారు. ఇండియా కూటమి తరపున 14 మంది ఫిరాయింపు నేతలను కాంగ్రెస్ నిలబెట్టింది. వైసీపీ నుంచి ఐదుగురు, బీఆర్ఎస్ నుంచి నలుగురు బరిలో ఉన్నారు. మొత్తంగా తెలంగాణలో 20 మంది, ఏపీలో 13 చొప్పున ఫిరాయింపు నేతలు పోటీ చేస్తున్నారు. తెలంగాణలోని మల్కాజ్‌గిరి, వరంగల్, చేవెళ్ల స్థానాల్లో ఇండియా కూటమి, ఎన్డీయే తరపున ఫిరాయింపు నేతలే పోటీలో ఉన్నారు.

దక్షిణాన బీజేపీ గేట్‌వేగా భావించే తెలంగాణ నుంచి 2019 ఎన్నికల్లో ఒక్క సీటును కూడా బీజేపీ గెలుచుకోలేదు. పార్టీకి చెందిన సీనియర్లు ఆరుగురు మాత్రం లోక్‌సభకు ఎన్నిక కాగలిగారు. మొత్తం 17 లోక్‌సభ స్థానాల్లో 11 మంది ఫిరాయింపు నేతలను బీజేపీ నిలబెట్టింది. వీరిలో ఏడుగురు బీఆర్ఎస్ నుంచి, నలుగురు కాంగ్రెస్ నుంచి వచ్చి కాషాయ కండువా కప్పుకున్నారు. ఇండియా కూటమి తరపున తెలంగాణలో ఐదుగురు ఫిరాయింపు నేతలు పోటీ చేస్తున్నారు. ఎన్నికలకు కొద్ది వారాల కిందట వీరంతా బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. అటు బీఆర్ఎస్ నుంచి పోటీ చేస్తున్న వారిలోనూ నలుగురు కండువాలు మార్చిన వారే కాగా అందులో ఇద్దరు సార్వత్రిక ఎన్నికలకు ముందు గులాబీ కండువా కప్పుకున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ, జనసేనతో కలిసి బీజేపీ పోటీ చేస్తోంది. ఎన్డీయే కూటమిగా ఏర్పాటైంది. ఈ కూటమి అభ్యర్థుల్లో ఎనిమిది మంది ఫిరాయింపు నేతలు కాగా వీరిలో ఐదుగురు వైసీపీ నుంచి వచ్చారు. బీజేపీ నుంచి టికెట్ ఆశించి భంగపడ్డ టి.కృష్ణ ప్రసాద్ ఆ పార్టీని వీడారు కానీ ఎన్డీయే బలపర్చిన టీడీపీ అభ్యర్థిగా బాపట్ల నుంచి పోటీ చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే బలపర్చిన ఎనిమిది మంది ఫిరాయింపు నేతల్లో ఆరుగురు ఎన్నికలకు కొన్ని నెలలు, వారాల ముందు కాషాయ గూటికి చేరుకున్నారు. వైసీపీ తరపున పోటీ చేస్తున్న ఐదుగురు ఫిరాయింపు నేతల్లో నలుగురు ఈ ఏడాదిలోనే చేరారు. ఇండియా కూటమి అభ్యర్థుల్లో ఫిరాయింపు నేతలు లేరు.

దక్షిణ రాష్ట్రాలకు పూర్తి భిన్నంగా ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ నుంచి ఈ సారి పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థుల్లో ఫిరాయింపు నేతలెవ్వరూ లేరు. ఇండియా కూటమి తరపున బరిలో నిలిచిన నలుగురు ఫిరాయింపు నేతల్లో ఇద్దరు బీఎస్పీ, మరో ఇద్దరు బీజేపీ నుంచి హస్తం గూటికి చేరుకున్న వారున్నారు. మధ్యప్రదేశ్‌లో ఇండియా కూటమి అభ్యర్థుల్లో ఫిరాయింపు నేతలెవ్వరూ లేరు. అక్షయ్‌బమ్ తన నామినేషన్ రద్దు చేసుకొని బీజేపీలో చేరడం తెలిసిందే.

మహారాష్ట్రలో ఎన్డీయే, ఇండియా కూటమి తరపున చెరో ముగ్గురు ఫిరాయింపు నేతలు పోటీ చేస్తున్నారు. వీరంతా ఎన్సీపీ, శివసేన నుంచి వచ్చిన వారు. ఒడిశాలోని నాలుగు స్థానాల్లో బీజేపీ తరపున పోటీ చేసే అభ్యర్థుల్లో ముగ్గురు బీజేపీ నుంచి పార్టీ ఫిరాయించిన వారున్నారు. ఇండియా కూటమి అభ్యర్థుల్లో ఫిరాయింపు నేతలెవ్వరూ లేరు. బీజేపీ ఒడిశా శాఖ మాజీ ఉపాధ్యక్షుడు భ్రుగ్గు బక్సిపత్రాను బెర్హంపూర్ నుంచి బీజేడీ నిలబెట్టింది. ఈ స్థానం నుంచి బీజేపీ తరపున ప్రదీప్ కుమార్ పణిగ్రాహి (బీజేపీ మాజీ మంత్రి) పోటీ చేస్తున్నారు. ఈయనపై మొత్తం తొమ్మిది కేసులు ఉన్నాయి. వీటిలో రెండు పీఎంఎల్‌ఏ చట్టం కింద నమోదయ్యాయి. అవినీతి నిరోధక చట్టం, ఐటీ చట్టం కింద ఆరోపణలు కూడా నమోదయ్యాయి. అయితే ఆయనకు ఏ కేసులోనూ శిక్ష పడలేదు.

పిల్లల కోసం తండ్రుల ప్రచారం

లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఉత్తరప్రదేశ్‌లో ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకొన్నాయి. రాష్ట్రంలోని అనేక మంది సీనియర్ నేతలు తాము ఎన్నికల బరిలోకి దిగకుండా, తమ పిల్లలకు అవకాశం కల్పించారు. ఈ జాబితాలో సమాజ్‌వాదీ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ రామ్ గోపాల్ యాదవ్, జాతీయ ప్రధాన కార్యదర్శి శివపాల్ యాదవ్, సుభా ఎస్‌పీ అధ్యక్షుడు ఓం ప్రకాష్ రాజ్‌భర్, నిషాద్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ సంజయ్ నిషాద్, కాంగ్రెస్ నాయకుడు పీఎల్ పునియా, ఇంద్రజిత్ సరోజ్, బ్రజ్‌భూషణ్ శరణ్ సింగ్ తదితరులు ఉన్నారు. ఫిరోజాబాద్ లోక్‌సభ స్థానం నుంచి సమాజ్ వాదీ పార్టీ నేత ప్రొఫెసర్ రామ్ గోపాల్ యాదవ్ కుమారుడు అక్షయ్ యాదవ్ పోటీలో నిలిచారు. తన కుమారుని విజయం కోసం రామ్ గోపాల్ యాదవ్ శ్రమిస్తున్నారు. శివపాల్ యాదవ్ కుమారుడు ఆదిత్య యాదవ్ బదౌన్ నుంచి ఎన్నికల బరిలోకి దిగారు. బదౌన్‌లో మూడో దశలో ఎన్నికలు జరిగాయి. శివపాల్ తన కుమారుని విజయం కోసం ప్రచార కార్యక్రమాల్లో విరివిగా పాల్గొన్నారు.

సంత్ కబీర్ నగర్ లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా ప్రవీణ్ నిషాద్ ఎన్నికల బరిలోకి దిగారు. ఆయన విజయం కోసం ఆయన తండ్రి, యోగి ప్రభుత్వంలో మంత్రి, నిషాద్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ సంజయ్ నిషాద్ తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఇక్కడ మే 25న ఓటింగ్ జరగనుంది.

భారత రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్ ఇటీవ అనేక ఆరోపణల్లో చిక్కుకున్నారు. దానితో బీజేపీ ఆయనకు టికెట్ నిరాకరించి కైసర్‌గంజ్ లోక్‌సభ స్థానం నుంచి ఆయన కుమారుడు కరణ్ భూషణ్ సింగ్ బీజేపీ తరపున ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. ఓం ప్రకాష్ రాజ్‌భర్ ఎన్డీఏలో భాగస్వామిగా ఉన్నారు. ఆయన కుమారుడు అరవింద్ రాజ్‌భర్ ఘోసీ లోక్‌సభ స్థానం నుంచి పోటీకి దిగారు. ఓం ప్రకాష్ రాజ్‌భర్ తన కుమారుని విజయం కోసం ప్రయత్నిస్తున్నారు. బారాబంకి లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ సీనియర్ నేత పీఎల్ పునియా కుమారుడు తనూజ్ పునియా ఎన్నికల బరిలోకి దిగారు. ఎస్పీ-కాంగ్రెస్ కూటమి కింద తనూజ్ ఈ స్థానం నుంచి పోటీ చేస్తున్నారు.

వాడవాడలా విమల ప్రచారం

- ఓటర్ల ఆదరణ
- ప్రదర్శనలు, బైక్ ర్యాలీల హోరు

విశాఖపట్నం పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గ సీపీఐ అభ్యర్థి అత్తిలి విమల ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఆమె ప్రచారానికి అన్ని వర్గాల ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. ధన రాజకీయాలను ఓడిద్దాం, శ్రామిక జన రాజకీయాల్ని గెలిపిద్దాం... నినాదంతో విమల చేసిన ప్రచారం ప్రజల ఆదరాభిమానాలను చూరగొంది. ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ, కార్మికుల హక్కులు కాపాడడం, ప్రజా సమస్యల పరిష్కారంలో ముందు ఉండడం, బీజేపీ మతతత్వ రాజకీయాలు.. తదితర అంశాలు ప్రధానంగా సీపీఐ అభ్యర్థి ప్రచారం సాగింది. గత నెల 20వ తేదీన భారీ ప్రదర్శనతో నామినేషన్ దాఖలు చేయడం మొదలుకొని నియోజకవర్గంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. పార్టీ, ప్రజాసంఘాలు, ఇండియా కూటమి పార్టీల సభ్యులు బృందాలుగా ఏర్పడి నియోజకవర్గంలో వాడవాడల విమలను గెలిపించాలని కోరుతూ విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ,

కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి, రాష్ట్ర సమితి సభ్యులు సీహెచ్ రాఘవేంద్రరావు, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. ఓబులేసు తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రచారం నిర్వహించారు. ఏపీ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో బాజీ జంక్షన్ నుంచి గోపాలపట్నం పెట్రోల్ బంక్ వరకు నిర్వహించిన భారీ మహిళా ప్రదర్శనలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి దుర్గాభవాని పాల్గొన్నారు. పారిశ్రామిక ప్రాంతలో రెండుసార్లు, కంచరపాలెం, గోపాలపట్నం ప్రాంతాల్లో ఒక సారి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. నియోజకవర్గంలో ప్రతీ ఇంటికి కరపత్రాలు పంచుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించడంతో పాటు ఆ పార్టీకి వంత పాడుతున్న రాష్ట్రంలోని అధికార వైసీపీ, ప్రతిపక్ష తెలుగుదేశం, జనసేన పార్టీల వైఖరిని ఎండగట్టారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ని ప్రైవేటీకరించేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను విమర్శిస్తూ దానిపై గట్టిగా నిలదీయని వైసీపీ, తెలుగుదేశం, జనసేన పార్టీల విధానాలను ప్రశ్నించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ మతతత్వ విధానాలను ప్రశ్నించడంతోపాటు గత పదేళ్లలో ధరల పెరుగుదల సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలను వివరించటం, ఎన్నికల్లో బీజేపీ ఇచ్చిన హామీలు... ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు, నల్లధనాన్ని వెనక్కి తేవడం, ధరల నియంత్రణ తదితర అంశాలను ప్రచారంలో ప్రస్తావించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చిన అంశాన్ని ప్రచారంలో ప్రస్తావించారు. బీజేపీ మరోసారి అధికారంలోకి వస్తే దేశ లౌకికత్వానికి, సౌభ్రాతృత్వానికి, రాజ్యాంగానికి ఏర్పడబోయే ముప్పు గురించి హెచ్చరించారు. విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో సీపీఐ ప్రచారం కోసం పార్టీ శ్రేణులు విరాళాలు అందజేశారు. నియోజకవర్గంలో సీపీఐ అభ్యర్థి అత్తిలి విమల ప్రచారాన్ని పలువురు స్వాగతించారు. అనేక ప్రాంతాల్లో మహిళలు హారతులు పట్టారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం పైడిరాజు, కార్యవర్గ సభ్యులు కె.సత్యాంజనేయ, జి.రాంబాబు, కసిరెడ్డి సత్యనారాయణ, ఎస్ కె రెహమాన్, జి ఎస్ జె అచ్యుతరావు, ఎం.మన్మధరావు, పి. చంద్రశేఖర్, సి ఎస్ క్షేత్రపాల్ తదితరులు మూడు దళాలుగా గోపాలపట్నం, పారిశ్రామిక ప్రాంతం, కంచరపాలెం ఏరియాలుగా మొత్తం నియోజకవర్గంలో ప్రచారం విస్తృతంగా నిర్వహిస్తున్నారు. నియోజకవర్గ సమస్యలపై కరపత్రాన్ని ముద్రించి పరిష్కారానికి కృషి చేస్తామని సీపీఐ పేర్కొంది. ఆ పత్రాన్ని ఓటర్లకు పంపిణీ చేశారు. ప్రజా వాణి అసెంబ్లీలో వినిపించేందుకు విమలను గెలిపిస్తామని ఓటర్లు హామీ ఇచ్చారు.

- విశాలాంధ్ర - విశాఖ

రాజంపేట

కమ్యూనిస్టుల కోట

- సీపీఐ అభ్యర్థి నాయక్‌కు అడుగడుగునా నీరాజనాలు
- ఎర్ర జెండాకు పెరిగిన ఆదరణ
- మార్మోగిన 'కంకి కొడవలికి ఓటుతోనే రాజంపేట అభివృద్ధి' నినాదం

ఆంధ్రప్రదేశ్, అన్నమయ్య జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గం రాజంపేట... కమ్యూనిస్టుల కంచుకోట. రాష్ట్ర రాజకీయాలనే శాసించగల స్థానం. ఈ నియోజకవర్గంలో ఎర్రజెండాకు ప్రజాదరణ పెరిగింది. 'కంకి కొడవలికి ఓటెయ్యండి... రాజంపేట అభివృద్ధికి తోడ్పడండి' నినాదంతో భారత కూమ్యునిస్టు పార్టీ (సీపీఐ) అభ్యర్థి బుక్కే విశ్వనాథ్ నాయక్ ప్రచారం జోరుగా సాగింది. ఎక్కడ ప్రచారానికి వెళ్లినా ఆయనకు జనం నీరాజనాలు పలికారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగడుతూ... ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న కమ్యూనిస్టు పార్టీకి రాజంపేటలో అమితాదరణ లభించింది. ఇండియా కూటమి బలపర్చిన అభ్యర్థిగా గిరిజన బిడ్డ విశ్వనాథ్ నాయక్ ఇంటింటి ప్రచారం హుషారుగా సాగింది. విశ్వనాథ్ నాయక్ విజయం కోసం సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ శ్రేణులు పెద్దఎత్తున ప్రచార ర్యాలీల్లో పాల్గొన్నారు. డప్పు కళాకారులు... కార్యకర్తల్లో నూతనోత్సాహం నింపారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య అధ్వర్యంలో ప్రచారం ఉవ్వెత్తున సాగింది. మండుటెండను, వడగాడ్పులను సైతం లెక్కచేయకుండా సీపీఐ, ప్రజా సంఘాల నాయకులు ప్రచారాన్ని నిర్వహించారు. చట్టసభల్లో కమ్యూనిస్టులు ఉంటే ప్రజా సమస్యలపై ప్రభుత్వాలను నిలదీస్తారనీ, అందుకే ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే వారిని గెలిపించాలని ఓటర్లను చైతన్యపరిచారు. బీజేపీ, వైసీపీ, టీడీపీ పాలనా వైఫల్యాలను ప్రజలకు వివరించారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి విశ్వనాథ నాయక్ చేసిన కృషిని

కళ్లకుకట్టారు. రాష్ట్రంలో ఎన్నికల ప్రచారం శనివారంతో ముగిసింది. చివరి రోజు ప్రచారంలో ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీల నాయకులు, కార్యకర్తలు వెంట నడవగా ఇంటింటికి వెళ్లి ప్రతి ఓటరును కలిసి వారి సమస్యలు తెలుసుకొని, వాటి పరిష్కారానికి అభ్యర్థి విశ్వనాథ్ నాయక్ హామీచ్చారు. ప్రచారంలో భాగంగా ఆయన ప్రతి వీధికి వెళ్లి ఓటర్లను కలిశారు. ఆయన ప్రచారానికి విశేష స్పందన లబించింది. స్థానికులు ఎదురేగి స్వాగతం పలికి... ప్రచారంలో పాల్గొన్నారు. గతంలో కమ్యూనిస్టు పార్టీ ప్రజాప్రతినిధులు అందించిన సేవలను గుర్తుచేసుకుని మళ్లీ కమ్యూనిస్టులు రావాలని కోరుకున్నారు. ఈనెల 13న జరిగే అసెంబ్లీ, లోక్‌సభ స్థానాల్లో ఇండియా కూటమి అభ్యర్థులను తప్పకుండా గెలిపిస్తామని ప్రజలు హామీ ఇచ్చారు.

గతంలో టీడీపీ, ప్రస్తుత వైసీపీ హయాంలో రాజంపేట అభివృద్ధిని పాలకులు గాలికి వదిలేశారని, అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయి మూడేళ్లు అవుతున్నా పునర్ నిర్మాణం ఊసే లేదని... జల ప్రళయంలో కొట్టుకుపోయిన 39 మంది కుటుంబాలను ఆదుకోవడం లోనూ రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని నాయక్ అన్నారు. రాజంపేటను జిల్లా కేంద్రంగా ప్రకటించకపోవడంతో ప్రభుత్వంపై వ్యతిరేకత పెరిగిందన్నారు. రాజంపేటకు కేటాయించిన వైద్య కళాశాలను మంజూరు చేయకపోవడానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే ప్రధాన కారణమని అభిప్రాయపడ్డారు. మతచిచ్చుపెట్టే మతోన్మాద బీజేపీకి అవకాశం ఇవ్వరని, ప్రజా సమస్యలను చట్టసభల్లో వినిపించే కమ్యూనిస్టులను గెలిపించాలని విశ్వనాథ్ నాయక్ పిలుపునిచ్చారు. కులాల మధ్య చిచ్చుపెట్టి ఓట్లు పొందాలని యత్నిస్తున్న బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి అభ్యర్థులను ఓడించాలని కోరారు. నియోజకవర్గ ప్రజలు చైతన్యవంతులై...ఆయా కుట్రలను ఎండగడతారని విశ్వనాథ్ నాయక్ ఆకాంక్షించారు. స్థానికుడిని కాబట్టి ఇక్కడి ప్రజల సమస్యలపై పూర్తి అవగాహన ఉందన్నారు. తాను గెలిస్తే స్థానిక సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యత ఇస్తానన్నారు. ఎన్నికల్లో పోటీ చేయడానికి కోట్ల రూపాయలు అక్కర్లేదని... ప్రజల మద్దతు ఉంటే చాలని... అదే కమ్యూనిస్టుల బలమని నొక్కిచెప్పారు. 1952లోనే ఇక్కడి జనం కమ్యూనిస్టులకు పట్టం కట్టిన విషయాన్ని గుర్తుచేశారు. తనను గెలిపిస్తే రాజంపేటను అభివృద్ధి పథంలో దూసుకుపోయేలా చేస్తానని హామీనిచ్చారు. ప్రజలకు పన్నుల భారం, వివక్ష లేని పారదర్శక పాలన కావాలంటే ఇండియా కూటమిని గెలిపించాలని సీపీఐ నాయకులు పిలుపునిచ్చారు.

- విశాలాంధ్ర-రాజంపేట

ఎర్రజెండాకు జననీరాజనం

- కమలాపురంలో గాలి చంద్రకు ప్రజాదరణ
- రోడ్ షోలు, బహిరంగ సభలు
- వినూత్న ప్రచారాలతో ప్రజలకు చేరువ

కమలాపురం ఒకప్పుడు కమ్యూనిస్టుల ఖిల్లా. దేశ స్వాతంత్ర్యానంతరం జరిగిన మొదటి సార్వత్రిక ఎన్నికలలో కమలాపురం నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా ఎస్ శివరామిరెడ్డి గెలిచి ఎర్రజెండా ఎగరవేశారు. జరగబోయే సార్వత్రిక ఎన్నికలలో ఇండియా కూటమి తరపున సీపీఐ అభ్యర్థిగా ప్రస్తుతం బరిలో దిగిన గాలి చంద్ర అదే స్థాయిలో విజయకేతనం ఎగరవేస్తారని నియోజకవర్గంలో ఆయన ప్రచారానికి వస్తున్న స్పందనను బట్టి సీపీఐ శ్రేణులు భావిస్తున్నారు. నియోజకవర్గంలో చంద్రకు రోజు రోజుకు ప్రజాదరణ పెరిగింది. చంద్రను గెలిపించాలని కోరుతూ ఇండియా కూటమి శ్రేణులు నియోజకవర్గంలో విస్తృతంగా ప్రచారం చేశారు. నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాల్లో సీపీఐ శ్రేణులు కరపత్రాల పంపిణీ, ఆటోప్రచారం, ప్రజానాట్యమండలి కళాకారు లు డప్పులతో ప్రజా సమస్యలను పాటలు, నృత్య, వీధి నాటకాల రూపంలో వినూత్న ప్రచారంతో ప్రజలను, ఓటర్లను ఆకట్టుకున్నారు. రోజు క్రమం తప్పకుండా మండుటెండను సైతం లెక్క చేయకుండా ఉదయం, సాయంత్రం ఊరూ వాడలలోని ప్రతి ఇంటిగడప తడుతూ సీపీఐ అభ్యర్థి చంద్రను గెలిపించాలని కోరారు. సీపీఐతో పాటు కాంగ్రెస్, సీపీఎం శ్రేణులు సీపీఐ అభ్యర్థి చంద్రకు కంకి-కొడవలి గుర్తుకు కులాలకు, మతాలకు, వర్గాలకు అతీతంగా ఓటు వేసి, వేయించి అఖండ మెజారిటీతో గెలిపించాలని ప్రచారం చేశారు. ప్రతి చోటా వీరి ప్రచారానికి ప్రజలు, ఓటర్ల నుంచి విశేష స్పందన లభించింది. గతంలో సీపీఐ ప్రజాప్రతినిధులు చేసిన సేవలను గుర్తు చేసుకొంటున్న ప్రజలు ఇప్పుడు తిరిగి సీపీఐ రావాలని కోరుకొంటున్నారు.ప్రజా సమస్యలను చట్ట సభలలో ప్రజాగొంతుకగా వినిపించాలంటే సీపీఐ అభ్యర్థులను అసెంబ్లీకి పంపాలని కళాకారులు పాటల రూపంలో ప్రజలకు వినిపించి ఓటర్లను ఆకట్టుకున్నారు.

అగ్రనేతల ప్రచార హోరు

పీసీసీ అధ్యక్షులు వైఎస్ షర్మిల, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఓబులేసు, ఈశ్వరయ్యలు రోడ్‌షో, బహిరంగసభలు, ఇంటింటి ప్రచారాలతో చంద్రను గెలిపించాలని విస్తృత ప్రచారం నిర్వహించారు. జిల్లాలో ప్రముఖ సీపీఐ నాయకులు ఎక్కువమంది కమలాపురం నియోజకవర్గానికి చెందిన వారు కావడం సీపీఐకి కలిసి వచ్చిందని చెప్పవచ్చు. ఈ ఎన్నికల్లో సీపీఐ శ్రేణుల ప్రచార సరళిని రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఓబులేసు దగ్గరుండి కార్యకర్తలకు సూచనలు, సలహాలు ఇస్తూ నిరంతరం పర్యవేక్షిస్తూ ముందుకునడిపిస్తున్నారు. ఇక్కడ కార్మిక నాయకుడిగా ఎక్కువ కాలం పనిచేసిన అనుభవం ఓబులేసుకు ఉంది.అనేక కార్మిక ఉద్యమాలను ఓబులేసు నడపడంతో కమలాపురం నియోజక వర్గంలోని అన్ని పార్టీల

నాయకులతో, ప్రజలతో సన్నిహిత సంబంధాలున్నాయి. ఈ అవకాశాలను ఓబులేసు సీపీఐ గెలుపు వైపు నడిపిస్తున్నారు. దీనికి తోడు సీపీఐ నియోజకవర్గంలో పేదల పక్షాన అణగారిన వర్గాల పక్షాన నిలబడి అనేక పోరాటాలు చేసింది. దున్నేవాడిదే భూమి అని భూ పోరాటాలు చేశారు. స్వాతంత్ర్యం కోసం వీరోచిత పోరాటాలు చేసి అనేకమంది ప్రాణ త్యాగాలు చేసిన ఘనమైన చరిత్ర సీపీఐకి ఉన్నది. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ అవినీతి అక్రమాలకు భూకబ్జాలు దోపిడీ దౌర్జన్యాలు విపరీతంగా పెరిగిపోయాయి ఇటువంటి తరుణంలో నియోజకవర్గంలోని అధికార పార్టీ నాయకులే కాకుండా అధికారం లేకపోయినా భూకబ్జాలు దోపిడీలు దౌర్జన్యాలు చేస్తున్న నాయకులు ఎన్నికల బరిలో ఉన్నారు వారి అరాచకాలు దోపిడీలు దౌర్జన్యాలను ఇంకా భరించే పరిస్థితిలో నియోజకవర్గ ప్రజలు లేరు.ప్రత్యామ్నాయం కోసం ఎదురుచూస్తున్న తరుణంలో ఇండియా కూటమి నుండి సీపీఐ బరిలో నిలవడంతో ప్రజలు సీపీఐ అభ్యర్థికి ఓటు వేయాలన్న ఆలోచన ఓటర్లు చేస్తున్నారు. నియోజకవర్గంలో అన్ని గ్రామాలతో చంద్ర మంచి సంబంధాలు కలిగి ఉన్నారు. సీపీఐ కమలాపురం నియోజకవర్గం నుంచి పోటీ చేయడం అందులోనూ వివాద రహితుడు గాలి చంద్ర పోటీ చేయటం ఆ పార్టీకి కలిసొచ్చే అంశం.

వైసీపీ అరాచక పాలనను అంతమొందించాలి

రాజంపేట 'ఇండియా' అభ్యర్థులను గెలిపించాలి

సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ

విశాలాంధ్ర-రాజంపేట : ప్రజా దర్బార్ కూల్చివేతతో మొదలైన జగన్‌మోహన్ రెడ్డి విధ్వంసక పాలన అవినీతి, అరాచకాలతో సాగిందని, వైసీపీ అరాచక, దౌర్జన్య పాలనను అంతమొందించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ పిలుపునిచ్చారు. శనివారం రాజంపేటలోని ఏఐటీయూసీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డితో తనకు 1970 నుంచి ఆత్మీయ పరిచయం ఉందని, ఆయనలోని ఒక్క సుగుణం కూడా తనయుడు జగన్‌మోహన్ రెడ్డికి రాలేదని విమర్శించారు. వైసీపీ ఐదేళ్ల పాలన భూ మాఫియా, ఇసుక, మద్యం, మైనింగ్ మాఫియాలతో సాగిందన్నారు. జగన్‌మోహన్ రెడ్డి కేంద్రంలోని బీజేపీ వద్ద మోకరిల్లి ప్రత్యేక హోదాతో పాటు రాష్ట్ర అభివృద్ధిని అటకెక్కించారని విమర్శించారు. రాజంపేటలో వైసీపీ నాయకుల ఇసుక అక్రమ రవాణా కారణంగా అన్నమయ్య ప్రాజెక్టు పూర్తిగా కొట్టుకుపోయిందన్నారు. జగన్ తల్లి, చెల్లి, బాబాయిలను మోసగించి తాను అమాయకుడునని చెప్పుకుంటున్నారని అన్నారు. కిరణ్ కుమార్ రెడ్డి తన ముఖ్యమంత్రి పదవీ కాలంలో కాంగ్రెస్ పార్టీని అధః పాతాళానికి నెట్టేశారని విమర్శించారు. ప్రపంచ శాంతి సంఘం నుంచి కడపకు గతంలో అవార్డు దక్కిందని, అటువంటి ఉమ్మడి జిల్లాలో రాజంపేట నుంచి మొట్టమొదటి శాసన సభ్యుడిగా సీపీఐకి చెందిన పంజం నరసింహారెడ్డితో సీపీఐ ప్రస్థానం ఘనంగా సాగిందని గుర్తు చేశారు. నేడు అదే సీపీఐ నుంచి ఇండియా కూటమి అసెంబ్లీ అభ్యర్థిగా బుక్కే విశ్వనాథ నాయక్ బరిలో నిలిచారని, ఉత్సాహవంతుడు, యువకుడు, మరీ ముఖ్యంగా శ్రామిక వర్గం నుంచి వచ్చిన నాయకుడు అయినందున పేద ప్రజల గళం చట్ట సభలలో వినిపిస్తాడని తెలిపారు. సీపీఐ ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వనాథ నాయక్, కాంగ్రెస్ పార్లమెంటు అభ్యర్థి బషీద్‌ను నియోజకవర్గ ప్రజలు ఆదరించి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి పి.ఎల్.నరసింహులు, సహాయ కార్యదర్శి మహేష్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు చిట్వేలి రవికుమార్, నియోజకవర్గ కార్యదర్శి ఎం.ఎస్.రాయుడు, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి సికిందర్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ అభ్యర్థుల విజయానికి విరాళాలు

విశాలాంధ్ర-మచిలీపట్నం: శ్రమజీవుల సమస్యలు శాసనసభలో లేవనెత్తి, ప్రజావాణి వినిపించే సీపీఐ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ కృష్ణాజిల్లా మచిలీపట్నం నుంచి రెండో విడతగా 16 వేల 200 రూపాయలు సీపీఐ రాష్ట్ర కేంద్రానికి అందజేశారు. సీపీఐ నగర నాయకులు మోదుమూడి అరుణకుమారి, ఎర్రంశెట్టి ఈశ్వరరావు, కె.గగన్ ఈ మొత్తాన్ని సేకరించారు. కే కుమారి, డి పద్మ, పి పావని 5 వేల రూపాయల చొప్పున, హనుమంతయ్య, అబ్దుల్ మున్నా 500 రూపాయల చొప్పున, కె. లక్ష్మణరావు, వి శ్రీనివాసరావు 100 రూపాయలు చొప్పున విరాళంగా అందజేశారు.

సీపీఐ భారీ ర్యాలీ

అనంత వీధుల్లో రెపరెపలాడిన ఎర్రజెండా

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం: కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వ విధ్వంసక, మతోన్మాద పాలనను నిరసిస్తూ అనంతపురంలో శనివారం భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) అధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించాయి. ఎన్‌డీఏ ప్రభుత్వానికి బాయ్... బాయ్ అంటూ... ఆయా పార్టీల కార్యకర్తలు అనంత నగర వీధుల్లో నినాదాలతో హోరెత్తించారు. ఈ భారీ ర్యాలీ దాదాపు 20 కిలోమీటర్లు సాగింది. ముఖ్య అతిథిగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందల సంఖ్యలో ఆటోలు, బైక్‌లతో కార్యకర్తలు క్రమశిక్షణతో ఈ ర్యాలీ నిర్వహించడం నగర ప్రజలను ఆకట్టుకుందన్నారు. ఇది సీపీఐ శ్రేణుల్లో మరింత ఉత్సాహాన్ని నింపిందన్నారు. కాగా, ర్యాలీలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఓపెన్ టాప్ జీప్‌పై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జగదీశ్, ఇండియా కూటమి నుంచి పోటీ చేస్తున్న సీపీఐ ఎమ్మెల్యే అభ్యర్థి జాఫర్, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వి.మల్లికార్జున, సీపీఐ సత్యసాయి జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, సహాయ కార్యదర్శులు నారాయణస్వామి, సి.మల్లికార్జున నిలబడి ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. ఈ ర్యాలీ బళ్లారి రోడ్డులోని ఎంజీ మెటాలిక్ పరిశ్రమ దగ్గర ప్రారంభమై నడిమి వంక, క్లాక్ టవర్ బ్రిడ్జి, సుభాష్ రోడ్డు, సప్తగిరి సర్కిల్, ఐరన్ బ్రిడ్జి, పాతూరు, నీలం టాకీస్, శ్రీకంఠం సర్కిల్, ఆర్టీసీ బస్టాండ్, చంద్ర హాస్పిటల్ వరకు దాదాపు 20 కిలోమీటర్ల మేర సాగింది. పెద్ద సంఖ్యలో సీపీఐ నాయకులు, కార్యకర్తలు ఎర్ర జెండాలు చేబూని నగరంలో కదం తొక్కారు. దీంతో ఎర్ర సముద్రం పొంగినట్లుగా ఉందని నగర ప్రజలు చర్చించుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జె.రాజారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు బి.కేశవ రెడ్డి, బి.రమణయ్య, సి.లింగమయ్య, ఎన్.శ్రీరాములు, పి.రామకృష్ణ, శ్రీశైలం రాజేష్ గౌడ్, సంతోష్ కుమార్, సహాయ కార్యదర్శి అల్లా పీరా, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు ఎ.పద్మావతి, మహిళా సమాఖ్య జిల్లా నాయకురాలు జయలక్ష్మి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జాన్సన్ బాబు, సీపీఐ అనంతపురం మండల కార్యదర్శి మేకల రమేష్, మండల నాయకులు రాకెట్ల రాము, కందుకూరు నాగరాజు, సీపీఐ బుక్కరాయసముద్రం నాయకులు బండి రామకృష్ణ, ఏఐటీయూసీ, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, ఆటో యూనియన్ తదితర యూనియన్ల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బీజేపీకి ఓటమి ఖాయం

ఇండియా కూటమి గెలుపు అనివార్యం

ముప్పాళ్ల నాగేశ్వరరావు

విశాలాంధ్ర-గుంటూరు: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వానికి ఓటమి ఖాయమని, ఇప్పటి వరకు జరిగిన మూడు విడతల ఎన్నికలలోనే కాకుండా 13వ తేదీన జరగబోతున్న నాలుగో విడత ఎన్నికల్లోను అదే రుజువు కాబోతుందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. గుంటూరు మల్లయ్య లింగం భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముప్పాళ్ల మాట్లాడుతూ మోదీ సర్కారు అవలంబిస్తున్న తప్పుడు విధానాల కారణంగా బీజేపీ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందన్నారు. చైతన్యవంతులైన ప్రజలు ముఖ్యంగా నిరుద్యోగులు, మేధావులు బీజేపీని ఓడించేందుకు సిద్ధమయ్యారని చెప్పారు. దేశంలో ఇండియా కూటమి అధికారంలోకి రాబోతుందని స్పష్టంచేశారు. వైసీపీ, టీడీపీ మోదీకి సాగిలపడటం రాష్ట్ర ప్రజలను బాధిస్తున్నదన్నారు. ఇండియా కూటమి గెలుపు అనివార్యమన్నారు. విభజన రాజకీయాలు చేస్తూ... దేశ సంస్కృతిని విచ్ఛిన్నం చేస్తున్న మోదీని, ఆయన పొత్తు, తొత్తు పార్టీలను ఓడించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల నేపథ్యంలో ప్రధాన పార్టీలు రకరకాల ప్రలోభాలకు ఓటర్లను గురి చేస్తున్నాయని, బహిరంగంగానే కోట్ల రూపాయలు పంపిణీ చేస్తుంటే రెవెన్యూ, పోలీస్, ఎన్నికల కమిషన్ ఏమి చేస్తున్నాయని ప్రశ్నించారు. ఇండియా కూటమి తరపున గుంటూరు పార్లమెంట్ సీపీఐ అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్‌కు కంకి కొడవలి గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

పార్లమెంట్‌లోనూ పోరాడుతా: జంగాల

ప్రజా సమస్యల పరిష్కారమే తన ప్రధాన అజెండా అని, దీనికోసం బయటే కాకుండా పార్లమెంట్‌లోనూ పోరాటం చేస్తానని గుంటూరు పార్లమెంట్ సీపీఐ అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్ చెప్పారు. ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు, రాజధాని నిర్మాణం వంటి అంశాలపై పార్లమెంట్లో ప్రజాగళం వినిపిస్తానని తెలిపారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమల ఏర్పాటు, రైతుకు గిట్టుబాటు ధర కోసం, రాష్ట్ర ప్రయోజనాల కోసం పార్లమెంట్ వేదికగా పోరాటం చేస్తానన్నారు. మోదీ మళ్లీ అధికారంలోకి వస్తే పేదలకు ఆకలి చావులు తప్పవని ఆరోపించారు. గుంటూరు పార్లమెంటు పరిధిలో టీడీపీ తరపున పోటీలో నిలిచిన పెమ్మసాని చంద్రశేఖర్ ఇన్నాళ్లు ఏమయ్యారని ప్రశ్నించారు. తనకున్న సామాజిక అవగాహన ఎంత అని నిలదీశారు. అమరావతి ఉద్యమం, ప్రత్యేక హోదా, విభజన హామీల అమలుకు జరిగిన పోరాటాలలో పెమ్మసాని ఎక్కడున్నారని ప్రశ్నించారు. కేవలం ధనబలంతో గెలవాలనుకోవడం అత్యాశే అవుతుందని అన్నారు. పెమ్మసానిని ఓడించడం అంటే ధన రాజకీయాలను ఓడించడమేనని అన్నారు. సమావేశంలో ఇప్టా జాతీయ కార్యదర్శి గని, సీపీఐ నాయకులు మేడా హనుమంతరావు, ఆకిటి అరుణ్ కుమార్, జంగాల చైతన్య పాల్గొన్నారు.

జంగాలకు కాపు జేఏసీ మద్దతు

జంగాల అజయ్ కుమార్‌కు ఆంధ్రప్రదేశ్ కాపు జేఏసీ మద్దతు తెలియజేసింది. గుంటూరు మల్లయ్య లింగం భవన్‌లో జంగాల అజయ్ కుమార్‌ను ఏపీ కాపు జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు అమ్మా శ్రీనివాస్ నాయుడు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ మద్దతు తెలియజేసి అజయ్ కుమార్‌ను సత్కరించారు. అనంతరం శ్రీనివాస్ నాయుడు మీడియాతో మాట్లాడుతూ పేదలు, బడుగు, బలహీన వర్గాల కష్టాలు తెలిసిన వ్యక్తి జంగాల అజయ్ కుమార్ అని అన్నారు. ఇటువంటి వ్యక్తిని పార్లమెంటుకు పంపాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. జంగాల ఎంపీగా గెలిస్తే గుంటూరు పార్లమెంట్ పరిధిలో నెలకొన్న తాగునీరు, రహదారుల సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. కాగా, తనకు మద్దతు తెలిపిన కాపుసంఘం నేతలకు కృతజ్ఞతలు తెలిపారు.

షర్మిల గెలుపు రాష్ట్ర రాజకీయాలకు మలుపు

సీపీఐ అభ్యర్థి గాలి చంద్రను గెలిపించండి: నారాయణ

విశాలాంధ్ర-కడప రూరల్: కడప పార్లమెంటుకు పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి వైఎస్ షర్మిల, కమలాపురం అసెంబ్లీ సీపీఐ అభ్యర్థి గాలి చంద్రలను గెలిపించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ పిలుపునిచ్చారు. కడపలో శనివారం నారాయణ మాట్లాడుతూ షర్మిల గెలిస్తే కేంద్ర మంత్రి అవుతుందని, రాష్ట్ర రాజకీయాల్లో భారీ మార్పులు సంభవిస్తాయన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తన తండ్రి పేరు చెప్పి అధికారంలోకి వచ్చి... తండ్రి ఆశయాలకు తిలోదకాలిచ్చారన్నారు. కమలాపురం నియోజకవర్గంలో 1952లో దివంగత నేత ఎస్.శివరామిరెడ్డి ఎమ్మెల్యేగా గెలిచి ప్రజాసేవ చేశారన్నారు. ఈ ప్రాంతం నుండి పోటీ చేస్తున్న గాలి చంద్ర విద్యార్థి దశ నుండి ప్రజా ఉద్యమానికి అంకితమై ప్రజా పోరాటాలకు నేతృత్వం వహించారన్నారు. ప్రజా సమస్యల పట్ల, ఈ ప్రాంతం పట్ల సమగ్రమైన అవగాహన కలిగిన గాలి చంద్రను గెలిపించడం ద్వారా నియోజకవర్గ అభివృద్ధి, షర్మిల గెలుపుతో జిల్లా సమగ్ర అభివృద్ధికి సులువు అవుతుందన్నారు.

పార్లమెంటు ఎన్నికలపై మీడియా చిన్నచూపు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణతో ఇంటర్వ్యూ

ఎన్నికల ప్రచారంలో ప్రజాస్పందన ఎలా ఉంది?

ఈ ఎన్నికలు భారతదేశానికి అత్యంత కీలక ఎన్నికలు. పార్లమెంటుతో పాటు రాష్ట్ర అసెంబ్లీకి కూడా జరుగుతున్నందున రాష్ట్ర ప్రజలు, ఓటర్లు ఈ ఎన్నికలను సీరియస్ గా తీసుకుంటున్నారు. కానీ తెలుగు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మాత్రం పార్లమెంట్ ఎన్నికలకు ఉన్న ప్రాధాన్యతను తగ్గించి, అసెంబ్లీ ఎన్నికలపైనే కేంద్రీకరిస్తున్నారు. ప్రధానమైన మీడియాలు వేరుపడి వైసీపీ ప్రభుత్వానికి కొంతమంది అనుకూలంగా ఉంటే, మరి కొన్ని సంస్థలు వ్యతిరేకంగా ఉన్నారు. మేజర్ మీడియా సంస్థలన్నీ కూడా అసెంబ్లీ ఎన్నికల చుట్టూ కేంద్రీకరించి ప్రజాభిప్రాయాన్ని మలచడానికి ప్రయత్నిస్తున్నారు. పార్లమెంటు ఎన్నికలకు జాతీయస్థాయిలో ఉన్న ప్రాధాన్యతను ఇక్కడ ప్రజలకు తెలియజేయకపోవడం వల్ల కొంత నష్టం జరుగుతుంది. ఏది ఏమైనా ఈ ఎన్నికల్లో ఇండియా కూటమి గెలవాలన్న ప్రాధాన్యతను మేము ప్రజలకు వివరిస్తున్నాము. మోదీ అధ్వర్యంలో ఉన్న ఎన్డీఏ కూటమిని ఓడించాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాము.

వైసీపీ, టీడీపీ కూటమిని ఓడించాలని మీరు చెబుతున్నారు. మరి ప్రత్యామ్నాయం?

వైసీపీ సొంతంగా పోటీ చేస్తున్నది. తెలుగుదేశం పార్టీ మాత్రం జనసేన, బీజేపీతో కల్సి పోటీ చేస్తుంది. కేంద్రం విషయంలో ఈ రెండు పార్టీలు బీజేపీని బలపరుస్తున్నాయి. అందువల్ల వారిద్దరినీ ఓడించాలంటే... ఇండియా కూటమికి ఓటు వేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం. అయితే ఇండియా కూటమి అంత బలంగా లేదు కాబట్టి ఇటువంటి అనుమానాలు వచ్చే అవకాశం ఉంది. కానీ ప్రజలు ఇది తమ కర్తవ్యంగా భావించి ఎన్డీఏ కూటమిని ఓడించాలని అనుకుంటే పెద్ద విషయం కాదు. మేమైతే రాష్ట్రంలో జగన్ ప్రభుత్వాన్ని సాగనంపాలని, ఎన్డీఏ కూటమిని ఓడించాలని, ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరుతున్నాం.

సీపీఐ, సీపీఎం విలీనం సాధ్యమేనా?

సీపీఐ, సీపీఎం పార్టీలు ఐక్యంగా పనిచేస్తూనే విలీనం కావడం జరుగుతుంది. కాబట్టి ఐక్యత కంటే విలీనం కావాలి అనేది దీర్ఘకాలిక లక్ష్యం. అది సాధించాలంటే ఐక్య కార్యాచరణ ముఖ్యం. ఇందుకోసం దేశవ్యాప్తంగా గత రెండు దశాబ్దాలుగా సీపీఐ, సీపీఎం, ఇతర వామపక్ష శక్తులు కల్సి పనిచేస్తున్నాయి. ముఖ్యంగా సీపీఐ, సీపీఎం దాదాపు అన్ని రాష్ట్రాల్లో ఉద్యమాల్లోనే కాక, ఎన్నికల్లో కూడా పరస్పరం పోటీలు నివారించుకుని కలిసికట్టుగా సహకరించు కుంటున్నాం. ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఎన్నికల్లో కలిసి పోటీ చేస్తున్నాము. అయితే విలీనం అనేది కచ్చితంగా జరగాలి. అది ఎంత తొందరగా జరిగితే అంత మంచిది. ఆలస్యమవుతోంది కాబట్టి సహజంగా ప్రజలు, వామపక్ష అభిమానులు, కష్టజీవులు సాధ్యమైనంత త్వరగా కమ్యూనిస్టు పార్టీల విలీనం జరగాలని కోరుకుంటున్నారు. అయితే విలీనం జరగాలంటే ముందుగా ఐక్య కార్యాచరణ జరగాలి. అటువంటి ఐక్య కార్యాచరణ ప్రస్తుం కొనసాగుతుందని భావిస్తున్నాను.

ఇండియా కూటమి పార్టీల మధ్య ఓట్ల బదిలీలో సమస్యలు ఉన్నాయా?

ఇండియా కూటమి విషయంలో రాష్ట్రానికి, రాష్ట్రానికి మధ్య కొంత తేడాలు ఉన్నాయి. కొన్ని రాష్ట్రాలలో ఇండియా కూటమి పార్టీల మధ్యనే పోటీ ఉంది. ఉదాహరణకు కేరళలో కాంగ్రెస్ ఆధ్వర్యంలోని యూడీఎఫ్, సీపీఎం ఆధ్వర్యంలోని ఎల్డీఎఫ్ ఆధ్వర్యంలో పోటీ జరుగుతోంది. అక్కడ బీజేపీ ఒక స్థానంలో కూడా గెలిచే పరిస్థితి లేదు. అలాగే పశ్చిమ బెంగాల్‌లో ఇండియా కూటమి పార్టీలు తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఒకవైపు, మరోవైపు కాంగ్రెస్, వామపక్ష పార్టీలు మరోవైపు పోటీ చేస్తున్నాయి. దీనివల్ల స్థానికంగా కొద్దిపాటి సమస్యలు ఉంటాయి. అయితే మిగిలిన చోట్ల ఇబ్బందుల్లేవు. కూటమి పార్టీల మధ్య ఉన్న అవగాహన మేరకు కచ్చితంగా ఓట్లు బదిలీలు జరుగుతాయి.

రాష్ట్రంలో ఇండియా కూటమి అభ్యర్థుల విజయావకాశాలు ఎలా ఉన్నాయి ?

రాష్ట్రంలో ఇండియా కూటమి ఏర్పడటం, కలిసి ప్రయాణం చేయడం చాలా ఆలస్యంగా ప్రారంభమైంది. పైగా రాష్ట్రంలో రెండు ప్రధానమైన ప్రాంతీయ పార్టీల చుట్టూ రాజకీయాలు నడుస్తున్నప్పుడు కూటమిని ముందుకు తీసుకుపోవడం కనీసం ఒక సంవత్సరం ముందు నుంచి ప్రారంభిస్తే కచ్చితంగా మంచి ఫలితాలు వచ్చి ఉండేవి. సమయం చాలా తక్కువగా ఉన్నప్పటికీ...ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, ఒకచోట సీపీఐ లిబరేషన్ పార్టీలతో కలిసి సీట్ల సర్దుబాటు చేసుకుని పోటీ చేస్తున్నాము. అయితే ప్రజలు ఏ మేరకు ఆదరిస్తారనేది ఆలోచించాలి. అయితే ఈ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న నాకు అర్థమైనది ఏమిటంటే మైనార్టీలు ముస్లిం, క్రిస్టియన్లు బాగా స్పందిస్తున్నారు. ఎన్డీఏ ప్రభుత్వం పోవాలి. ఇండియా కూటమి అధికారంలోకి రావాలి. ఈ దేశ భవిష్యత్ కోసం, ముఖ్యంగా తమ భవిష్యత్ బావుండాలన్నా ఇండియా కూటమి రావాలన్న ఆకాంక్ష వారిలో స్పష్టంగా కనపడింది.

మితిమీరిన ఉచిత పథకాలు రాష్ట్ర అభివృద్ధికి దోహదపడతాయా ?

సంక్షేమ కార్యక్రమాలు అనేవి కచ్చితంగా ఉండాలి. సంక్షేమ కార్యక్రమాల్లో మితిమీరిన ఉచిత పథకాలు అనేవి ఏమీ ఉండవు. సమాజంలో పేద మధ్య, ధనిక అనే తారతమ్యాలు ఉన్నంతకాలం అది ఏ ప్రభుత్వమైనా సరే సంక్షేమ పథకాలు అమలు చేయాల్సిందే. అయితే పార్టీలకు వేర్వేరు ప్రాధాన్యతలుంటాయి. ఒకరు విద్యకు ప్రాధాన్యమిస్తే, మరొకరు ఇంకో కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తారు. సంక్షేమ పథకాల వల్ల అభివృద్ధి ఆగిపోతుందనడం కరెక్ట్ కాదు. సంక్షేమ కార్యక్రమాలు కొనసాగిస్తూనే అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలి. అభివృద్ధి ఉంటే తప్ప ఆదాయం మెరుగుపడదు.

రాష్ట్ర సమగ్రాభివృద్ధికి మీరిచ్చే సలహాలు, సూచనలు ఏమిటి ?

రాష్ట్ర ప్రగతికి వ్యవసాయ, పారిశ్రామిక, ఐటీ, సర్వీస్ సెక్టార్‌లు అభివృద్ధి చెందాలి. మౌలిక వసతులు మెరుగుపడాలి. అప్పుడే అక్కడ ఉపాధి దొరుకుతుంది. ఉద్యోగాలు లభిస్తాయి. తద్వారా ఆప్రాంతం అభివృద్ధి చెందడంతో పాటు, ప్రజల్లో కూడా జీవన ప్రమాణస్థాయి పెరుగుతుంది. రాష్ట్రంలో ఉత్తరాంధ్ర, రాయలసీమ,ప్రకాశం జిల్లాలోని కొన్ని ప్రాంతాలు వెనుకబడి ఉన్నాయి. ఈ ప్రాంతాలకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చి ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తి చేయడంతోపాటు, తాగునీరు, సాగునీరు ఇవ్వాలి. పారిశ్రామిక నగరాలు అభివృద్ధి చేయాలి. ఉపాధి అవకాశాలు గణనీయంగా పెంచాలి. దానికోసం ఒక స్పృహతో కూడిన ప్రయత్నమేదీ గత ఐదేళ్లలో, అంతకుముందు చంద్రబాబు పాలనలోనూ సాగలేదు.

ఏపీ ఓటర్లకు మీరు ఇచ్చే సందేశం ఏమిటి ?

రాష్ట్రంలో నియంత పాలన కొనసాగుతోంది. ఒక శాడిస్ట్ ఈ రాష్ట్రాన్ని పరిపాలిస్తున్నాడు. ఈ శాడిస్టును కచ్చితంగా గద్దె దింపాలి. అలాగే కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్ర మోదీ ప్రభుత్వం దేశానికే ప్రమాదకరమైనది. బీజేపీ రాజ్యాంగానికే ఎసరు పెడుతోంది. బీజేపీ బహిరంగంగా మతాన్ని రెచ్చగొట్టి రాజకీయ లబ్ధికి యత్నిస్తోంది. పైగా సొంతంగా అధికారంలోకి వస్తే మేము రాజ్యాంగాన్ని మారుస్తాం అంటున్నారు. రాజ్యాంగాన్ని మారిస్తే దేశం ఐక్యంగా ఉండదు. అందువల్ల ఈ దేశాన్ని రక్షించుకోవడానికి, రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడానికి, లౌకిక వాదాన్ని కాపాడుకోవడానికి, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవడానికి మనందరం ఏకం కావాలి. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దింపడమే లక్ష్యంగా ప్రజలందరూ తమ ఓటు అనే ఆయుధాన్ని ఉపయోగించాలని కోరుకుంటున్నాను.

బీజేపీకి వైసీపీ, టీడీపీ లొంగిపోయాయి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుతో ఇంటర్వ్యూ

ఎన్నికల ప్రచారంలో ప్రజా స్పందన ఎలా ఉంది ?

వామపక్షాల పట్ల ప్రజలు సానుకూలంగా ఉన్నారు. సానుభూతిగా ఉన్నారు. ధన బలం ముందు ప్రజాబలం ప్రస్తుతం బలహీనంగా ఉంది. రాష్ట్ర ప్రజలు రెండు శిబిరాల మధ్య చీలిపోయున్న నేపథ్యంలో బీజేపీకి వ్యతిరేకంగా పోరాడుతున్న వామపక్షాలకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. అది ఈ ఎన్నికల్లో బయటపడుతోంది. బీజేపీని వ్యతిరేకించే లౌకిక అభ్యుదయ శక్తులు ఇండియా కూటమి వైపు చూస్తున్నాయి. బీజేపీ పై రాష్ట్ర ప్రజలలో తీవ్ర ఆగ్రహం ఉంది. వైసీపీ పై వ్యతిరేకత ఉంది. తెలుగుదేశం పార్టీ పట్ల విశ్వాసం లేదు. ఈ మధ్యలో వామపక్షాలు బలపడేందుకు అనువైన వాతావరణం ఏర్పడుతున్నది. దానికోసం మేము ఈ ఎన్నికల్లో కృషి చేస్తున్నాము.

వైసీపీ, టీడీపీ కూటమిని ఓడించాలని చెపుతున్నారు. రాష్ట్రంలో ఈ రెండు పార్టీలే ప్రధానం. మరి ప్రత్యామ్నాయమేంటి ?

జాతీయ పరిస్థితికి భిన్నంగా మన రాష్ట్రంలో ప్రత్యేక పరిస్థితి ఉన్నది. ఇక్కడున్న రెండు ప్రధాన పార్టీలు బీజేపీకి లొంగిపోయాయి. టీడీపీ, జనసేన బీజేపీతో పొత్తులో ఉంటే, వైసీపీ తొత్తుగా వ్యవహరిస్తున్నది. రేపు ఎవరు గెలిచినా బీజేపీకే మద్దతు ఇస్తారు. కేంద్రంలో బీజేపీ రాకూడదు అనుకునే వాళ్ళు ఎవరైనా ఈ రెండింటినీ కూడా (ఎన్‌డీఏ, వైసీపీని) ఓడిస్తేనే సాధ్యం. రాష్ట్రంలో టీడీపీ, వైసీపీ రెండు ప్రధాన పక్షాలయినప్పటికీ జాతీయ స్థాయిలో బీజేపీకి ప్రత్యామ్నాయంగా ముందుకు వస్తున్న ఇండియా కూటమి ప్రభావం మన రాష్ట్రంపై కూడా ఉన్నది. ప్రస్తుతం మన రాష్ట్రంలో కూడా ఇదే ప్రత్యామ్నాయం.

సీపీఐ, సీపీఎంల ఐక్యత కంటే ప్రజలు విలీనం కోరుకుంటున్నారు. సమీప భవిష్యత్తులో అది సాధ్యమేనా ?

కమ్యూనిస్టు పార్టీలు సైద్ధాంతిక, రాజకీయ ఐక్యతపై ఆధారపడి పని చేస్తాయి. మన దేశ నిర్దిష్ట పరిస్థితుల్లో అనుసరించాల్సిన విప్లవ వ్యూహంపై కమ్యూనిస్టు పార్టీల మధ్య అభిప్రాయభేదాలు ఉన్నాయి. ఈ విషయంలో ఐక్యత కుదిరితే విలీనం అసాధ్యమేమీ కాదు. రోజువారి ప్రజా ఉద్యమాలలో పార్లమెంటరీ ఎన్నికలలో ముందు ఐక్యత సాధించడం దానికి ఒక ముఖ్య షరతుగా ఉంటుంది. ఐక్య ఉద్యమాలు, ఐక్య కార్యాచరణ ద్వారా మాత్రమే దీన్ని సాధించగలం. దేశంలో వామ పక్ష ప్రజాతంత్ర శక్తుల ఐక్యత కోసం సీపీఎం శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నది. పార్లమెంటరీ అవకాశవాదంతో పార్టీలు కలిసినా ఆ కలయిక ఎక్కువ కాలం నిలబడదు. నేపాల్ అనుభవం దీన్నే తెలియజేస్తున్నది. కమ్యూనిస్టులకు భౌతిక పరిస్థితులు అనుకూలంగా లేనప్పుడు రెండు పార్టీలు కలిసినా సాధించేది తక్కువే. భౌతిక పరిస్థితి అనుకూలంగా వచ్చినప్పుడు దాన్ని సరిగా ఉపయోగించుకోగలిగిన పార్టీ ముందడుగు వేస్తుంది. ఆ క్రమంలో కమ్యూనిస్టు ఉద్యమం ఐక్యత సాధిస్తుంది. అందువల్ల తాత్కాలిక ఎత్తుగడల్లో ఎప్పటికప్పుడు కుదిరే ఐక్యత కన్నా విలీనం అనేది మరింత తీవ్రమైన విషయం. ఇది ఒక సిద్ధాంత రాజకీయ ఐక్యత పై ఆధారపడి ఉంటుంది. ఆ విషయంలో రెండు కమ్యూనిస్టు పార్టీలు ఐక్యమవడానికి మరి కొంత సమయం పట్టవచ్చు. విలీనం ప్రస్తుతానికి ఒక లక్ష్యం మాత్రమే. ఆ దిశగా చాలా కృషి సాగాల్సి ఉంది.

ఇండియా కూటమి పార్టీల మధ్య ఓట్ల బదిలీలో ఏమైనా సమస్యలున్నాయా?

రాష్ట్రంలో ఇండియా కూటమి పార్టీల మధ్య ఓట్ల బదిలీ విషయంలో పెద్దగా సమస్యలు లేవు. స్థానికంగా అక్కడక్కడ కొన్ని సమస్యలు ఉంటే వాటిని పరిష్కరించుకుంటున్నాము. రానున్న రోజుల్లో ఈ ఐక్యత మరింత బలపడుతుందని ఆశిస్తున్నాను.

రాష్ట్ర సమగ్రాభివృద్ధికి మీరిచ్చే సలహాలు, సూచనలు ఏమిటి ?

రాష్ట్ర సమగ్రాభివృద్ధి జరగాలంటే పరిశ్రమలు వ్యవసాయం అభివృద్ధి కావాలి. ఈ అభివృద్ధి ప్రణాళిక మండల జిల్లా ప్రాతిపదికపై ఉండాలి. అధికార వికేంద్రీకరణ ముఖ్యమైన సాధనం. చేసుకోగలిగిన వారికి ప్రతి ఒక్కరికి కనీసం రెండు ఎకరాలు అయినా భూమి పండించటానికి ఆర్థిక సహాయం పంటకు గిట్టుబాటు ధర ఇవ్వగలిగితే గ్రామీణ ఆదాయం పెరుగుతుంది. తద్వారా ప్రజల కొనుగోలు శక్తి పెరిగి పారిశ్రామిక సరుకులకు డిమాండ్ పెరుగుతుంది. కొత్త పరిశ్రమల అవసరం అవుతాయి. ఆ పరిశ్రమల్లో విద్యావంతులకు ఉద్యోగాలు దొరుకుతాయి. ఇప్పుడున్న పాలకవర్గాలు విదేశీ పెట్టుబడులపై విదేశీ మార్కెట్ పై ఆధారపడి అభివృద్ధి సాధిస్తామన్నారు. అందుకోసమే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్ట్ మీద దృష్టి పెడుతున్నారు. దేశంలో మోదీ, రాష్ట్రంలో జగన్, చంద్రబాబు ఇద్దరూ ప్రజల ఆదాయాలను వనరులను బడా కార్పొరేట్ కంపెనీలకు దోచి పెట్టే విధానాలనే అనుసరిస్తున్నారు.

రాష్ట్రంలో ఇండియా కూటమి అభ్యర్థుల విజయావకాశాలు ఎలా ఉన్నాయి?

రాష్ట్రంలో ఇండియా బ్లాక్ పార్టీలకు మంచి ఓట్లు వస్తాయని భావి స్తున్నాను. జయాపజయాలు ప్రజలిచ్చే తీరుపై ఆధారపడి ఉంటుంది. మా వరకు ప్రజలకు అన్ని విషయాలు చెప్పి ఇండియా బ్లాక్ వైపు ఓట్లు వేసేందుకు చేయ గలిగిన కృషి చేస్తున్నాము.

పార్టీ ఫిరాయింపుల కట్టడికి మీరిచ్చే సూచనలు ఏమిటి ?

పార్టీ ఫిరాయింపుల చట్టం గతంలో రాజీవ్ గాంధీ హయాంలో తెచ్చారు. అది ఇప్పుడు నిరుపయోగం అయిపోయింది. నిర్జీవం అయింది. ఎన్నికైన ప్రజా ప్రతినిధులు ఒక పార్టీ నుంచి ఇంకొక పార్టీకి జంపు చేస్తున్నారు. దీనికి ప్రధాన కారణం రాజకీయాల్లోకి కార్పొరేట్లు ప్రత్యక్షంగా దిగడమే. కార్పొరేట్ ప్రతినిధులు కాకుండా ప్రజా ప్రతినిధులు ఉంటే దీన్ని చాలా వరకు అరికట్టవచ్చు.

సంక్షేమం పేరుతో మితిమీరిన ఉచిత పథకాలు రాష్ట్ర అభివృద్ధికి దోహదపడతాయా ?

సంక్షేమ పథకాలను ఉచిత పథకాలనడం భావ్యం కాదు. అది ప్రజల హక్కు. మొత్తం జీడీపీలో అత్యధిక భాగం కార్పొరేట్ కంపెనీలకు పోతున్నది. ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయి. అందులో ఒక చిన్న భాగం సంక్షేమ కార్యక్రమాల పేరుతో తిరిగి ప్రజలకు పంపిస్తున్నారు. లేకుంటే ప్రజలు తిరగబడతారని వారి భయం. పథకాల వల్ల ప్రజలకు వచ్చే ఆదాయాలు పెరిగి కొనుగోలు శక్తిగా మారి తిరిగి అభివృద్ధికి తోడ్పడతాయి. అయితే దీనివల్ల మౌలిక అభివృద్ధి జరగదు. అది జరగాలంటే ప్రభుత్వ రంగం బలపడాలి. ఉద్యోగ అవకాశాలు పెరగాలి. వ్యవసాయం అభివృద్ధి కావాలి. ప్రభుత్వం వీటి కన్నా ఉత్పత్తి తో సంబంధం లేని రియల్ ఎస్టేట్, ఫైనాన్స్ షేర్ మార్కెట్ లాంటి వాటిపై ఎక్కువ దృష్టి సారిస్తున్నది. ఈ ప్రయోగం విఫలమై సంక్షోభం వచ్చింది. ఈ సంక్షోభంలో ప్రజలకిచ్చే పథకాల డబ్బు కూడా తమకే కేటాయించాలని బడా కార్పొరేట్లు కోరుతున్నారు. అందుకే పథకాలపై దాడి చేస్తున్నారు.

ఏపీ ఓటర్లకు మీరిచ్చే సందేశం ఏమిటి ?

ఆంధ్రప్రదేశ్ ప్రజలు చైతన్యవంతులైన వారు. జమిందారీ విధానాన్ని రద్దు చేయించడం మొదలుకొని భాషా ప్రయుక్త రాష్ట్రాలు, భూ పోరాటాలు,ప్రజాస్వామ్య పర్యవేక్షణ ఉద్యమాలు, రైతాంగ ఉద్యమాలు, కార్మిక ఉద్యమంలో అనేక అంశాల్లో ప్రజలు ముందుండి నడిచారు. గతంలో ఆదరించారు. ఇప్పుడు డబ్బున్న పార్టీ లు నోట్ల కట్టలు వెదజల్లడంపై ప్రజలు ఆకర్షితులవుతున్నారు. ఈ ఆకర్షణ ఎంతోకాలం నిలవదు. సంపన్నుల చట్ట సభల్లో తమ ప్రయోజనాలు చూసుకుంటున్నారు. ప్రజల ప్రయోజనాలు కాపాడి, అన్యాయం అక్రమాలను ప్రశ్నించి ప్రజలకు ఏక్కువ సౌకర్యాలు కల్పించగలిగేందుకు గత పది సంవత్సరాలుగా అసెంబ్లీలో కమ్యూనిస్టులు లేని లోటు కనిపిస్తున్నది. ఈ ఎన్నికల్లో కమ్యూనిస్టులకు ఎన్నుకొని అసెంబ్లీలో ప్రాతినిధ్యం కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra